www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 20-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 34 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి ఉ.5.52 తదుపరి అష్టమి తె.4.55 వరకు, నక్షత్రం: ధనిష్ఠ రా.7.32 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.2.33-4.07, దుర్ముహూర్తం: ఉ.8.20-9.11, రా.10.16-10.59, అమృతఘడియలు: ఉ.9.07-10.43, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బియ్యం ఉత్పత్తిలో సస్యశ్యామల భారతం



చైనాను దాటి.. భారత్ రికార్డు

14.9 కోట్ల టన్నులతో ముందంజ

2వ స్థానంలో చైనా.. 14.46 కోట్ల టన్నులు

గోధుమ ఉత్పత్తిలో భారత్‌కు రెండో స్థానం

పడిపోతున్న నూనె గింజల ఉత్పత్తి

11

కుంకీలొస్తున్నాయ్

రేపు కర్ణాటక నుంచి రాష్ట్రానికి

సిద్దరామయ్య, పవన్ సమక్షంలో ఆరు అప్పగింత

చిత్తూరు జిల్లా పలమనేరులో ఎలిఫెంట్ క్యాంపు

50 ఎకరాల్లో ఏనుగుల కోసం సౌకర్యాలు

రాష్ట్రంలో ఎక్కడ గజరాజులు దాడిచేసినా ఈ కుంకీలతోనే పరిష్కారం

గత ఆగస్టులోనే కర్ణాటకతో ఒప్పందం



(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

పంట పొలాలపై దాడి చేసే ఏనుగులను తరిమికొట్టడానికి కుంకీ ఏనుగులు రాష్ట్రానికి వస్తున్నాయి. బుధవారం కర్ణాటక నుంచి ఆరు కుంకీ ఏనుగుల్ని చిత్తూరు జిల్లాకు తీసుకురానున్నారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో వాటిని అప్పగించనున్నారు. కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ విషయాన్ని వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కుంకీ ఏనుగులు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్ణాటక ప్రభుత్వాన్ని కోరడం, ఆ రాష్ట్రం

మిగతా 13వ పేజీలో...



పాక్ ఎంబసీకి కేక్ తీసుకెళ్లిన వ్యక్తితో జ్యోతి

విలాసవంతమైన జీవితం!

ఎక్కడికి వెళ్లినా ఖరీదైన హోటళ్లు, కార్లు

ఇదీ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా జీవన శైలి

ఈ ఏడాది జనవరిలో పహల్గాంలో పర్యటన

వీడియోలు తీసి పాక్ ఏజెంట్లకు చేరవేత?

ఉగ్రదాడి తర్వాత ఢిల్లీలో పాక్ ఎంబసీకి కేక్ తెచ్చిన వ్యక్తితో ఫొటో దిగిన జ్యోతి!

2

పేలుళ్లకు రంపలో రిహార్సల్స్

ఆరు మాసాల్లో రెండు సార్లు సౌదీకి

సహకార బ్యాంకులో ఖాతా, లాకర్

దాని నుంచే ఆర్థిక లావాదేవీలు

విజయనగరం ఉగ్రసానుభూతిపరుడు

సిరాజ్ రెహ్మాన్‌పై కూపీలాగిన పోలీసులు

రంగంలోకి ఎన్ఐఏ.. ముమ్మర విచారణ

సిరాజ్ కుటుంబ సభ్యులకూ ప్రశ్నలు

సిరాజ్, సమీర్‌లను కస్టడీకి కోరిన పోలీసులు

2



మీ నాయకత్వ ప్రతిభ అద్భుతం!

సీఎం చంద్రబాబుకు బిల్ గేట్స్ ప్రశంసలు

టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు

మీ విజన్‌కు ఏఐ ఆధారిత నిర్ణయాలు, మానవ అభివృద్ధి వంటివి నిదర్శనం

13

మీరు చేస్తున్న కృషి ఏపీకే కాదు.. భారత్ సహా అల్పాదాయ దేశాలకూ ఎంతో ఉపయోగం

మన భాగస్వామ్యం అద్భుతంగా పురోగమిస్తుంది

రాష్ట్ర భవిష్యత్ కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

ముఖ్యమంత్రికి రాసిన లేఖలో గేట్స్ వ్యాఖ్యలు

లోపాలకు చెక్

ప్రజలిచ్చే ఫీడ్‌బ్యాక్‌తో మార్పులు చేయాలి: సీఎం

సేవలు, పథకాలపై పూర్తి సంతృప్తి రావాలి

కొన్ని శాఖల్లో పరిస్థితి మెరుగైంది

ఆర్టీసీలో సౌకర్యాలు, సేవలు మెరుగుపడాలి

జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీలు

డేటా అనలిటిక్స్‌తో ప్రజాభిప్రాయం తెలుసుకుంది

12 కల్లా వాట్సాప్ గవర్నెన్స్‌లో 500 సేవలు

3 ఉచిత సిలిండర్ల సొమ్ము ముందే జమ

పథకాలు, సేవలపై సమీక్షలో ముఖ్యమంత్రి వెల్లడి

నేడు కేబినెట్ భేటీ

ఏడాది పాలనపై కీలక చర్చ 12



ప్రభుత్వ సేవలు, పథకాల అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తోందని.. అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి రావలసిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ లాంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని చెప్పారు. ఈ లోపాలను సరిచేసేందుకు జూన్ 12 తర్వాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ప్రకటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, వివిధ సేవలపై సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి వారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమీక్షిస్తున్న ఆయన.. తాజాగా రేషన్, దీపం-2, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో

మిగతా 13వ పేజీలో...

ఆ కల్తీ సారా మరణాల గుట్టు తేల్చండి

వైసీపీ హయాంనాటి మరణాలపై టాస్క్‌ఫోర్స్

జంగారెడ్డిగూడెంలో 2022లో మరణ మృదంగం

తొమ్మిది రోజుల్లో 20మందికిపైగా మృత్యువాత

వాంతులు, కడుపునొప్పి, నిస్సత్తువ, పల్స్ డౌన్ వంటి లక్షణాలు మృతులందరిలో కనిపించిన వైనం

కానీ, సహజ మరణాలుగా కొట్టేసిన వైసీపీ సర్కారు

అసెంబ్లీలోనూ, బయటా అప్పట్లో తీవ్ర నిరసనలు

నాడు ఏం జరిగిందో నెలరోజుల్లోగా నిగ్గు తేల్చండి

స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను కోరిన సీఎస్ విజయానంద్

ఏలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో మూడేళ్ల క్రితం చోటుచేసుకున్న కల్తీ సారా మరణాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఆ ఘటనలో అప్పట్లో 20 మందికి పైగా మరణించారు. గత ప్రభుత్వం ఈ మరణాలను ధ్రువీకరించకుండా

మిగతా 14వ పేజీలో...

అమరావతిలో గలీజు పని

అడ్డగోలుగా లీజు కొట్టేయాలని గనుల శాఖ కీలక వ్యక్తి మంత్రాంగం

నిబంధనలకు భిన్నంగా సీఆర్‌డీఏ జోన్‌లో తోడల్లుడికి మైనింగ్ లీజుకు యత్నం

గుంటూరులోని అధికారి ద్వారా ప్రతిపాదన

ఉన్నతాధికారి బ్రేక్.. సీఎంఓకు నివేదిక

సీఎంఓ ఆదేశాలతో అధికారికి షోకాజ్

ఉన్నతాధికారిపై కీలక వ్యక్తి ఆగ్రహం

మరోసారి సీఎంఓకు చేరిన పంచాయితీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలోని ఓ కీలక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా తన తోడల్లుడికి అమరావతిలో మైనింగ్ లీజు ఇప్పించాలని ప్రయత్నించారు. ఈ ప్రతిపాదనకు ఓ ఉన్నతాధికారి బ్రేక్ వేయడంతో విషయం ముఖ్యమంత్రి కార్యాలయం దాకా వెళ్లింది. ప్రతిపాదన పంపిన అధికారికి షోకాజ్ నోటీసు

మిగతా 14వ పేజీలో...

మదనపల్లెలో పెద్దిరెడ్డి కబ్జా

1.35 ఎకరాల్లో స్తంభాలు నాటి ఫెన్సింగ్

రెవెన్యూ అధికారుల సర్వేలో గుర్తింపు

హద్దులు నిర్ణయించి స్వాధీనం

సిమెంటు స్తంభాలు, కంచె తొలగింపు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఇది ప్రభుత్వ స్థలమంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె శివారులోని బీకే పల్లె సర్వే నంబర్ 552లోని భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేశారు. ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు తేలింది. ఈ సర్వే నంబర్‌లో 10.05 ఎకరాలు ఉండగా.. అందులో ఓ మాజీ సైనికుడి కుటుంబం నుంచి సర్వే నంబర్ 552-7లో 3.40 ఎకరాలు, సర్వే నంబర్ 552-8లో 0.50 ఎకరాలను పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత పేరుతో కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఇందులో బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్‌కు 18 సెంట్లు పోయింది. అదే 552-7కు ఆనుకుని ఉన్న 552-1 పార్టులో

మిగతా 14వ పేజీలో...



భారత్ ధర్మసత్రం కాదు!

ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బందులు 11

శరణార్థుల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు

ఆశ్రయం కోరిన శ్రీలంక జాతీయుడి పిటిషన్ తిరస్కరణ

మధ్యప్రదేశ్ మంత్రిపై 'సిట్'

కల్నల్ సోఫియాపై అనుచిత వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

విజయ్‌షా క్షమాపణలో నిజాయితీ లేదు

ఆయన వ్యాఖ్యలతో దేశం సిగ్గుపడుతోందన్న ధర్మాసనం 2



బెంగళూరులో వర్ష బీభత్సం

నగరంలో ఎడతెరిపి లేకుండా వాన

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

పలు కాలనీల్లో ఇళ్లలోకి చేరిన నీరు 12

డిగ్రీలో క్వాంటమ్ కంప్యూటింగ్

ఒక పేపర్ తప్పనిసరిగా అమలు

ఉన్నత విద్యామండలి చైర్మన్ వెల్లడి

ఉపాధ్యాయ సంఘాలతో కొలిక్కిరాని చర్చలు

12

మీడియం, విద్యార్థుల నిష్పత్తిపై సంఘాల పట్టు

రేపు డీఈవో ఆఫీసుల ముట్టడి యథాతథం

సంఘాల ప్రతినిధులతో అధికారుల సుదీర్ఘ చర్చలు



పాకిస్థాన్ గుడిలో ఘంటసాల పాట!

హైదరాబాద్, మే 19: వేరే రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ మనకు తెలుగు మాట వింటేనే ప్రాణం లేచి వచ్చినట్టు అనిపిస్తుంది! అలాంటిది.. వేరే దేశంలో.. అందునా పాకిస్థాన్‌లో తెలుగు మాట కాదు.. గాన గంధర్వుడు మన ఘంటసాల పాడిన సూపర్‌హిట్ పాట ఒకరి నోట వినిపిస్తే? గూఢచర్యం ఆరోపణలపై ఇటీవల అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వీడియోలో అలాంటి అద్భుతమే కనిపించింది. రెండు నెలల క్రితం ఆమె పాకిస్థాన్‌లోని 'కటాస్‌రాజ్' ఆలయానికి వెళ్లి.. ఆ గుడి ప్రాశస్త్యాన్ని వివరించే వీడియోను తన యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో 6.50 నిమిషాల వద్ద.. ఆమె ఆ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటుండగా 'భూకైలాస్'లోని 'రాముని అవతారం రవికుల సోముని అవతారం' అనే పాట వినిపిస్తుంది. లోపల ఒక పెద్దాయన కూర్చుని భక్తిగా ఆ పాట పాడుతున్న దృశ్యం కనిపిస్తుంది. ఈ వీడియో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అవుతోంది.

విలాసవంతమైన జీవితం!

- ఎక్కడికి వెళ్లినా ఖరీదైన హోటళ్లు, కార్లు
- ఇదీ యూట్యూబర్ జ్యోతిమల్హోత్రా జీవన శైలి

చండీగఢ్, మే 19: హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై మరిన్ని సంచలన వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆమె ఖరీదైన జీవన శైలిని సాగిస్తోంది. ఆమె ఆదాయానికి సాగించే జీవన శైలికి పొంతన లేదు. విమానాల్లో ఎప్పుడూ మొదటి తరగతిలోనే ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ ఖరీదైన రెస్టారెంట్లలోనే భోజనం చేసేది. ఆమె పాక్ పర్యటన ఖర్చంతా స్పాన్సర్డే అని భావిస్తున్నారు. అంతేగాక పాక్ పర్యటన నుంచి వచ్చిన వెంటనే ఆమె చైనాపర్యటనకు వెళ్లింది. అక్కడ కూడా లగ్జరీ కార్లలో ప్రయాణించింది. అత్యంత ఖరీదైన నగల షాపులకు వెళ్లింది. ఈమె ఈ ఏడాది జనవరిలో కశ్మీర్‌లోని పహల్గాం వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మూడు నెలలకే అక్కడ ఉగ్రదాడి జరిగింది. ఐదు రోజుల కశ్మీర్ పర్యటనలో భాగంగా ఆమె పహల్గాం వెళ్లింది. అక్కడ వీడియోలు తీసింది. వీటిని పాక్ ఏజెంట్లకు చేరవేసిందా? ఉగ్రదాడికి, ఈమె పర్యటనకు సంబంధం ఉందా...? అనే విషయాన్ని పోలీసులు విచారిస్తున్నారు. కాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను నిలిపివేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఆమె ఢిల్లీలోని పాక్ ఎంబసీ అధికారి డానిష్‌తో టచ్‌లోనే ఉందని గుర్తించారు. అతడితో ఆమె చాలా సన్నిహితమైనట్లు భావిస్తున్నారు. కాగా పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెండు రోజులకు (ఏప్రిల్ 24న) ఢిల్లీలోని పాక్ ఎంబసీకి గడ్డంతో ఉన్న ఒక వ్యక్తి కేక్ తీసుకువచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో పలువురు విలేకరులు అతడిని ఎందుకు వచ్చావు...? ఏం వేడుకకు కేక్ తెస్తున్నావని ప్రశ్నిస్తే బదులివ్వకుండా అతడు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఈ గడ్డపు వ్యక్తితో జ్యోతి మల్హోత్రా దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాక్ పర్యటనలో జ్యోతి హాజరైన ఒక పార్టీ(వేడుక) వీడియోలోనూ ఈ గడ్డపు వ్యక్తి కనిపించాడు.



లోకం తీరు



3 రోజుల్లో 11 మంది 'పాక్ గూఢచారుల' అరెస్ట్!

పంజాబ్, హరియాణా, యూపీలో అదుపులోకి

న్యూఢిల్లీ, మే 19: పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత పాక్ గూఢచర్య కార్యక్రమాల్లో పాల్గొన్న వారిపై పోలీసులు దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. గడిచిన మూడు రోజుల్లోనే 11 మంది 'పాక్ గూఢచారుల'ను అరెస్ట్ చేశారు. భారతదేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హరియాణాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాతోపాటు ఓ సెక్యూరిటీ గార్డు, యాప్ డెవలపర్, విద్యార్థులు, సామాన్యులు ఉన్నారు.

జ్యోతి మల్హోత్రా

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పాక్ ఏజెంట్లు తమకు కీలకమైన వ్యక్తిగా మార్చుకున్నారని పోలీసులు తెలిపారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట ఆమె యూట్యూబ్ చానెల్ నడుపుతోందని, 3.85 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారని చెప్పారు. ఆమె 2023, 2024, 2025 మార్చిలో పాకిస్థాన్ వెళ్లి వచ్చిందని.. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా పాక్‌కు వెళ్లిందని వివరించారు. భారత్‌లోని పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంప్రదింపులు జరిపిందన్నారు.



గజాలా, యమీన్: జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన 32 ఏళ్ల వితంతువు గజాలా, యమీన్ మహమ్మద్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. యమీన్ ఆర్థిక కార్యకలాపాలు, వీసా సంబంధిత అంశాల్లో పాక్ హైకమిషన్ మాజీ ఉద్యోగి డానిష్‌తో కలిసి పనిచేసినట్లు పోలీసులు తెలిపారు.

తారిఫ్: నుహ్‌కే చెందిన తారిఫ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాకిస్థాన్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తనకు సిమ్ కార్డులు అందించినట్లు విచారణలో చెప్పాడన్నారు. అతను తరచుగా పాకిస్థాన్ వెళ్లేవాడు.

నౌమాన్ ఇలాహీ: ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతున్న నౌమాన్ ఇలాహీ(24)ని పానిపట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను యూపీకి చెందినవాడు. ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని, పాక్‌కు సున్నిత సమాచారాన్ని చేరవేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఇలాహీ చాలాసార్లు పాక్ పర్యటనకు వెళ్లాడన్నారు.

మహ్మద్ ముర్తజా అలీ: పంజాబ్‌లోని జలంధర్‌లో యాప్ డెవలపర్ మహ్మద్ ముర్తజా అలీని పోలీసులు అరెస్టు చేశారు. అతను స్వయంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ద్వారా గూఢచర్య కార్యకలాపాలను నిర్వహించాడని చెప్పారు.



దేవేందర్ సింగ్: పంజాబ్ పటియాలాలోని ఖల్సా కళాశాలకు చెందిన 25 ఏళ్ల పొలిటికల్ సైన్స్ విద్యార్థి. పటియాలా సైనిక కంటోన్మెంట్ చిత్రాలతో పాటు ఇతర కీలక సమాచారాన్ని ఐఎస్ఐ ఏజెంట్లకు అందించినట్లు పోలీసులు తెలిపారు. నవంబర్‌లో పాకిస్థాన్ వెళ్లి వచ్చాడని చెప్పారు.

షెహజాద్: ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు షెహజాద్‌ను అరెస్టు చేశారు. ఇతను పాకిస్థాన్‌కు అనేకసార్లు వెళ్లాడని, సౌందర్య సాధనాల స్మగ్లింగ్ రాకెట్‌ను గూఢచర్య కార్యకలాపాల కోసం వినియోగించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఐఎస్ఐ ఏజెంట్లతో ఇతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వివరించారు.

సుఖ్‌ప్రీత్ సింగ్: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని అందజేశారనే ఆరోపణలతో పంజాబ్ పోలీసులు గురుదాస్‌పూర్‌లో సుఖ్‌ప్రీత్ సింగ్‌ను అరెస్టు చేశారు. పంజాబ్, హిమాచల్, కశ్మీర్‌లో భారత దళాల కదలికలతోపాటు వ్యూహాత్మక ప్రదేశాల వివరాలను నిందితుడు ఐఎస్ఐకి చేరవేసినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు.

కరణ్‌బీర్ సింగ్: గురుదాస్‌పూర్‌లోనే మరో నిందితుడు కరణ్‌బీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతనికి ఐఎస్ఐ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని.. మన సైనిక బలగాలకు చెందిన సున్నిత సమాచారాన్ని వారికి చేరవేశాడని పోలీసులు తెలిపారు.



అర్మాన్: మరో గూఢచారి, నుహ్‌కు చెందిన అర్మాన్(26)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతని ఫోన్ నుంచి పాక్ నంబర్లతో జరిపిన సంభాషణలు, పంపిన ఫొటోలు, వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. భారత సైనిక కార్యకలాపాల వివరాలను వాట్సాప్ ద్వారా పంపాడన్నారు.

పేలుళ్లకు రంపలో రిహార్సల్స్

- విజయనగరం ఉగ్రసానుభూతి పరుడు సిరాజ్ రెహ్మాన్‌పై కూపీలాగిన పోలీసులు
- రంగంలోకి ఎన్ఐఏ.. ముమ్మర విచారణ

విజయనగరం/ఆరిలోవ(విశాఖ), మే 19(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సమీర్‌లు.. తాము తయారు చేసిన బాంబులను పేల్చడంపై ముందుగానే రిహార్సల్స్ నిర్వహించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీని కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరాన్ని ఎంచుకున్నట్టు గుర్తించారు. అదే విధంగా సిరాజ్ తన ఆర్థిక లావాదేవీలను.. అత్యంత గుట్టుగా నిర్వహించేవాడని తెలుసుకున్నారు. ఈ క్రమంలో నేషనల్ బ్యాంకుల్లో కాకుండా.. జిల్లా సహకార బ్యాంకులో అతను ఖాతా ఓపెన్ చేసుకోవడం.. అక్కడే లాకర్ కూడా ఉండడంపై పోలీసులు మరింత కూపీ లాగుతున్నారు. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు ఉగ్రవాద సానుభూతిపరులుగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు వారిని అరెస్టు చేసి, విశాఖ సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న ఎన్ఐఏ అధికారులు సోమవారం ఉదయం విజయనగరానికి చేరుకున్నారు. గత 6నెలల కాలంలో సిరాజ్ రెండుసార్లు సౌదీ అరేబియా వెళ్లినట్టు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారించనున్నారు. కాగా, సమీర్, సిరాజ్-ఉర్-రెహ్మాన్‌లను రిమాండ్ నిమిత్తం సోమవారం విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకువచ్చారు. కేసు తీవ్రత నేపథ్యంలో వారిద్దరినీ వేర్వేరు బ్యారక్‌లలో ఉంచి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు.

మధ్యప్రదేశ్ మంత్రిపై 'సిట్'

- విజయ్‌షా క్షమాపణలో నిజాయితీ లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 19: మహిళా సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షాపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలను అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం మంగళవారం ఉదయం 10 గంటల లోపు ముగ్గురు ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తుబృందాన్ని(సిట్) ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని ఆదేశించింది. ముగ్గురిలో ఒకరు మహిళా అధికారి ఉండాలని, తొలి దశ నివేదికను 'సిట్' ఈ నెల 28వ తేదీ లోగా సమర్పించాలని నిర్దేశించింది. అరెస్టు నుంచి మంత్రికి ఉపశమనం కలిగించింది. అదేసమయంలో, 'పరిణామాలు తప్పవు' అని హెచ్చరించింది. ఈ కేసును తామే పర్యవేక్షించాలనుకుంటున్నామని, 'ఇది మీకు లిట్మస్ టెస్ట్' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన అనంతరం, ఈ నెల 12వ తేదీన మంత్రి విజయ్‌షా ఓ సభలో మాట్లాడుతూ.. పాకిస్థాన్ పని పట్టేందుకు ప్రధాని మోదీ 'అక్కడున్న వారి మతానికి' చెందిన మహిళనే పంపించారంటూ.. కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా.. "మీరు (ఉగ్రవాదులు) మా సోదరీమణులను వితంతువులను చేశారు. కాబట్టి మీ మతానికి చెందిన సోదరితోనే మీ సంగతి తేల్చేస్తామని, ప్రతీకారం సాధించగలమని ప్రధాని మోదీ నిరూపించారు" అని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్న సుప్రీం కోర్టు.. కల్నల్ సోఫియా ఖురేషీకి క్షమాపణలు చెప్పాలని గత గురువారం ఆదేశించింది. సోమవారం విచారణ సందర్భంగా మంత్రి క్షమాపణలు కోరిన తీరుపై కోర్టు ఆగ్రహించింది. "ఏమిటీ ఆ క్షమాపణ? కోర్టు కోరింది కాబట్టి క్షమాపణ చెబుదామన్నట్టు మీ వైఖరి ఉంది. చేసిన పిచ్చి వ్యాఖ్యలకు నిజాయితీగా క్షమాపణ అడగడానికి మీకు ఏం అడ్డుపడుతోంది?" అని జస్టిస్ సూర్యకాంత్ నిలదీశారు. మంత్రి వ్యాఖ్యలతో దేశం సిగ్గుతో తల దించుకుందని మండిపడ్డారు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద పోస్టు పెట్టారంటూ అశోకా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీ ఖాన్ మహముదాబాద్‌ను అరెస్టు చేయడంపై విచారణ జరుపుతామని సోమవారం సుప్రీంకోర్టు తెలిపింది.

రైల్వే టికెట్లపై 'సిందూర్' ప్రకటన.. కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ, మే 19: రైల్వే టికెట్లపై ప్రధాని మోదీ ఫొటోతో కూడిన ఆపరేషన్ సిందూర్ ప్రకటన రాజకీయ దుమారం రేపింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సైనిక ఆపరేషన్‌ను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ మీడియా సలహాదారు పియూష్ బబెలే ఐఆర్‌సీటీసీ ఈ- టికెట్ ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. "మోదీ ప్రభుత్వానికి ప్రకటనల పట్ల ఎంత మక్కువ ఉందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. ఆపరేషన్ సిందూర్‌ను రైల్వే టికెట్లపై ఒక ప్రకటనగా వాడుకుంటున్నారు. మన సైనికుల పరాక్రమాన్ని కూడా ఒక వస్తువులా అమ్ముకుంటున్నారు. ఇది దేశ భక్తి కాదు.. బేరసారమే" అని బబెలే ఎక్స్‌లో రాశారు.

హైకోర్టు జడ్జిలకు సమాన పింఛన్!

- నియామక సమయం, హోదాతో సంబంధం లేకుండా చెల్లించాల్సిందే.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, మే 19: దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల న్యాయమూర్తులకు ఒకే తరహా పింఛను విధానం అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తులందరూ 'పూర్తిస్థాయి' పింఛన్‌కు అర్హులేనని పేర్కొంది. న్యాయమూర్తుల నియామక సమయం, హోదాల ఆధారంగా పింఛను విషయంలో వివక్ష చూపడానికి వీల్లేదని, వివక్ష చూపిస్తే సమానత్వ హక్కును ఉల్లంఘించడం కిందకే వస్తుందని తెలిపింది. శాశ్వత న్యాయమూర్తులైనా, అదనపు న్యాయమూర్తులుగా పనిచేసి రిటైరైనా పూర్తిస్థాయి పింఛనుకు, పదవీ విరమణ ప్రయోజనాలకు అర్హులేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. రిటైర్డ్ శాశ్వత న్యాయమూర్తులు మృతి చెందితే వారి కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనాలు అందిస్తున్నారో.. అచ్చంగా అలాంటి ప్రయోజనాలనే అదనపు న్యాయమూర్తుల కుటుంబాలకు కూడా అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జిల్లా కోర్టుల నుంచి వచ్చి హైకోర్టు న్యాయమూర్తులైనా.. లేక, నేరుగా బార్ నుంచే వచ్చి న్యాయమూర్తులు అయినా పింఛను, ఇతర ప్రయోజనాల విషయంలో ఎలాంటి తేడా చూపించకూడదని స్పష్టం చేసింది. కొత్త పింఛను పథకం కింద ఉన్నవారికి కూడా ఇదే పింఛను వర్తిస్తుందని తెలిపింది. ఇదిలా ఉండగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు లభించిన వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరిపేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ వ్యవహారంపై బుధవారం విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు క్యాన్సర్

వాషింగ్టన్, మే 19: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ (82) ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధారణ అయ్యిందని.. వ్యాధి తీవ్రత ఆందోళనకర స్థాయిలో ఉందని, ఎముకలకూ వ్యాపిస్తోందని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. బైడెన్‌కు క్యానర్ నిర్ధారణ అయిన నేపథ్యంలో రాజకీయ పత్యర్థి, ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. 'విషయం తెలిసి నేను, మెలానియా చాలా బాధపడ్డాం. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గాజాను స్వాధీనం చేసుకుంటాం: నెతన్యాహు

జెరూసలేం, మే 19: గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సోమవారం స్పష్టం చేశారు. హమాస్‌కు వ్యతిరేకంగా గాజాపై జరిపిన వైమానిక దాడుల్లో 22 మంది మరణించగా, తాజాగా భూతల సైనిక దాడులు ప్రారంభించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహూ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. 'గాజా ప్రాదేశిక ప్రాంతంపై పూర్తి పట్టు సాధిస్తాం. దీనిపై మేం వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు. విజయం సాధించాలంటే మేం వెళుతున్న మార్గాన్ని నిలిపివేయరాదు' అని సోషల్ మీడియా వేదిక టెలిగ్రామ్‌లో నెతన్యాహూ వీడియో పోస్ట్ చేశారు. అదే సమయంలో ఆచరణాత్మక, దౌత్యపరమైన కారణాల రీత్యా పాలస్తీనియన్లు కరువు బారిన పడకుండా నిలువరించాల్సి ఉందన్న నెతన్యాహూ.. అందుకోసం గాజా ప్రాంతానికి ప్రాథమిక ఆహార పదార్థాలు పంపుతామని చెప్పారు. తమ మిత్రదేశాలు కూడా సామూహిక ఆకలి చావుల చిత్రాలను సహించబోవని వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో
పాక్‌కు చైనా అండ!

న్యూఢిల్లీ, మే 19: భారత దేశం మే 7న 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించగానే.. పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచిందని, ఆ దేశానికి అత్యంత కీలకమైన సైనిక సాయాన్ని, శాటిలైట్ డేటాను అందించిందని పేర్కొంటూ 'బ్లూమ్‌బెర్గ్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. మన రక్షణ శాఖకు చెందిన 'సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్' డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్‌ను ఉటంకిస్తూ పలు కీలక విషయాలను అందులో వివరించింది. మన గగనతల దాడుల గురించి తెలుసుకోవడానికి వీలుగా పాక్ తన రేడార్లను, గగనతల రక్షణ వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించుకోవడానికి సహకరించిందని పేర్కొంది. భారత ఆర్మీ కదలికలను, సైనిక మోహరింపుల వివరాలను మెరుగ్గా గుర్తించేలా తన రక్షణ వ్యవస్థలను ఉపయోగించుకోవడంలో చైనా పాకిస్థాన్‌కు సహకరించినట్టు వెల్లడించింది. ఈ అంశంపై బ్లూమ్‌బెర్గ్ విలేకరి చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్‌ను సోమవారం ప్రశ్నించగా.. రెండు దేశాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నప్పటి నుంచీ తాము తటస్థ, నిష్పక్షపాత వైఖరిని అవలంబించామని ఆమె తెలిపారు.

స్వర్ణ దేవాలయంపై పాక్ టార్గెట్

- నిర్వీర్యం చేసిన భారత ఎయిర్ డిఫెన్స్

న్యూఢిల్లీ, మే 19: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత్ నేలమట్టం చేయడంతో.. పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని పాక్ టార్గెట్ చేసింది. ఈ నెల 8వ తేదీన దానిపైకి డ్రోన్లు, క్షిపణులను కురిపించింది. అయితే అప్పటికే అప్రమత్తంగా ఉన్న భారత సైన్యం.. గగనతల రక్షణ వ్యవస్థల సాయంతో వాటన్నిటినీ నిర్వీర్యం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన 53 సెకన్ల వీడియోను సోమవారం విడుదల చేసింది. 9 స్థావరాల ధ్వంసం గురించి 15వ ఇన్‌ఫాంట్రీ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ) మేజర్ జనరల్ కార్తీక్ సి.శేషాద్రి వివరించారు. 'స్వర్ణ దేవాలయం మొత్తంపై గగనతల రక్షణ ఛత్రాన్ని ఏర్పాటుచేశాం. ఆలయానికి చిన్నమెత్తు గీత కూడా పడకుండా కాపాడాం. మానవరహిత డ్రోన్లు, క్షిపణులన్నిటినీ భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ధ్వంసం చేసేశాయి. మనవైపు చాలా తక్కువ నష్టం జరిగేలా చూశాయి' అని వెల్లడించారు.

జైశంకర్... మౌనం వీడండి

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విషయంలో విదేశాంగ మంత్రి జైశంకర్ మౌనం వీడాలని, ఆ సమయంలో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై పాక్‌కు ముందే సమాచారం ఇచ్చామంటూ జైశంకర్ మాట్లాడుతున్న వీడియోపై తీవ్ర విమర్శలు గుప్పించిన మరుసటి రోజే రాహుల్ గాంధీ.. యుద్ధ విమానాలపై కేంద్రాన్ని నిలదీయడం గమనార్హం. "పాకిస్థాన్‌కు మన ఆపరేషన్ గురించి సమాచారం ఇవ్వాలని జైశంకర్‌కు ఎవరు చెప్పారు" అని రాహుల్ ప్రశ్నించారు.

ట్రంప్ ప్రమేయమేమీ లేదు?

కాల్పుల విరమణ ప్రకటనపై ఆయన మా అనుమతి తీసుకోలేదు

- పార్లమెంటరీ కమిటీతో విక్రమ్ మిస్రీ!



పార్లమెంటరీ కమిటీ సభ్యులు అరుణ్ గోవిల్, ఒవైసీ, రవిశంకర్, శశిథరూర్, ఆర్పీఎన్ సింగ్‌లతో మిస్రీ

న్యూఢిల్లీ, మే 19: పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు విరామంగా భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం వెనక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్ర ఏమీ లేదని పార్లమెంటరీ కమిటీతో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు పీటీఐతోపాటు.. పలు వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అధ్యక్షతన పార్లమెంటరీ కమిటీ సోమవారం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ఎంపీలు అభిషేక్ బెనర్జీ(తృణమూల్), రాజీవ్ శుక్లా(కాంగ్రెస్), దీపేందర్ హుడా(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ(మజ్లిస్), అపరాజిత సారంగి(బీజేపీ), అరుణ్ గోవిల్(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతలపై కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు విక్రమ్ విస్రీ సమాధానమిచ్చారు. "భారత్-పాక్ మధ్య అణుయుద్ధాన్ని నిలువరించానని, కశ్మీర్ సమస్యను పరిష్కరించానని ట్రంప్ కనీసం ఏడు సార్లు ప్రకటించారు. అయినా.. భారత్ ఎందుకు మౌనంగా ఉంది?" అని పలువురు సభ్యులు మిస్రీని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ.. భారత్-పాక్ ఘర్షణను నిలువరించడంలో అమెరికా ప్రమేయం లేదని చెప్పారని జాతీయ మీడియా పేర్కొంది. "కాల్పుల విరమణ పూర్తిగా ద్వైపాక్షిక నిర్ణయం. ఈ విషయంలో డొనాల్డ్ ట్రంప్ ప్రమేయానికి మా నుంచి అనుమతి తీసుకోలేదు. ఆయన ఈ వ్యవహారంలో కేంద్రంగా నిలవాలని భావించి ఉంటారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం పాకిస్థాన్ డీజీఎంవో నుంచి ప్రతిపాదన రాగా.. మన డీజీఎంవో కేంద్రానికి తెలిపారు. అలా ద్వైపాక్షికంగానే కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది" అని చెప్పినట్లు వివరించింది. "పాకిస్థాన్ అణుయుద్ధం బెదిరింపులతోనే కాల్పుల విరమణ జరిగిందా?" అని సభ్యులు అడిగిన ప్రశ్నకు.. పాకిస్థాన్ నుంచి అణు సంకేతాలేమీ రాలేదని స్పష్టంచేశారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ బెదిరిపోదని ప్రధాని మోదీ ఇదివరకే స్పష్టం చేసినట్లు గుర్తుచేశారు. చైనాకు చెందిన మిలటరీ హార్డ్‌వేర్(హెచ్‌క్యూ-9 క్షిపణి రక్షణ వ్యవస్థ)ను పాక్ ఉపయోగించడంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. "మేము పాక్ వైమానిక స్థావరాలను బలంగా కొట్టాం" అని చెప్పినట్లు సమాచారం. భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనపై ప్రశ్నను 'జాతీయ భద్రత' ఆందోళనల పేరుతో దాటవేశారని జాతీయ మీడియా పేర్కొంది. "పాకిస్థాన్‌కు చెప్పే దాడులు చేశామని జైశంకర్ అన్నారు కదా?" అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. కేంద్ర మంత్రి జైశంకర్ మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని విక్రమ్ మిస్రీ పార్లమెంట్ కమిటీ సభ్యులను కోరారు. పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడులు చేసినట్లు పాకిస్థాన్‌కు చెప్పామని మంత్రి అన్నట్లు గుర్తుచేశారు. పాకిస్థాన్‌కు తుర్కియే, అజర్‌బైజాన్ మద్దతుపై సభ్యులు ప్రశ్నలడగ్గా.. "ముగ్గురు సోదరులుగా పాకిస్థాన్-తుర్కియే-అజర్‌బైజాన్‌కు పేరుంది" అని విక్రమ్ మిస్రీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. పహల్గాం దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని సూత్రధారులతో సంభాషణలు జరిపినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఆయన పార్లమెంటరీ కమిటీకి వివరించారని పీటీఐ పేర్కొంది. "ఐక్య రాజ్య సమితి(ఐరాస) గుర్తించిన అంతర్జాతీయ ఉగ్రవాదులు సైతం పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అక్కడి నుంచే భారత్‌కు వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తున్నారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌కు ట్రాక్ రికార్డు ఉంది" అని కమిటీకి చెప్పినట్లు తెలిపింది.

శశిథరూర్‌పై కాంగ్రెస్ మల్లగుల్లాలు!

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): రోజురోజుకీ బీజేపీ దిశగా అడుగులు వేస్తూ.. పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న సీనియర్ నేత శశిథరూర్‌తో ఎలా వ్యవహరించాలన్నదానిపై కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత విదేశాంగ విధానాన్ని అంతర్జాతీయ సమాజానికి వివరించటానికి కేంద్రం ఎంపిక చేసిన ఎంపీలలో శశిథరూర్ పేరు కూడా ఉండటం ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. ఇప్పటికే జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద వంటి యువ నేతలు పార్టీని వీడిన నేపథ్యంలో.. శశిథరూర్ విషయంలో అధిష్ఠానం జాగ్రత్తగా వ్యవహరించాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. శశిథరూర్ అదే రాష్ట్రానికి చెందినవారు కాబట్టి, ఆచితూచి నిర్ణయం తీసుకోవాలంటున్నారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతివ్వడం గురించి ప్రపంచానికి వివరించేందుకు భారత ప్రతినిధి వర్గాలను పంపడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన తర్వాతే భారత ప్రతినిధి వర్గాల గురించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని జైరాం రమేశ్ అన్నారు. 7 ప్రతినిధి వర్గాలను పంపించడం వల్ల జరిగేదేముందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన నాలుగు పేర్లలో కేవలం ఒకరి పేరునే అంగీకరించి, సొంతంగా పేర్లను ఎంపిక చేశారని ఆయన అన్నారు. ఇదేమి రాజకీయమన్నారు.

థరూర్‌కు బిలావల్ సమవుజ్జీ కాదు

భారత్‌ను కాపీ కొడుతూ.. పాకిస్థాన్ కూడా తమ దేశానికి చెందిన ఎంపీల బృందాలను విదేశాలకు పంపించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు వెళ్లే బృందానికి బిలావల్ భుట్టోను నాయకుడిగా ఎంపిక చేసింది. అమెరికా వెళ్లే భారత ఎంపీల బృందానికి థరూర్ నాయకత్వం వహిస్తున్నారు. దీంతో వీరిద్దరి సామర్థ్యంపై పాక్‌లో చర్చ జరుగుతోంది. అంతర్జాతీయ అంశాల పట్ల అవగాహనలోగానీ, వ్యక్తీకరణలోగానీ థరూర్‌కు బిలావల్ సమ ఉజ్జీ కాదని పలువురు పాక్ నేతలే పెదవి విరుస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఇండొనేషియా, మలేషియా తదితర దేశాలకు వెళ్లే ఎంపీల బృందంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ పేరు చేర్చటంపైనా వివాదం రేగుతోంది. తృణమూల్ పార్లమెంటరీ పార్టీ చెయిర్‌పర్సన్ అయిన తనకు సమాచారం ఇవ్వకుండానే తమ పార్టీ ఎంపీని ఎంపిక చేయటం ఏమిటని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అయినప్పటికీ తాను వివాదం చేయదల్చుకోలేదని, తమ ప్రతినిధిని పంపిస్తామని చెప్పారు. అయితే, విదేశాలకు వేళ్లే ఎంపీల బృందం నుంచి తప్పుకొంటున్నట్టుగా యూసుఫ్ పఠాన్ ప్రకటించారు.



నీలం సంజీవరెడ్డికి రాష్ట్రపతి ముర్ము నివాళి

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు నివాళి అర్పించారు. రాయలసీమకు చెందిన నీలం సంజీవరెడ్డి 1977-1982 మధ్యకాలంలో భారత 6వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సంజీవరెడ్డి పనిచేశారు.

రేపు కుప్పం రానున్న చంద్రబాబు

- గంగమ్మను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

కుప్పం, మే 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 21న తన సొంత నియోజకవర్గం కుప్పం రానున్నారు. ఇక్కడ జరుగుతున్న గంగజాతరలో భాగంగా ఆ రోజున జరిగే గంగమ్మ విశ్వరూప దర్శనంలో అమ్మవారిని చంద్రబాబు దర్శించుకుంటారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వచ్చి.. 2.30 గంటలకు తిరిగి ప్రయాణమయ్యేలా షెడ్యూల్ ఖరారైంది.

మరమ్మతులు ఎప్పుడు?

- వర్షాకాలం సమీపిస్తున్నా యాజమాన్య నిర్వహణకు నోచుకోని ప్రాజెక్టులు, కాలువలు
- 344 కోట్లు కోరిన జలవనరుల శాఖ
- మంత్రివర్గం ఓకే.. ఆర్థిక శాఖ వద్దే పెండింగ్
- 'బుడమేరు' అనుభవమున్నా స్పందించని వైనం
- వెంటనే నిధులు ఇవ్వాలని కోరుతున్న రైతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం సమీస్తున్నా.. సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు యాజమాన్య నిర్వహణకు నోచుకోవడం లేదు. యాజమాన్య నిర్వహణకు రూ.344.39 కోట్లు కావాలని జల వనరుల శాఖ కోరినా ఆర్థిక శాఖ నుంచి సానుకూల స్పందన రాలేదు. నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించడంతో పాటు కేబినెట్ కూడా ఆమోదం తెలిపినా ఫలితం లేకుండా పోయింది. ఆర్థిక శాఖ వద్ద ఫైలు ఇంకా పెండింగ్‌లో ఉంది. బుడమేరు వరద బీభత్సం నేపథ్యంలో మళ్లీ భారీ వర్షాలతో ముప్పు ఏర్పడితే పరిస్థితి ఏమిటని జల వనరుల శాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల సాధారణ యాజమాన్య నిర్వహణ కోసం రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను సగటున రెండు కోట్ల చొప్పున మొత్తం రూ.344.39 కోట్లు అవసరమని జల వనరుల శాఖ అంచనా వేసింది. వానాకాలం వచ్చేలోగా ప్రాజెక్టుల మరమ్మతులు, రేడియల్ గేట్లకు గ్రీజు పూయడం, ఇతర నిర్వహణ చర్యలతో పాటు పంట కాలువల పూడికతీత పనులు చేయాలని నిర్ణయించింది. దీంతో నిధులు కేటాయించాలని మొదట ఆర్థిక శాఖను కోరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వంద కోట్ల రూపాయలతో సరిపెట్టుకోవాలని సలహా ఇస్తూ ఆర్థిక శాఖ ఫైలును తిప్పి పంపింది. జల వనరుల శాఖకు కేటాయించిన నిధుల నుంచే ప్రాధాన్య క్రమంలో నిధులు వాడుకోవచ్చంటూ సూచించింది. ప్రాజెక్టుల వారీగా నిధులు కేటాయించాక వేరే పనుల కోసం ఎలా ఖర్చు చేయగలమని జల వనరుల శాఖ ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టుల వారీగా కాకుండా ఏకమొత్తంలో నిధులు కేటాయిస్తే ప్రాధాన్య క్రమంలో ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతోంది. ఆర్థిక శాఖ ఉచిత సలహాలపై జల వనరుల శాఖ మండిపడుతోంది.



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం కాలువలో గుర్రపుడెక్క

బుడమేరు అనుభవమున్నా..

పులికనుమ ప్రాజెక్టు కాలువలు పూర్తిగా పూడుకుపోయాయి. బుడమేరు గండ్లు సాంకేతిక విధానంలో పూడ్చాల్సి ఉంది. నియోజకవర్గాల్లోని చిన్నతరహా ఏరులు కనిపించకుండా పోయాయి. ఈ ఏరులపై ఆధారపడ్డ కాలువలు కబ్జాలకు లోనయ్యాయి. ఎగువన ఉన్న ఖమ్మం చెరువుకు కట్టలు తెగితే.. జలాలు నేరుగా కిందకు వచ్చేసి లోతట్టు ప్రాంతాలను ముంచేస్తాయి. గత ఏడాది ఖమ్మం చెరువుకు గండ్లు కారణంగానే బుడమేరుకు వరద వచ్చింది. ఈ వరద ప్రభావంతో విజయవాడ అతలాకుతలం అయింది. వేలాది కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ముందస్తుగా కార్యాచరణ అమలు చేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కాలువల మరమ్మతుల కోసం ఎంత వ్యయం అవుతుందో అంచనాలను తెప్పించింది. ఈ అంచనా మేరకు సాగునీటి యాజమాన్య నిర్వహణకు రూ.344.39 కోట్ల నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను కోరింది.

ముఖ్యమంత్రి అంగీకరించినా..

నిధుల మంజూరుకు ఆర్థిక శాఖ స్పందించకపోవడంతో జలవనరుల శాఖ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. వానా కాలానికి ముందుగానే ప్రాజెక్టులు, కాలువల యాజమాన్య నిర్వహణ చేపట్టకపోతే భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వివరించారు. వారి మాటల్లో వాస్తవాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రివర్గ సమావేశంలో ప్రాజెక్టులు, కాలువల యాజమాన్య నిర్వహణ కోసం రూ.344.39 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. అయినా ఇప్పటి వరకూ ఆర్థిక శాఖ నిధులు మంజూరు చేయలేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. వీటి ప్రభావంతో వానలు కురుస్తాయి. ఈ సమయంలో కాలువల పూడికతీతకు వీలుండదు. నిధులు విడుదల చేయకపోతే.. ఈ ఏడాది ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణ అటకెక్కినట్లేనని సాగునీటి నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక శాఖ విధానాలు చూశాక రాష్ట్రంలోని కాంట్రాక్టు సంస్థలేవీ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు నిధులు లేకున్నా.. సాగునీటి యాజమాన్య నిర్వహణపై మంత్రి రామానాయుడు సమీక్షలు నిర్వహిస్తూ ఉండటం జలవనరుల శాఖ ఇంజనీరింగ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే నిధులు విడుదల చేయాలని నిపుణులు, రైతులు కోరుతున్నారు.



అఖండ దీపాలను అందజేస్తున్న దాత మైసూరు రాజమాత ప్రమోదాదేవి తదితరులు

తిరుమల శ్రీవారికి 50కిలోల వెండి అఖండ దీపాలు

- విరాళంగా అందజేసిన మైసూరు రాజమాత
- 300 ఏళ్ల క్రితం అందించిన మైసూరు మహారాజు
- పాడైపోవడంతో మళ్లీ ఇచ్చిన ప్రమోదా దేవి

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం విరాళంగా అందజేశారు. 300 ఏళ్ల కిందట అప్పటి మైసూరు మహారాజు స్వామికి సమర్పించిన అఖండదీపాలు పాడైపోవడంతో, వాటి స్థానంలో 50 కిలోల బరువుండే వెండి దీపాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో అందజేశారు. దర్శనం అనంతరం ప్రమోదాదేవితో పాటు యదువర్ కృష్ణదత్త చామరాజు ఒడయార్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. దేవదాయ శాఖ కమిషనర్, ఆలయ అధికారులు నాలుగు నెలల కిందట మైసూరు ప్యాలె‌స్‌కు వచ్చి పాత అఖండదీపాలు పాడైపోయిన విషయం చెప్పారన్నారు. స్వామికి సేవ చేసుకోవడంలో భాగంగా తమ పూర్వీకుల ఆచారాన్ని కొనసాగించడానికి ఈ దీపాలను తిరిగి అందించామని చెప్పారు.

సీఐపై మందుబాబుల దాడి

- ఒంగోలులో అర్ధరాత్రి గస్తీలో ఉండగా ఘటన

ఒంగోలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ప్రకాశం జిల్లా ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావుపై ముగ్గురు మందుబాబులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలులో ఆదివారం రాత్రి గస్తీలో ఉన్న సీఐ శ్రీనివాసరావు కర్నూల్‌రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బీట్ తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో సమీపంలోని ఓ లాడ్జి వద్ద అరుపులు వినిపించాయి. అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఓ మోటార్ సైకిల్ కిందపడి ఉంది. దాన్ని పైకి లేపేందుకు మద్యం సేవించిన ఇరువురు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. వారి వద్ద కానిస్టేబుల్‌ను ఉంచిన సీఐ.. కొద్దిదూరంలో మోటారు సైకిల్‌ను స్టార్ట్ చేసే పనిలో ఉన్న మరో వ్యక్తి వద్దకు వెళ్లారు. అతను కూడా మద్యం సేవించినట్లు గుర్తించి వాహనం తాళాన్ని తీసుకునేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరుగుతున్న సమయంలో మోటారు సైకిల్‌ను లేపేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిలో ఒక వ్యక్తి సీఐ వద్దకు వచ్చి దాడికి పాల్పడ్డాడు. మిగిలిన ఇద్దరు కూడా చేయిచేసుకున్నారు. దీంతో సీఐ ముఖంపైన గాయమైంది. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడి చేసిన ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. కేసు నమోదుచేసినట్టు తాలుకా ఇన్‌చార్జి సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్... మా జాతికి దక్కిన గౌరవం

- జవహర్ ఎంపికపై మంద కృష్ణ మాదిగ
- రాజకీయం లేదు... అభినందనలు చెప్పడానికే ఆహ్వానించా: జవహర్

కొవ్వూరు, మే 19(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి రావడం... మొదటిసారి మా జాతికి దక్కిన గౌరవం భావిస్తున్నాం' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని మాట్లాడారు. 'దళితుల్లో 59 కులాలు ఉన్నాయి. అయితే ప్రధానంగా రెండు కులాల్లో... ఒకరు అవకాశం పొందిన కులంగా, మరొకరు అవకాశం దక్కని కులంగా చరిత్రలో నమోదైపోయింది. ఈ మేరకు మా జాతి బిడ్డల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మా ఆవేదనను అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో కమిషన్ చైర్మన్ కేటాయిస్తానని చెప్పారు. 2024 ఎన్నికల విజయంలో మాదిగలు ప్రధాన పాత్ర పోషించారని పలు ఉపన్యాసాల్లోనూ చెప్పారు. ఎంతమంది పట్టుబట్టినా ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీకి, జాతికి విధేయుడిగా నిలిచిన సోదరుడు, మాజీ మంత్రి జవహర్‌ను కమిషన్ చైర్మన్‌గా నియమించారు' అని కృష్ణ మాదిగ అన్నారు. జవహర్ మాట్లాడుతూ... 'అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వర్గీకరణ పోరాటంలో కృష్ణ మాదిగ కృషి మరువలేనిది. పద్మశ్రీ రావడంతో అభినందనలు తెలియజేయడానికి ఆహ్వానించా. ఎటువంటి రాజకీయం లేదు' అని అన్నారు. అనంతరం కృష్ణ మాదిగను జవహర్ కుటుంబీకులు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ. చిత్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ తదితరులు

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

- తొలి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 37,655 మంది హాజరు
- 92.03 శాతంహాజరు నమోదు

జేఎన్టీయూకే, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష ఏపీ, హైదరాబాద్‌లో ప్రశాంతంగా జరిగిందని ఏపీఈఏపీ సెట్ చైర్మన్, జేఎన్టీయూకే వైస్‌చాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష సెట్ కోడ్‌ను వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో విడుదల చేసి పరీక్ష నిర్వహణ తీరును కన్వీనర్ సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. ఉదయం సెషన్‌లో 20,461 మంది విద్యార్థులకు 18,724 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 20,456 మంది విద్యార్థులకు 18,931 మంది హాజరయ్యారని తెలిపారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 92.03 శాతం హాజరు నమోదైందని వీసీ తెలిపారు.

'మన మిత్ర'ను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- అధికారులతో సీఎస్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌పై అధికారులతో సమీక్షించారు. ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం కావాలని చెప్పారు. సమీక్షలో ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫైడ్ విత్తనోత్పత్తికి కార్యాచరణ: ఏపీ సీడ్స్ ఎండీ

రాష్ట్రంలో 2025-26 ఏడాదిలో 8.58లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనోత్పత్తికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్, ఏపీ సీడ్ ఎండీ డిల్లీరావు తెలిపారు. వరి, కంది, మినుము, పెసర, వేరుశనగ, శనగ, రాగి, కొర్ర, నువ్వులు, పచ్చిరొట్ట విత్తనాలను ఉత్పత్తి చేయనున్నట్లు సోమవారం తెలిపారు. 2024-25లో 3.64లక్షల క్వింటాళ్ల విత్తనాలను ఏపీ సీడ్స్ ఉత్పత్తి చేయగా, వీటిని విత్తన రాయితీ కార్యక్రమాల కింద ఈ ఏడాది ఖరీఫ్, రబీలో పంపిణీ చేస్తామన్నారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

- తిరుమలలో బ్రాండెడ్ హోటళ్లకు అనుమతిపై చర్చ

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరగనుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఇప్పటికే సిద్ధం చేసిన అజెండాలోని అంశాలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా తిరుమలలో హోటళ్ల నిర్వహణకు బ్రాండెడ్ హోటళ్లను అనుమతించే అంశంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. స్విమ్స్ ఆస్పత్రి అభివృద్ధితో పాటు, ఒంటిమిట్ట రామాలయం అభివృదికి దాతలను ఆహ్వానించే అంశాలపై కూడా చర్చించనున్నారు. ఇక, తిరుమలలోని పలు మఠాల ఆక్రమణలపై ఇప్పటికే సిద్ధం చేసిన సర్వే రిపోర్టుపై కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.



కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్‌షాదున్నీసాకు డిక్లరేషన్ పత్రం అందజేస్తున్న ఆర్డీవో వీవీఎస్ శర్మ

కదిరి, గాండ్లపెంట పీఠాలు టీడీపీ పరం

కదిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, గాండ్లపెంట ఎంపీపీ పదవిని టీడీపీ కైవసం చేసుకుంది. కదిరి మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నిక సోమవారం జరిగింది. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా.. వైసీపీకి చెందిన 11 మంది గైర్హాజరయ్యారు. 25 మంది మద్దతుతో దిల్‌షాదున్నీసా చైర్‌పర్సన్‌గా.. సుధారాణి, రాజశేఖరాచారి వైస్ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాండ్లపెంట ఎంపీపీగా గజ్జెల సోముశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం ఏడుగురు ఎంపీటీసీల్లో నలుగురు టీడీపీ సభ్యులు హాజరయ్యారు. ముగ్గురు వైసీపీ సభ్యులు రాలేదు. విజేతలను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు.

'సరుకుల పంపిణీ బాధ్యతలు తిరిగి డీలర్లకు అప్పగించాలి'

అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరుకుల పంపిణీ బాధ్యతలను తిరిగి చౌక ధరల దుకాణాల డీలర్లకే అప్పగించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ప్రభుత్వాన్ని కోరారు. డీలర్లకు ఆదాయం పెంచేలా రేషన్ షాపుల్లోనే విలేజ్ మాల్స్ ఏర్పాటుకు సంబంధించిన జీవో 5ను అమలు చేయాలని సోమవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టానికి విరుద్ధంగా ఎండీయూ వ్యవస్థను తీసుకువచ్చి రేషన్ డీలర్లకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. దీంతో రాష్ట్రంలోని 29,500 మంది రేషన్ డీలర్లు తమ ఉనికిని కోల్పోయారని పేర్కొన్నారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లు ఆత్మగౌరవంతో జీవిస్తూ కుటుంబాలను పోషించుకునేవారని తెలిపారు. ప్రతి ఏటా సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు, రంజాన్ తోఫా అందించడం వల్ల ఐదేళ్లలో రూ. 80 కోట్ల మేర రేషన్ డీలర్లు లబ్ధి పొందారని వివరించారు.

మోడల్ స్కూల్స్ కాంట్రాక్టు టీచర్ల రెన్యువల్

మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 282 మంది కాంట్రాక్టు టీచర్ల సేవలను రెన్యువల్ చేసేందుకు అనుమతి ఇస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 211 మంది పీజీటీలు, 71 మంది టీజీటీల రెన్యువల్‌కు అనుమతిచ్చింది.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు పరీక్షకు 35,686 మంది విద్యార్థులకుగాను 22,238 (62.32శాతం) మంది హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు.

విద్యాశాఖలో బోధనేతర సిబ్బందికి బదిలీలు

పాఠశాల విద్యాశాఖలోని బోధనేతర సిబ్బంది బదిలీలు చేపట్టేందుకు అనుమతి ఇస్తూ ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలపై నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహావిషాదం

హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని ఒక భవనంలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి పదిహేడుమంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైనది. వేసవిసెలవుల్లో సరదాగా గడిపేందుకు ఒకేచోటకు చేరిన ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాలు ఈ భయానకప్రమాదంలో చిక్కుకొని ప్రాణాలుకోల్పోవలసి వచ్చింది. అంతాగాఢనిద్రలో ఉండగా అగ్నికీలలు భవనాన్ని కమ్మేయడంతో, మొదటి అంతస్తులో ఉన్నవారు కిందకు దిగలేక, పైకిపోలేక గదిలోనే ఉండిపోయి, పొగకు, వేడిమికి గురై అపస్మారక స్థితిలోకి జారుకొని, ఆస్పత్రికి తరలించేలోగానే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు చిన్నారులు, మిగతావారు మహిళలు, వృద్ధులు. దేశం యావత్తూ ఈ దుర్ఘటనకు నిర్ఘాంతపోయింది. రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులంతా దిగ్భ్రాంతిని, సంతాపాన్ని తెలియచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతోపాటు, ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి సమగ్ర విచారణకు ఆదేశించారు.

ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న చిన్నారులతో సహా పదిహేడుమంది జీవితాలను అర్థంతరంగా ముగించేసిన ఈ దారుణం మనసులను కలచివేయడంతో పాటు కొన్ని ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. ఇటువంటి ప్రమాదాలు ఆకస్మికంగా, అకారణంగా జరిగిపోయినట్టు ఉపరితలంలో కనిపిస్తాయి కానీ, మానవతప్పిదం, వ్యవస్థాగత నిర్లక్ష్యం వాటికి దోహదపడుతున్నాయన్నది వాస్తవం. కింద మూడు దుకాణాలతో వ్యాపారం, పైన నివాసం కలగలిసిన ఈ భవనం ప్రవేశద్వారం ఎంత ఇరుకుగా ఉన్నదో, ఉన్న ఆ కాస్త స్థలంలోనూ వాహనాలు సహా అనేక అడ్డంకులవల్ల అగ్నిమాపక సిబ్బంది ప్రవేశం ఎంత కష్టమైపోయిందో వార్తలు తెలియచెబుతున్నాయి. ఈ ఇంట్లోకి ప్రవేశించేందుకు మరో మార్గమన్నదే లేక, పక్కభవనం గోడలకు రంధ్రాలు చేసి అగ్నిమాపక సిబ్బంది బాధితులను కాపాడవలసివచ్చిందట. ఖరీదైన వ్యాపారాలు చేసుకుంటున్నవారు కూడా కనీస జాగ్రత్తలమీద శ్రద్ధపెట్టకపోవడం ప్రమాద తీవ్రత ఈ స్థాయిలో ఉండటానికి దోహదం చేసింది. ఏమీ జరగదన్న అర్థంలేని నమ్మకమో, బాధ్యతారాహిత్యమో తెలియదు కానీ, ఆ వ్యాపార కుటుంబం భవన నిర్మాణంనుంచి నిర్వహణ వరకూ పలు తప్పిదాలకు పాల్పడి తమ భద్రతనే ప్రమాదంలో నెట్టేసుకుంది. ఏసీల వంటివి వాడుతున్నప్పుడు ఇటువంటి ఆవాసాలను ప్రమాదరహితంగా తీర్చిదిద్దుకోవడం మరింత ముఖ్యం.

ప్రమాదం ఎందుకు జరిగిందో, మంటలు త్వరితగతిన మొత్తం భవనాన్ని ఎలా కమ్ముకురాగలిగాయో తెలుస్తూనే ఉంది. మానవ నిర్లక్ష్యం, నియమనిబంధనలపట్ల బేఖాతరు, పలు వ్యవస్థల బాధ్యతారాహిత్యం కలగలిసిన దారుణం ఇది. ఈ ఒక్క భవనమే కాదు, ఈ ప్రాంతంలోనే ఇటువంటివి అనేకం ఇదే తరహాలో అతి సునాయాసంగా ప్రమాదానికి లోనయ్యేరీతిలో ఉన్నాయన్న వాస్తవం అధికారులకు తెలియందీ కాదు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు ఉన్నాయా, ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకోగలిగే మార్గాలు ఉన్నాయా, అగ్గిరాజుకోగానే తక్షణం ఆర్పగలిగే పరికరాలు పనిచేస్తున్న స్థితిలో అందుబాటులో ఉంటున్నాయా అన్నది అధికారులు నిరంతరం గమనిస్తూ, యజమానులను అప్రమత్తం చేస్తూవుంటే ప్రమాదాలను నివారించవచ్చు. పాతభవనాలు, మరీముఖ్యంగా ఇరుకైన ప్రాంతాల్లోని ఇటువంటి గృహ, వాణిజ్య సదుపాయాలమీద అధికారుల నిఘా మరింత అధికంగా ఉండాలి. ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్లు ఆ సందుల్లోకి పోలేకపోతున్నాయి, అగ్నిమాపక సిబ్బంది ప్రవేశం సైతం సమస్యగా పరిణమిస్తున్నది. భవనం కింద అంతస్తులో నిప్పు అంటుకుంటే, పై భాగాన ఉంటున్నవారు కిందకు దిగలేక, చివరకు కమ్మేసిన పొగవల్లనే ప్రాణాలు వదిలేయడం చాలా ఘటనల్లో చూస్తున్నాం. నిప్పుకంటే పొగే ప్రాణాంతంగా పరిణమిస్తున్నది. ప్రాణాలు దక్కించుకోవాలంటే పైనుంచి దూకేయడం తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గమంటూ లేకపోవడం విషాదం. వ్యాపారాలు సాగిపోతూంటాయి, నగరాలు ఎదిగిపోతూంటాయి, ప్రాణాలకు మాత్రం నమ్మకం లేని స్థితి. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఘటన చేజేతులా చేసుకున్నదీ, కచ్చితంగా నివారించగలిగిందీ. అనేకానేక ఈ తరహా దుర్ఘటనల్లో ఇది కూడా ఒకటిగా కాలగర్భంలో కలిసిపోయి, విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దీని హెచ్చరికలను లక్ష్యపెట్టాలి, పాఠాలు నేర్చుకోవాలి.

భూతాలు సృష్టికర్తలనూ ధిక్కరిస్తాయి!

'ప్రజల జ్ఞాపకశక్తి చాలా స్వల్పం' అనే మాట మనం తరచూ వింటూంటాం. దీన్నొక బలహీనతగా రాజకీయ నాయకులు భావిస్తారు. ప్రజలు దీన్ని అధిగమించలేరనీ, అందుకే పాత వాగ్దానాలను విస్మరిస్తున్నా, గతంలో చేసిన ఘోర తప్పులను చేయలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నా నెగ్గుకు రాగలుగుతున్నామనీ నమ్ముతారు. నిత్య జీవన సమరంలో ఏదోరకంగా బండి నెట్టుకు రావటానికే శక్తులన్నీ కూడదీసుకుంటున్న సగటు మనిషి విస్తృత సమాజంలో జరిగే పరిణామాలను ఒక లెక్క ప్రకారం గుర్తుపెట్టుకోలేడు. వాటి ఆధారంగా మంచిచెడులపై అన్ని సందర్భాల్లోనూ స్పందించలేడు. బహుళపార్టీ ప్రజాస్వామ్యంలో సైతం కపటత్వానికీ, మోసానికీ, వాగ్దాన భంగతకూ ఈ బలహీనతే ప్రధానకారణం. సాధ్యమైనంతవరకూ సాధారణ ప్రజలను వర్తమానంలోనే ఉంచి చరిత్ర స్పృహలేకుండా చేయటంలోనే దారుణాలన్నీ విస్మరణకు గురవుతాయి. వాటికి కారణమైన రాజకీయ పార్టీలూ, వ్యక్తులూ పాపంలో తమకు వాటాలేదన్నట్లుగా వ్యవహరిస్తూ పెద్దరికాన్ని ప్రదర్శిస్తారు.

పహల్గాం దారుణం తర్వాత భారత్-పాక్ మధ్య సాగిన సైనిక దాడులు, ప్రతిదాడులను ప్రస్తావిస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయి. భారత్-పాక్ మధ్య నెలకొన్న వైషమ్యాల్లో అమెరికా పాత్ర లేనేలేదనీ వాటితో తమకున్న సంబంధం ఏమిటనీ ప్రశ్నించారు. మే 9న ఈ ప్రకటన చేసి 10వ తేదీకల్లా మాటమార్చి భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తమ మధ్యవర్తిత్వమే కారణమని చెప్పుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అయితే భారత్-పాక్‌ల మధ్య సైనిక సంఘర్షణలను ఆపివేసి అణుయుద్ధ ప్రమాదం నుంచి ప్రపంచాన్నే రక్షించానని ఆర్భాటంగా ప్రకటించుకున్నారు. మొత్తం వ్యవహారంలో అమెరికా పాత్ర ఎంతో ఇప్పుడే చెప్పలేం. కాలం గడిస్తేనే నిజాలు వెలుగులోకి వస్తాయి. యుద్ధ సమయాల్లో ప్రభుత్వాలు అసలు విషయాలన్నిటినీ చెప్పవు. పాక్షిక సత్యాలనే చెబుతాయి. విజయగాథలనే ఎక్కువగా వినిపిస్తాయి. వైఫల్యాలను విస్మరిస్తాయి. తీసుకున్న నిర్ణయాలను సమర్థించుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తాయి.

నిష్పాక్షికంగా చరిత్రను పరిశీలిస్తే భారత్-పాక్ మధ్య సంఘర్షణలకు దోహదం చేస్తున్న ప్రతివిషయంలోనూ అమెరికా పాత్ర గణనీయంగానే కనపడుతుంది. ఇస్లామిక్ తీవ్రవాదాన్నే తీసుకుంటే అమెరికా నిర్వహించిన పాత్రను తక్కువచేసి చూడలేం. 1980లకు ముందు కూడా భారత ఉపఖండంలో మతతత్వాలు ఉన్నాయి. హిందూ-ముస్లింల మధ్య సంఘర్షణలకు లక్షలమంది బలైపోయారు. ముస్లింలను ప్రత్యేక జాతిగా పేర్కొంటూ వారి కోసం పాకిస్థాన్ ఏర్పడాలనే వాదమూ, హిందువుల ఆధిపత్యమే చెల్లుబాటు కావాలనే సిద్ధాంతమూ అనేక రూపాల్లో వ్యక్తమై విపరీత సంఘర్షణ వాతావరణాన్ని సృష్టించింది. దీన్ని అతికష్టం మీద అధిగమించి భారత్‌లో లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచగలిగారు. మతప్రాతిపదికగా పాకిస్థాన్ దేశంగా ఏర్పడినా లౌకిక రాజ్యాంగాన్ని, ఆధునిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరుచుకోలేక తొలి నుంచీ సంక్షోభాల్లో, నియంతృత్వాల్లో కూరుకుపోయింది. కశ్మీర్ సమస్యపై 1980ల వరకూ భారత్-పాక్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా ఇస్లామిక్ తీవ్రవాదం వ్యవస్థీకృతంగా మారి, విపరీత సిద్ధాంత ప్రచారంతో, టెర్రరిస్టు చర్యలతో పెను సమస్యగా పరిణమించలేదు.

1979లో ఆఫ్గానిస్థాన్‌లో రష్యను సేనల ప్రవేశంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమెరికా-రష్యాల మధ్య 1945 నుంచి కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్) అప్పటి నుంచి కీలకమలుపు తిరిగింది. రష్యను సేనలను ఆఫ్గాన్ నుంచి పారదోలటానికి అమెరికా అనుసరించిన వ్యూహం, చేపట్టిన చర్యలు ప్రపంచచరిత్రనే రక్తసిక్తం చేశాయి. ఆల్‌ఖయదా, ముజాహిద్దీన్, తాలిబాన్ లాంటివే కాదు ఇంకా వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తూ అనేక దేశాలను కుదిపివేస్తున్న టెర్రరిస్టు ముఠాలన్నీ అమెరికా ఆఫ్గాన్ వ్యూహం నుంచే ప్రాణం పోసుకున్నాయి. ఆ వ్యూహం అమలుకు కార్యక్షేత్రంగా పాకిస్థాన్ మారిపోయింది. అక్కడి సైనిక నియంతృత్వాన్ని ఆ వ్యూహమే బలోపేతం చేసింది. పాకిస్థాన్ సమాజాన్ని సైనిక ఉక్కుచట్రంలో బంధించింది. మతం ఆధారంగా తీవ్రవాదాన్ని సృష్టించటం సాపేక్షికంగా తేలిక. కానీ అది బలపడిన తర్వాత దాన్ని నియంత్రించటం చాలా కష్టం. అగ్ర రాజ్యాలు అత్యాధునిక ఆయుధాలను తయారు చేయొచ్చు. మానవరహిత ఆయుధాలతో మారణహోమాలను సృష్టించొచ్చు. కానీ హృదయాల్లో పాతుకుపోయిన భావాలను పెకలించటం కష్టమైన పని. మతతత్వ భూతాలకు ప్రాణంపోసిన తర్వాత అవి స్వతంత్రజీవుల్లా వ్యవహరిస్తాయి. సొంత లక్ష్యాలను ఏర్పరచుకుంటాయి. అలా వ్యవహరించబట్టే ఆల్‌ఖయదా చేతుల్లో అమెరికా కనీవినీ ఎరగని దారుణాన్ని, భయోత్పాతాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కూ ఈ గతి తప్పటంలేదు. అమెరికా కోసం ఆఫ్గానిస్థాన్‌లో, కశ్మీర్ కోసం భారత్‌లో తీవ్రవాదులను తయారు చేసి పులిమీద స్వారీ చేస్తోంది. చివరికి ఆఫ్గానిస్థాన్ నుంచే తీవ్ర అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటోంది. బలూచిస్థాన్‌పై పట్టును కోల్పోతోంది. తాను సృష్టించిన తాలిబన్లలోని ఒక శాఖే పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రముఖ అమెరికా చరిత్రకారుడు స్టాన్లీ వోల్‌పర్ట్ 2010లో పేర్కొన్న ప్రకారం ముస్లిం టెర్రరిస్టులు అధికంగా ఉన్న దేశం పాకిస్థానే.

డబ్బులు, ఆయుధాలు ఇచ్చినంత మాత్రాన తీవ్రవాద సిద్ధాంతానికి ప్రాచుర్యం లభించదు. దాన్ని మించి చేయగల గాలి. అమెరికా అదీ చేసింది. ఇస్లాం గొప్పమతమనీ, అది తీవ్ర ప్రమాదంలో పడిందనీ, దేవుడిని నిరాకరించే కమ్యూనిస్టుల చేతుల్లోకి ఆఫ్గానిస్థాన్ వెళ్లిపోయిందనీ, ప్రతి ముస్లిమూ పవిత్రయుద్ధాన్ని (జిహాద్) చేయాల్సిన పరిస్థితి వచ్చిందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఆఫ్గాన్‌లో పవిత్ర యుద్ధానికి తరలిరావాల్సిందిగా రకరకాల రూపాల్లో ముస్లింలకు పిలుపునిచ్చింది. అరబ్బు, మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికాల నుంచే గాక యూరపు నుంచి కూడా ముస్లింలు తరలివచ్చారు. అయితే ఆఫ్గానిస్థాన్ నుంచి పొట్టచేతబట్టుకుని పాక్‌కు తరలివచ్చిన 40 లక్షల మందితో పోల్చితే వీళ్ల బలగం చాలా తక్కువ. తరలి వచ్చిన వారిలో అనువైన లక్షలాది వ్యక్తులకు ఆయుధాలు, డబ్బుని సమకూర్చి రష్యాసేనలపై మెరుపుదాడులకు శిక్షణ ఇచ్చారు. ఐఎస్ఐ, సీఐఏ నేతృత్వంలో శిక్షణశిబిరాలు ఏర్పాటయ్యాయి. కొత్త మదరస్సాలు, మతప్రచార సంస్థలూ పుట్టుకొచ్చాయి. వీటిల్లోనే ఇస్లామిక్ తీవ్రవాదాన్ని నూరిపోశారు. ఆఫ్గాన్ యుద్ధం కోసం పాకిస్థాన్‌కు అమెరికా 1980ల్లో 10 బిలియన్ డాలర్లను ఇచ్చింది. అప్పటికి కొన్ని నెలల ముందు పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరితీసిన మిలటరీ నియంత జియా ఉల్ హక్‌పై వ్యతిరేకత కూడా మొదలైంది. ఆఫ్గాన్‌లో పవిత్ర యుద్ధం జియా గతిని మార్చివేసింది. 11 ఏళ్ల జియా నియంతృత్వ పాలనలో ఇస్లాం తీవ్రవాదం ఎప్పుడూలేని రీతిలో బలపడింది. అమెరికా తన మీద ఆధారపడటాన్ని అలుసుగా తీసుకుని పంజాబ్‌లో ఖలిస్థానీ తీవ్రవాదాన్ని కూడా జియా ఎగదోశాడు. అమెరికా సమకూర్చిన అత్యాధునిక ఆయుధాలతో అన్నివైపులా దాడులకు గురైన రష్యా సైన్యం 1989 చివరినాటికి ఆఫ్గాన్ నుంచి వైదొలగింది.

రష్యన్ల బెడద తొలగిన తర్వాత తీవ్రవాదులు కశ్మీర్‌లోకి అడుగుపెట్టటం ప్రారంభించారు. అప్పటికే కశ్మీరీ ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుని ఉంది. ఎన్నికలు సక్రమంగా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి పోయింది. ఆర్టికల్ 370 కల్పించిన ప్రత్యేకతలన్నీ అప్పటికే చాలా భాగం తొలగిపోయాయి. భూముల కొనుగోలు, ఉద్యోగాల్లో స్థానికత మినహా మిగతా ప్రత్యేకతలంటూ ఏమీలేవు. ఆర్థికాభివృద్ధి అంతంతమాత్రంగానే జరిగింది. 1947, 1965, 1971లో భారత్-పాక్ మధ్య జరిగిన యుద్ధాలు, అంతర్గత అసంతృప్తుల వల్లా 1975 నాటికే సైన్యం ఇతర బలగాలు కలిపి 5 లక్షలకు పైగా భద్రతాదళాలు కశ్మీర్‌లో తిష్ఠవేశాయని వోల్‌పర్ట్ పేర్కొన్నారు. అధికార లెక్కల ప్రకారమే 1990–95 వరకూ 13000 మంది భద్రతాదళాల చేతుల్లో హతమయ్యారనీ, అనధికార లెక్కల ప్రకారం ఆ సంఖ్య 50,000 దాకా ఉండొచ్చని కూడా వోల్‌పర్ట్ పేర్కొన్నారు. 2001 సెప్టెంబర్ 11 ఘటనల తర్వాత 'వార్ ఆన్ టెర్రర్' పేరుతో ఆఫ్గాన్‌పై అమెరికా మొదలుపెట్టిన యుద్ధంతో పాకిస్థాన్‌కు మరోసారి 10 బిలియన్ల డాలర్లు వచ్చిపడ్డాయి.

ఆల్‌ఖయదా తీవ్రవాదులకు ఆశ్రయమిచ్చిన తాలిబన్లు ఆఫ్గాన్‌లో 1996లోనే అధికారంలోకి వచ్చారు. రష్యన్ వ్యతిరేక ఆఫ్గాన్ యుద్ధంలో 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితితో అనాథలైన పిల్లల నుంచి తాలిబాన్లు తయారయ్యారు. ఛాందస ముల్లాల నేతృత్వంలో కుటుంబ ప్రేమలు లేకుండా కరడుకట్టిన మధ్యయుగాల భావాలతో పెరిగిన తాలిబన్లకు... ఆధునిక నాగరికతతో వచ్చిన ప్రతి సాంకేతిక సౌకర్యంతో పాటు సంగీతం, శిల్పం, చలనచిత్రం ఇస్లాంకు విరుద్ధంగానే కన్పించాయి. అట్లాంటి తాలిబన్లతో యుద్ధం ఆరంభించి, 2.3 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టి మధ్యలోనే అమెరికా కాడి కింద పడవేసింది. 2021 నాటికి ఆఫ్గన్ నుంచి పూర్తిగా వైదొలగి తాలిబన్లకు తిరిగి అధికారాన్ని అప్పగించింది. ఒకసారి అగ్రరాజ్యం చేతిలో ఓడిపోయిన గెరిల్లాలు రెండోదఫా అదే రాజ్యంపై 20 ఏళ్ల పాటు యుద్ధరంగంలో నిలబడి విజయం సాధించటం ప్రపంచంలోనే అరుదనీ ప్రముఖ జర్నలిస్టు అహ్మద్ రషీద్ వ్యాఖ్యానించారు.

ఏ కోణం నుంచి చూసినా ఇస్లాం తీవ్రవాదం బలపడటంలో అమెరికా ఆధిపత్య దాహం నిర్వహించిన పాత్ర విస్మరించలేనిది. అమెరికా అండతోనే భారత్‌తో పాక్ రెండు సార్లు యుద్ధానికి తలపడింది. రెండు కీలక ఒప్పందాల్లో (సీఈఎన్‌టీఓ, ఎస్ఈఏటీఓ) పాక్‌ను అమెరికా భాగస్వామిని చేసుకోవటంతో కశ్మీర్ సమస్యపై భారత్ పట్టు విడుపుల్లేకుండా వ్యవహరించాల్సి వచ్చింది. చరిత్ర ఇంకో వాస్తవాన్ని కూడా మన కళ్ల ముందు ఉంచుతోంది. రణతంత్రంలో సాంకేతిక ఆధిపత్యాన్ని ప్రదర్శించినా కశ్మీరీ ప్రజల హృదయాలను గెలవటం అంతకంటే ముఖ్యమనే ఆధునిక చరిత్ర చెబుతోంది. రాష్ట్రహోదాను పునరుద్ధరించటం అందుకు మొదటిమెట్టు కావచ్చు. నియంత్రణరేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చటానికి ఇతరదేశాల మద్దతు సంపాదించటం మరో మెట్టూ కావచ్చు! వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఆ ప్రయత్నం కొంత జరిగింది. వైషమ్యాల కాలం ముగిస్తేనే జనాకర్షక నినాదాలు తొలగి నిబ్బర ఆలోచనలతో నిజమైన అడుగులు పడతాయి. శత్రు పరివేష్టితం ఎప్పటికీ శ్రేయస్కరం కాదు.


akbar


■ రాహుల్ కుమార్

రణతంత్రంలో సాంకేతిక ఆధిపత్యాన్ని ప్రదర్శించినా కశ్మీరీ ప్రజల హృదయాలను గెలవటం అంతకంటే ముఖ్యమనే ఆధునిక చరిత్ర చెబుతోంది. రాష్ట్రహోదాను పునరుద్ధరించటం అందుకు మొదటిమెట్టు కావచ్చు. నియంత్రణరేఖను అంతర్జాతీయ సరిహద్దుగా మార్చటానికి ఇతరదేశాల మద్దతు సంపాదించటం మరో మెట్టూ కావచ్చు! వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఆ ప్రయత్నం కొంత జరిగింది. వైషమ్యాల కాలం ముగిస్తేనే జనాకర్షక నినాదాలు తొలగి నిబ్బర ఆలోచనలతో నిజమైన అడుగులు పడతాయి. శత్రు పరివేష్టితం ఎప్పటికీ శ్రేయస్కరం కాదు.

మతతత్వ భూతాలకు ప్రాణంపోసిన తర్వాత అవి స్వతంత్రజీవుల్లా వ్యవహరిస్తాయి. సొంత లక్ష్యాలను ఏర్పరచుకుంటాయి. అలా వ్యవహరించబట్టే ఆల్‌ఖయదా చేతుల్లో అమెరికా కనీవినీ ఎరగని దారుణాన్ని భయోత్పాతాన్ని చవిచూసింది. పాకిస్థాన్‌కూ ఈ గతి తప్పటంలేదు.

న్యాయ వ్యవస్థకు మకిలి పట్టిందా?

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల్లో సగం మంది అవినీతిపరులు, నేరస్తులేనని వేర్వేరు సందర్భాల్లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ గతంలో ఆరోపించారు. వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకున్నప్పుడు, జరిమానా కట్టడానికి సైతం వారు నిరాకరించి తమ మాట మీదే నిలబడ్డారు.

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన ఓ అగ్ని ప్రమాదం అనంతరం కాలిన కరెన్సీ నోట్లు బస్తాల కొద్దీ బయటపడ్డాయి. దీంతో 'న్యాయమూర్తుల అవినీతి' అంశం దేశవ్యాప్తంగా మరోసారి చర్చల్లోకొచ్చింది. పక్కా ఆధారాలు దొరికిపోయినా, సాధారణ నేరస్తుల్లాగా యశ్వంత్ వర్మ ఆ నేరారోపణను తిరస్కరించి, 'తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంద'ని వెల్లడించారు. గతంలో సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.డి. దినకరన్‌లా తన పదవికి రాజీనామా చేసి ఉంటే కనీసం ఆయనకు గౌరవం అయినా దక్కేది. యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిరిగి బదిలీ చేయబోగా, "మా హైకోర్టేమీ చెత్త బుట్ట కాదు" అంటూ అక్కడి న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. చివరకు యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ నాటి సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా మే 7న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాల్సి వచ్చింది.



ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'జీవించే హక్కు'పై తీర్పు చెప్పిన జస్టిస్ ఖన్నా, ఆ తీర్పు ఇవ్వడానికి ముందు తన చెల్లెలితో మాట్లాడుతూ.. 'రేపు నేనివ్వబోయే తీర్పు భవిష్యత్తులో నన్ను ప్రధాన న్యాయమూర్తిగా ఉండనివ్వదు' అన్నారట. అన్నట్లే అయన స్థానంలో జూనియర్ అయిన జస్టిస్ బేగ్‌ను 1976లో సీజేగా నియమించారు.

దేశంలోని అన్ని హైకోర్టుల్లోను (25) కలిపి 1,044 మంది న్యాయమూర్తులు ఉండాలి. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు ఉండాలి. ఇక కింది స్థాయిలో మొత్తం 25,077 మంది న్యాయమూర్తులుండాలి. కానీ ప్రస్తుతం 19,309 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. ఇంకా 5,768 ఖాళీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్‌లో న్యాయమూర్తుల సంఖ్య 533, తెలంగాణలో 461. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. నేను న్యాయవాదిగా 42 సంవత్సరాల నుంచి క్రియాశీలకమైన ప్రాక్టీస్‌లో ఉన్నాను. నా సర్వీసు మొత్తంలో నేను సుమారు ఐదారు వందలమంది న్యాయమూర్తులతో కలిసి పనిచేశాను. న్యాయమూర్తుల గురించిన పరోక్ష సమాచారం కూడా నాకు అందుతూ ఉంటుంది. అందులో కూడా ఈ మొత్తం సంఖ్య 1000 మంది అనుకుంటే.. వీరందరిని కలిపి చూసినా కూడా అవినీతి ఆరోపణలు వచ్చిన న్యాయమూర్తులు ఏ స్థాయిలోనూ అయిదు శాతం మంది కూడా ఉండరు. 80వ దశకం ప్రారంభంలో నేను న్యాయవాదిగా వచ్చినప్పుడు జిల్లా జడ్జి జీతం పదివేల లోపు, మేజిస్ట్రేటుల జీతం మూడువేల లోపు ఉండేది. అయినా నిజాయితీగా జీవించిన న్యాయమూర్తులే అధికం.

ఎలా చూసినా మొత్తం న్యాయమూర్తుల్లో అవినీతిపరులు అయిదు శాతం కన్నా తక్కువే ఉన్నా... సగానికి సగం అవినీతిపరులు ఉన్నట్లు పేర్కొనటం న్యాయమేనా? ఈ అవినీతి కూడా ఉన్నత స్థాయి న్యాయమూర్తుల్లో ఉన్నంతగా కింది స్థాయిలో లేదనే విషయం కూడా గమనించాలి. న్యాయమూర్తుల్లో నీతి, న్యాయం కోసం తమ భవిష్యత్తును పణంగా పెట్టిన మహానుభావుల్ని కూడా మనం స్మరించుకోవాలి.


ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా తీర్పునిస్తే తదనంతర పరిణామాలు తెలిసి కూడా జస్టిస్ జగ్‌మోహన్ సిన్హా 1975లో ఆమె ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'జీవించే హక్కు'పై తీర్పు చెప్పిన జస్టిస్ ఖన్నా, ఆ తీర్పు ఇవ్వడానికి ముందు తన చెల్లెలితో మాట్లాడుతూ.. 'రేపు నేనివ్వబోయే తీర్పు భవిష్యత్తులో నన్ను ప్రధాన న్యాయమూర్తిగా ఉండనివ్వదు' అన్నారట. అన్నట్లే ఆయన స్థానంలో జూనియర్ అయిన జస్టిస్ బేగ్‌ను 1976లో సీజేగా నియమించారు. జస్టిస్ ఏ.ఏ. ఖురేషిని సుప్రీం కొలీజియం సిఫార్సు చేసినా కూడా గుజరాత్‌లో మోదీకి, అమిత్‌షాకు వ్యతిరేకంగా తీర్పులిచ్చిన కారణంగా ఆయన్ను సుప్రీంకోర్టు మెట్లు ఎక్కనివ్వలేదు.

పదవీ విరమణ తర్వాత ఇతర పదవుల కోసం కక్కుర్తి పడిన ఓ అయిదారుగురిని చూపించి నిజాయితీగా జీవితం గడిపిన వందలాది న్యాయమూర్తుల్ని అవమానించటం సరైనది కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాల్ని అనుసరించిన అనేక సందర్భాల్లో ప్రజలకు ఊరట కలిగించింది న్యాయవ్యవస్థే. ప్రతిపక్షాలు సైతం నిర్వీర్యమైన పరిస్థితుల్లోనూ న్యాయస్థానాలే ప్రజలను ఆదుకున్న చరిత్రని 2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో చూశాం. అందుకే పదవీ విరమణ చేసి వెళ్లిపోతున్న న్యాయమూర్తులకు ప్రజలు బారులు తీరి నీరాజనాలు పలికిన దృశ్యాల్ని ఆనాడు అనేక మాధ్యమాల్లో వీక్షించాం. మరి మొత్తం న్యాయవ్యవస్థ పాపపంకిలమైందన్నట్లు ప్రచారం చేయడం న్యాయం కాదు. ప్రజలు అంతిమంగా ఆధారపడాల్సిన వ్యవస్థ పట్ల అపనమ్మకం కలిగించటం కూడా భావ్యం కాదు.

• చెరుకూరి సత్యనారాయణ

ప్రజల కోసం ప్రకాశించిన జీవితం

దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడి, తర్వాత కూడా తమ జీవితాల్ని ప్రజాసేవకు అంకితం చేసిన వారు ఎందరో. అలాంటి వారిలో తెలుగు బిడ్డ, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ముందు వరుసలో ఉంటారు. ఆయన జీవితం తెరచిన పుస్తకం. ప్రకాశం పంతులు తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చవి చూశారు. పదవుల కోసం ఆయన ఏనాడూ పాకులాడలేదు. పదవులే ఆయన్ను వరించాయి. నమ్మిన సిద్ధాంతాలను త్రికరణశుద్ధిగా ఆచరించారు. నేటి రాజకీయ నాయకులు చాలా మంది తరతరాలకు సరిపోయేంతగా ఆస్తిపాస్తులను సంపాదించుకుంటున్నారు. కానీ ప్రకాశం పంతులు ఇందుకు పూర్తిగా భిన్నం. తాను న్యాయవాదిగా సంపాదించిన రూ. లక్షల ఆస్తులను ప్రజల కోసం ఖర్చు చేశారు. లేమికి ఆయన ఎప్పుడూ చింతించలేదు.



రాజకీయ రంగంలోనూ ప్రకాశం పంతులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ప్రకాశం పంతులు గొప్పతనం గురించి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఇలా అన్నారు. 'సాహసంతో స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించిన దేశభక్తుల్లో ప్రకాశం పంతులు అగ్రశ్రేణిలో ఉంటారు. ముందు వెనుకలు చూడని ధైర్యం, దాతృత్వం ఆయన సొంతం. దేశం కోసం పోరాడేలా ఆయన తన అనుయాయుల్లో స్ఫూర్తిని రగిలించారు. ప్రకాశం పంతులు గొప్ప నాయకుడు' అంటూ ప్రశంసించారు.

ప్రకాశం పంతులు మరణానంతరం ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తన సంతాప సందేశంలో... "1920 నుంచి ప్రకాశం పంతులు గారితో నాకు పరిచయం, సహచర్యం ఉన్నాయి. మేమిద్దరం సంపూర్ణంగా ఏకీభవించలేని సందర్భాలు ఉన్నా, ఆయన గుణసంపత్తిని నేను ఎప్పుడూ ప్రశంసాభావంతోనే చూసేవాడిని. ఆయనలో నిత్య జాగృతశక్తి ఉండేది. ప్రకాశం పంతులులో చైతన్యం, దీక్ష, కార్యదక్షతలు వయసుతో పాటు సన్నగిల్లలేదు. భారత రాజకీయాల్లో ఆయన ప్రభావం చెరగనిది. బ్రిటిష్ తుపాకులకు తన గుండెను చూపించిన సాహసి" అంటూ కొనియాడారు. తన సర్వస్వాన్ని దేశ స్వాతంత్ర్య సమరం కోసం త్యాగం చేసిన మహావ్యక్తి ప్రకాశం. చివరి దశలో తన కోసం ఒక రాగిపాత్రను కూడా మిగుల్చుకోలేదు. ఈనాటి రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.

– డా. పి.మోహన్ రావు
చైర్మన్, ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంటల్ స్టడీస్
(నేడు టంగుటూరి ప్రకాశం వర్ధంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

రేపటి తరానికి మూడు నవీన విద్యానైపుణ్యాలు

సాంకేతిక పురోగతితోపాటు పలు వృత్తులలో పనిచేసే పద్ధతులు కూడా వేగంగా మారుతున్నాయి. పరిశ్రమలు విస్తృతంగా కృత్రిమ మేధస్సు (ఏఐ)ను వినియోగిస్తున్నాయి. పని తీరును డిజిటలైజ్ చేస్తున్నాయి. దీనికి అనుగుణంగా పరిశ్రమల యాజమాన్యాలు ఆ రంగాల్లో నిపుణులైనవారినే గాక, విమర్శనాత్మకంగా ఆలోచించగల, సృజనాత్మకంగా పనిచేయగల గ్రాడ్యుయేట్లను కోరుకుంటున్నాయి.

దశాబ్దాలుగా భారతీయ ఉన్నత విద్య లోతైన అంశాలవారీ విషయ పరిజ్ఞానంపై దృష్టి సారించింది. ఈ సాంప్రదాయ విద్య విద్యార్థులకు పునాది లాంటి విజ్ఞానాన్ని అందజేసినా, ఆధునిక జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు వారిని సంసిద్ధం చేసేందుకు చాలాసార్లు అది సరిపోవటం లేదు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్య స్వరూపంపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది. మూడు ముఖ్యమైన ఆధునిక నైపుణ్యాలు నేడు కీలకంగా మారాయి. అవి- కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ), కృత్రిమ మేధస్సుపై అవగాహన (ఏఐ), డిజైన్ థింకింగ్ (డీటీ).

సాంప్రదాయ విద్య ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానం ఇక భవిష్యత్తు తరాలకు సరిపోదు. అంశాలవారీ విజ్ఞానంతో పాటు సమస్య పరిష్కారం, సాంకేతిక అవగాహన, విభిన్న ఆలోచనలను ఏకీకృతం చేయగల మూడు ముఖ్యమైన ఆధునిక సామర్థ్యాలు (సీటీ-ఏఐ-డీటీ)తో సన్నద్ధం చేయాలి.

కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ) అనేది సంక్లిష్ట సమస్యలను విశ్లేషించి, పరిష్కారాలను రూపొందించడంలో కంప్యూటర్ సైన్స్ పద్ధతులను ఉపయోగించే విధానం. ఇందులో క్లిష్టమైన సమస్యలను సులభంగా చేయగల భాగాలుగా విభజించడం, నమూనాలను గుర్తించడం, అల్గారిథమ్‌లను తయారు చేయడం, ముఖ్యమైన సమాచారంపై దృష్టిసారించి ప్రాధాన్యం లేని వివరాలను వడపోసి సమస్యా పరిష్కార పద్ధతులను రూపొందించడం... వంటివి ఇమిడి ఉంటాయి. దీనిని అన్ని రంగాలలోనూ ఉపయోగించవచ్చు.

ఏఐ అక్షరాస్యత (ఏఐ లిటరసీ) నేటి కాలంలో ఎంతో కీలకంగా మారింది. ఏఐ అభివృద్ధి అటు పరిశ్రమల పనితీరును, ఇటు నిత్య జీవితాన్ని వేగంగా మారుస్తుంది. ఈ పరిస్థితుల్లో ఏఐకి సంబంధించిన ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవడం ప్రతి ఒక్కరికీ కీలకం. ఏఐ అక్షరాస్యత అంటే- మనుషులు విషయాలను నేర్చుకునే విధానాన్ని, సమస్యలను పరిష్కరించే పద్ధతిని, నిర్ణయాలు తీసుకునే తీరును, కొత్త ఆలోచనలను విడమరచి చెప్పే సామర్థ్యాన్ని యంత్రాలు ఎలా అర్థం చేసుకుంటాయో తెలుసుకోవడం. పెరుగుతున్న కృత్రిమ మేధ సమ్మిళిత (ఏఐ ఇంటిగ్రేటెడ్) ప్రపంచాన్ని ముందుకు నడపడానికి గాను ఏఐ పని తీరు, పరిమితులు, నైతిక బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకోవాలి.


వినియోగదారుల అవసరాలు, సాంకేతికపరమైన అవకాశాలు, వ్యాపార సాధ్యాసాధ్యాలను సమన్వయపరిచే మానవ కేంద్రీకృతమైన ఆవిష్కరణ విధానమే డిజైన్ థింకింగ్ (డీటీ). ఇది ఐదు దశల ప్రక్రియ. ఇతరుల అవసరాలను సానుభూతితో అర్థం చేసుకోవడం, నిర్వచించడం, కొత్త రూపకల్పనలను సూచించడం, ఆమోదించిన నమూనాను రూపకల్పన చేయడం, ఆ నమూనా పరీక్ష చేయడం. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా సమస్యలను అర్థం చేసుకోవడంలో, కొత్త పరిష్కారాలను రూపొందించడంలో ఇది ఎంతో సహాయ పడుతుంది.

పలు వృత్తుల వారికి అవసరమైన ప్రాథమిక అంశాలుగా ఈ మూడు నైపుణ్యాలు రూపొందాయి. కళలు, వాణిజ్యం, సైన్స్, న్యాయవిద్య తదితర రంగాలలో ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ఈ నైపుణ్యాలను అండర్ గ్రాడ్యుయేట్ విద్యా ప్రణాళికలో భాగం చేయాలి. దీనికోసం ఒక సమగ్ర విధానం రూపొందించి, దేనిని, ఎలా బోధించాలో పునరాలోచించాలి. సిద్ధాంత పరంగా వివరించే కంటే, ఆచరణాత్మకంగా నైపుణ్యాలను పెంపొందించేలా కంప్యూటేషనల్ థింకింగ్, ఏఐ, డిజైన్ థింకింగ్ కోర్సులను ప్రధాన పాఠ్యాంశాలలో చేర్చాలి.

ఈ మార్పులను అమలు చేయడానికి ముందు పాఠ్యాంశాలను జాగ్రత్తగా తీర్చిదిద్దాలి. తగిన వనరులను సమకూర్చాలి. ఈ ఆధునిక సమ్మిళిత విద్య ద్వారా గ్రాడ్యుయేట్లు తమ అంశాలవారీ జ్ఞానాన్ని వినూత్న నైపుణ్యాలతో అన్వయించగలుగుతారు. విమర్శనాత్మక ఆలోచన చేయగలుగుతారు. సమస్యకు తగ్గ పరిష్కారం కనుగొనడానికి అందుబాటులో ఉన్న కొత్త పద్ధతులను వినియోగించగలుగుతారు.

జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) 2020 వివిధ రకాల సబ్జెక్టులు నేర్చుకోవడం, లోతుగా ఆలోచించడం, డిజిటల్ అక్షరాస్యతకు ప్రాధాన్యతనిస్తుంది. ఈ ప్రతిపాదించిన పాఠ్యాంశాలు జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయి. ఇప్పటికే సమతూకంగా ఉన్న పాఠ్య ప్రణాళికలకు మరిన్ని అంశాలను జోడించే బదులు, ఈ అత్యాధునిక కోర్సులు విద్యార్థులను మరింత రాటుదేలేలా, ఉపాధికి పనికొచ్చేలా చేస్తాయి. ఇవి కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే కాదు, అన్నిరకాల గ్రాడ్యుయేట్లకు అవసరమైన ప్రాథమిక అక్షరాస్యతలు. విశ్వవిద్యాలయాలన్నీ కంప్యుటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజైన్ థింకింగ్‌లను తమ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రధాన భాగాలుగా వేగంగా అమలు చేయాలి. భవిష్యత్తు సమాధానాలు గుర్తుంచుకునే వారిది కాదు, సరైన ప్రశ్నలు అడిగి, మెరుగైన పరిష్కారాలను సూచించే వారిది!

విశ్వవిద్యాలయాలన్నీ కంప్యుటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజైన్ థింకింగ్‌లను తమ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో ప్రధాన భాగాలుగా వేగంగా అమలు చేయాలి. భవిష్యత్తు.. సమాధానాలు గుర్తుంచుకునే వారిది కాదు, సరైన ప్రశ్నలు అడిగి, మెరుగైన పరిష్కారాలను సూచించే వారిది!



◆ ప్రొఫెసర్ ఎన్. శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు, ఐఐటీ మద్రాసు

ద్వీపానికి ఉక్కు కవచం



స్టీల్ షీట్ పైలింగ్‌తో వరద దుర్భేద్యంగా భవానీ ఐల్యాండ్

- రూ.2.65 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 200 మీటర్ల మేర షీట్ పైలింగ్ పనులు
- 9 మీటర్ల నదీ లోతున వేయనున్న బీఐటీసీ
- మేజ్ గార్డెన్, గేమింగ్ జోన్ల పునరుద్ధరణ

కృష్ణానదికి ఎంత పెద్ద వరద వచ్చినా భవానీ ద్వీపాన్ని దుర్భేద్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో స్టీల్ షీట్ పైలింగ్ చేపట్టడానికి భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) సిద్ధమవుతోంది. పశ్చిమ భాగాన వరద తాకే ప్రాంతంలో ఈ షీట్ పైలింగ్ చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. - కథనం 8లో



వందేభారత్ డిపో రెడీ!

- ఇక నగరం కేంద్రంగా నిర్వహణ పనులు
- డిపో, పరిపాలనా భవనం, రైలు ట్రాక్ సిద్ధం
- భారీ మంచినీటి ట్యాంక్ ఏర్పాటు
- ప్రస్తుతం నడుస్తున్న మూడు వందేభారత్‌లు
- రానున్న రోజుల్లో పెరగనున్న రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ కేంద్రంగా జరుగుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మెయింటినెన్స్ డిపో పనులు తుదిదశకు చేరుకున్నాయి. మరికొద్ది రోజుల్లోనే డిపో ప్రారంభం కానుంది. విజయవాడ మీదుగా మిగతా 6లో..

బెంగళూరుకు వందేభారత్?

రైల్వే అధికారుల ప్రతిపాదన 6



కిక్కిసలో నోక్కిసలాట

'పనులు దక్కడానికి టెండర్ ఎంత తక్కువైనా వేద్దాం. టెండర్ దక్కాక ఏదోలా పని కానిచేద్దాం. తర్వాత బిల్లులు పూర్తిస్థాయిలో తీసుకుందాం.' ఇదీ జలవనరుల శాఖలో కాంట్రాక్టర్ల ఆలోచనాతీరు. టెండర్లలో పోటీపడి తక్కువగా కోట్ చేశాక పనులు తమకు నచ్చినట్టుగా చేస్తున్నారు. ఆయా కాల్వల వద్ద పరిస్థితి చూస్తుంటే అసలు ఇక్కడ పనులు జరిగాయా.. అనే అనుమానం కలుగుతోంది. కాల్వల వద్ద మళ్లీ మొలకెత్తుతున్న కిక్కిసే ఇందుకు నిదర్శనం.

జిల్లాలోని కాల్వల్లో నామమాత్రంగా కిక్కిస తొలగింపు పనులు

- జనవరిలో టెండర్లు, మార్చిలో పనులు పూర్తి
- జూన్‌లో నీటి విడుదల.. ఈలోపే పెరిగిన కిక్కిస
- మూడు ప్రధాన కాల్వల్లోనూ ఇదే పరిస్థితి
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. బిల్లులకు మాత్రం సిద్ధం
- ముడుపుల మాయలో జలవనరుల శాఖ ఇంజనీర్లు



ఉంగుటూరు మండలం ఆత్కూరు యూటీ డ్రెయిన్ వద్ద తొలగించినా మళ్లీ మొలకెత్తిన కిక్కిస

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో బందరు, ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వలు ప్రవహిస్తాయి. విజయవాడ నుంచి దిగువకు వెళ్లేకొద్దీ ఈ కాల్వల్లో ఒకప్పుడు తూటికాడ, గుర్రపుడెక్క ఎక్కువగా కనిపించేది. కొన్నేళ్లుగా కిక్కిస మొలకెత్తడం మొదలైంది. త్వరలో కాల్వలకు నీరు వదలనుండటంతో కిక్కిస తొలగింపు పనులకు జలవనరుల శాఖ టెండర్లు పిలిచింది. ఈ టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులిపేసుకున్నారు. దీంతో కాల్వల వద్ద పాత పరిస్థితే కనిపిస్తోంది.

తూతూమంత్రంగా పనులు.. అయినా బిల్లులకు రెడీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మూడు ప్రధాన కాల్వల ద్వారా తాగు, సాగునీరు సరఫరా అవుతోంది. బందరు, రైవస్, ఏలూరు కాల్వలు జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. వీటికి అనుబంధంగా సుమారు 200 వరకు ఉపకాల్వలు ఉన్నాయి. ఒక్కో ప్రధాన కాల్వకు పది వరకు ఉపకాల్వలు ఉంటాయి. వాటికి అనుబంధంగా పిల్ల కాల్వలు ఉంటాయి. తూర్పుడెల్టా పరిధిలో ఆయకట్టు సాగుకు మొత్తం ఈ కాల్వల ద్వారానే నీరు అందుతోంది. వీటిలో అల్లుకుపోయిన కిక్కిసను తొలగించడానికి జలవనరుల శాఖ అధికారులు జనవరిలో టెండర్లు ఆహ్వానించారు. మొత్తం రూ.25.49 లక్షల పనులకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లను 38.89 శాతం తక్కువకు వేసి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్నారు. హడావిడిగా మార్చి నెలాఖరుకు పనులు పూర్తిచేశారు. వాస్తవానికి కిక్కిసను వేళ్ల సహా తొలగించాలి. అటువంటిది కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్లతో పైపైనే తొలగించారు. దీంతో కాల్వల వద్ద మళ్లీ కిక్కిస మొలకెత్తుతోంది. అసలు పనులు ఏ స్థాయిలో, ఏవిధంగా జరిగాయో పరిశీలించాల్సిన ఇంజనీర్లు ముడుపుల మత్తులో జోగుతున్నారు. పనులు జరిగిన వైపు ఇప్పటి వరకు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. కానీ, పనులు పూర్తి చేశామని చెబుతూ కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

ముడుపుల మత్తులో ఇంజనీర్లు

కాల్వల్లో తూటికాడ, గుర్రపుడెక్క ఉన్నా నీరు ఎంతో కొంత నెమ్మదిగా ఉపకాల్వలకు ప్రవహిస్తుంది. అదే కిక్కిస కాల్వలను అల్లుకుందంటే ఇక అంతే సంగతులు. నీటిని కిందకు ప్రవహించకుండా అడ్డుకుంటుంది. వాటిని తొలగించడానికి కూలీలూ కిందకు దిగలేని పరిస్థితి ఉంటుంది. కృష్ణాడెల్టా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కిక్కిస పేరు వినిపించలేదు. ఇది ఎక్కువగా కొల్లేరు ప్రాంతంలో ఉండేది. నెమ్మదిగా కృష్ణాడెల్టాలోని కాల్వలోకి ప్రవేశించింది. ఐనంపూడి డ్రెయిన్, ఏనుగులకోడు, నందివాడ మండలంలోని ఆత్కూరు యూటీ (అండర్ టన్నల్), ఉంగుటూరు మండలంలోని వన్నేరు మీదుగా ప్రవహిస్తున్న కాల్వల్లో కిక్కిరిసి అల్లుకుపోయింది. గట్ల నుంచి కాల్వల వరకు విస్తరిస్తోంది. జూన్‌లో జలవనరుల శాఖ అధికారులు కాల్వలకు నీటిని విడుదల చేసినా పూర్తిగా కిందకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది.





కార్పొరేషన్‌లో అగ్నిప్రమాదం!

'కార్పొరేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం'.. ఆగండాగండి.. ఇది నిజమైన ప్రమాదం అనుకోకండి. అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు, అత్యవసర స్పందనకు సంబంధించిన అంశాలను అగ్నిమాపక అధికారులు చేసి చూపించారు.

ఇదేం మాయ గోవిందా?



దాతలు దాతృత్వంతో దానం చేసిన దాదాపు రూ.250 కోట్ల విలువైన భూమి రికార్డులు ఎక్కడైనా మాయమవుతాయా? ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖలో జరిగింది అదే. వైసీపీ హయాంలో తెరలేచిన ఈ కబ్జాపర్వంలో నిజానిజాలు బయటపడుతుండటంతో సదరు స్థలం రికార్డులు తమ వద్దే లేవని అధికారులు దాటవేస్తుండటంపై అనుమానాలు కలుగుతున్నాయి.

రూ.250 కోట్ల విలువైన భూముల రికార్డులు లేవట!

- గోవిందరాజులు భూములపై దేవదాయ శాఖ వివరణ
- తమ కార్యాలయంలో రికార్డులు లేవని వాదన
- ఉన్నతాధికారులను పక్కదారి పట్టించే కథలు
- రికార్డుల మాయం వెనుక సూత్రధారులెవరు?

ఇంద్రకీలాద్రి, మే 19 (ఆంధ్రజ్యోతి) : పటమటలంకలోని దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూముల రికార్డులు మాయమైనట్లు తెలుస్తోంది. జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన రికార్డులు మాయం కావటంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ట్రస్టుకు సంబంధించిన భూముల అన్యాక్రాంతంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చినప్పటికీ దేవదాయ అధికారులు.. ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు పంపిస్తూ వ్యవహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గోవిందరాజుల వంశీకుల మిగతా 6లో..

రికార్డులు మావద్ద లేవు

ట్రస్టుకు సంబంధించిన రికార్డులు తమ కార్యాలయంలో లేవని ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారి నటరాజన్ షణ్ముగం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గతంలో వచ్చిన కథనాలపై జిల్లా కార్యాలయంలో ఎటువంటి ఆధారాలు లేవని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. ఆధారాలు ఎవరి వద్ద నుంచి అయినా లభిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

భూములు దేవదాయ శాఖవే..

గతంలో ట్రస్ట్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావటంతో నాడు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. 2023, సెప్టెంబరులో విచారణాధికారిగా మచిలీపట్నంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సుబ్బారెడ్డి పూర్తి విచారణ చేసి అన్యాక్రాంతానికి గురైన భూమి వివరాలను తెలియజేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అంతేకాకుండా 1981లో ట్రస్ట్ ప్రతినిధి జి.శ్రీనివాసరావు అడిగిన మేరకు.. ఆ భూములు ట్రస్టుకే చెందుతాయని, 1982లో నాటి ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ధ్రువీకరించారు. ఇప్పుడు రికార్డులు లేవని చెబుతున్న అధికారులు.. ఈ విషయాలను మాత్రం మరిచిపోయారు.

తిరువూరు మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ, వైసీపీ నేతల మోహరింపు



తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేటికి వాయిదా

కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి నిర్ణయం

- మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ, వైసీపీ ఘర్షణ
- తమను కార్యాలయంలోకి రానివ్వలేదని వైసీపీ నిరసన
- తమ వారిని నిర్బంధించారని టీడీపీ ఆరోపణ
- ఇరువర్గాల బాహాబాహీ.. చెదరగొట్టిన పోలీసులు



ఎన్నికకు హాజరైన టీడీపీ సభ్యులు

తిరువూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఉద్రిక్తతల నడుమ తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. సరిపడా సభ్యులు (కోరం) లేకపోవడంతో చైర్‌పర్సన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. ఈ ఎన్నికకు సోమవారమే అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలుత టీడీపీ కౌన్సిలర్లను పోలీసులు నిలిపివేయడంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలగజేసుకుని, బారికేడ్లను పక్కకు తోసి తమ సభ్యుల్ని లోపలకు పంపించారు. ఆ తర్వాత ప్రత్యేక వాహనంలో వచ్చిన వైసీపీ సభ్యులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరిని మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. వారంతా బారికేడ్లను తొలగించుకుని ముందుకొచ్చేందుకు ప్రయత్నించగా, ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు.. వైసీపీకి చెందిన ఇతరులను అడ్డుకున్నారు. అయితే, అధికార పార్టీ నాయకులు తమను లోపలకు వెళ్లనీయడం లేదని వైసీపీ కౌన్సిలర్లు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. కార్యాలయం మిగతా 6లో..

ఇరువర్గాల మోహరింపు

సోమవారం ఉదయం నుంచే టీడీపీ, వైసీపీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం వద్ద మోహరించాయి. ఓవైపు ఎమ్మెల్యే కొలికపూడితో పాటు టీడీపీ కౌన్సిలర్లు కార్యాలయానికి భారీగా చేరుకోగా, మరోవైపు వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులు.. టీడీపీ శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడంతో వివాదం చెలరేగింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రశాంత వాతావరణం నెలకొంటున్న సమయంలో బయట నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు తిరిగి మున్సిపల్ కార్యాలయం వద్ద గొడవ చేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, కొందరు టీడీపీ కార్యకర్తలకు స్వల్పగాయాలయ్యాయి.

తప్పతాగి తన్నులాట

- ముగ్గురు స్నేహితుల వీరంగం
- నగరంలో పలువురిపై దాడి
- అపస్మారకస్థితిలో డెలివరీ బాయ్

విజయవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు స్నేహితులు పీకల దాకా తాగారు. కారులో బయటకు వచ్చారు. నడిరోడ్డుపై కనిపించిన వాళ్లందరితో కయ్యానికి కాలు దువ్వారు. ఎదురుతిరిగిన వారిపై దాడి చేశారు. యనమలకుదురుకు చెందిన ముగ్గురు యువకులు ఆదివారం రాత్రి సృష్టించిన వీరంగం ఇది. పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన రోహిత దస్తావేజు లేఖరి వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. దీక్షిత్ కొరియర్ సర్వీసులో ఉద్యోగి. చందు రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. ఈ ముగ్గురు మిగతా 6లో..

కడగండ్లు తీరేనా..?

బుడమేరు గండ్ల వద్ద రక్షణ గోడ నిర్మాణానికి వర్షం అడ్డు

- నిర్మాణ ప్రాంతంలో నిలిచిన నీరు
- ఇంజన్లతో తోడుతూ పనుల కొనసాగింపు
- ముంచుకొస్తున్న వర్షాకాలం.. జూన్ 10కి పనులు పూర్తయ్యేనా?
- పనులు ముందే మొదలుపెడితే బాగుండేదన్న అభిప్రాయాలు



ఇంజన్లతో నీటిని బయటకు తోడుతూ..

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి : బుడమేరు ప్రక్షాళనలో భాగంగా భారీ గండ్లు పడిన ప్రాంతంలో ప్రారంభించిన రిటైనింగ్ వాల్ పనులకు వరుణుడు ఆటంకం కలిగిస్తున్నాడు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు కాంక్రీట్ పనులకు అవరోధంగా మారాయి. గత ఏడాది సెప్టెంబరులో సంభవించిన వరదలకు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి నాల్గో కిలోమీటర్ వద్ద సైఫన్స్ ఉన్నచోట బుడమేరు వరద మళ్లింపు కాల్వ (బీడీసీ) లెఫ్ట్ బండ్‌కు సుమారు అర కిలోమీటర్ వ్యవధిలో మూడు భారీ గండ్లు పడ్డాయి. యుద్ధప్రాతిపదికన కేవలం 10 రోజుల్లో ఆ గండ్లను ప్రభుత్వం పూడ్చించింది. ఆ సమయంలో కట్ట వద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా ఉంచారు. కానీ, ఆ రాళ్ల సందుల్లో మట్టి వేయకపోవడం వల్ల నీరు లీక్ అవుతోంది. దీంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.28 కోట్లు కేటాయించడంతో ఈ నెల 14న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు భూమిపూజ చేసి ఎర్త్‌వర్క్ పనులను ప్రారంభించారు. ఆ మరుసటి రోజు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కాంక్రీట్ పనులు ప్రారంభించారు. పనులు మిగతా 6లో..



మహిమాన్వితక్షేత్రం కొండపర్వగట్టు

- విస్సన్నపేటలో ఆహ్లాదకర వాతావరణంలో అలరారుతుతున్న సుందర ప్రాంతం
- పర్యాటకాభివృద్ధికి దోహదపడే క్షేత్రం

6

ప్రాణంతీసిన ఈత సరదా

పెళ్లింట విషాదం

- పార్వతీపురం మన్యం జిల్లా గెడ్డలో మునిగి ఇద్దరు మృతి
- మృతుల స్వస్థలం నూజివీడు

భక్తులకు మెరుగైన సేవలందించండి

● అధికారులతో సమీక్షలో దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 19(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలందించాలని అధికారులకు ఈవో శీనానాయక్ సూచించారు. అమ్మవారి సన్నిధిలో ప్రొటోకాల్ విధానం, ఆర్జిత సేవలు, త్వరగా దర్శనం కల్పించడం, ప్రజా రవాణా, తాగునీరు, వివిధ సౌకర్యాల కల్పనపై సోమవారం వివిధ విభాగాల బాధ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్ నిర్వహించిన స మావేశంలో నిర్దేశించిన అంశాలను సిబ్బందికి వివరించారు. భక్తుల సంతృప్తస్థాయి పెంచడం, గౌరవంగా మెలగడం, సాంకేతికతను ఉపయోగించి భక్తులకు మెరుగైన సేవలు అందించడంపై వివిధ విభాగాల నుంచి వివరాలు తెలుసుకుని సమీక్షించారు. ఈఈ కోటేశ్వరరావు, ఏఈఓలు పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు, జె.శ్రీనివాసం పాల్గొన్నారు.


వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దుర్గగుడి ఈవో శీనా నాయక్


సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

యువతకు మార్గదర్శి పుచ్చలపల్లి సుందరయ్య

● వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతల ఘన నివాళి

గవర్నర్‌పేట, మే 19(ఆంధ్రజ్యోతి): నిరాశ, నిస్పృహలకు లోనవుతున్న యువతకు ప్రత్యామ్నాయ ఆలోచనలు, స్ఫూర్తినివ్వడంలో మార్క్సిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎంజీ రోడ్డులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవగేయాలు ఆలపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, నాయకులు కె.ఉమామహేశ్వరరావు, గేయానంద్, ఎస్. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సుందరయ్య


బెజవాడ బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ

విజయవాడ లీగల్: నేటి రాజకీయ నాయకులు పది తరాలకు సంపాదించుకుంటుంటే, పుచ్చలపల్లి సుందరయ్య పది తరాలు బాగుపడాలని రాజకీయాలు చేశారని రాజకీయ నాయకులంతా ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రజాసంక్షేమానికి పాటుపడాలని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తమ్మారెడ్డి భరద్వాజ విచ్చేసి, సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కామ్రేడ్ సుందరయ్య జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాసరావు, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు పాల్గొన్నారు.


నాగలక్ష్మీ అమ్మవారు, పూజల్లో పాల్గొన్న అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ దంపతులు

కన్నుల పండువగా శాంతి కల్యాణం

కంచికచర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): వసంత కాలనీలో మహావిష్ణు సమేత నాగలక్ష్మీదేవి అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా జరిగింది. ఉదయం అమ్మవారిని అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ-లక్ష్మి దంపతులతో పాటుగా నాలుగు జంటలు పీటలపై కూర్చొని శ్రీసూక్త సహిత సర్వదైవత్య సారమాత్మిక హోమం నిర్వహించారు. వేద పండితులు అమ్మవారి శాంతి కల్యాణం వైభోపేతంగా నిర్వహించారు. వేలాది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలతో మహావిష్ణు సమేత నాగలక్ష్మీదేవికి గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోగంటి బాబు పాల్గొన్నారు.

డాన్‌బాస్కో స్కూల్ ప్రిన్సిపాల్‌పై
ఉపాధ్యాయిని యాసిడ్ దాడి

● స్వల్ప గాయాలు..ఆస్పత్రికి తరలింపు

ఇబ్రహీంపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం నుంచి తొలగించారనే అక్కసుతో ప్రిన్సిపాల్‌పై ఓ ఉపాధ్యాయిని పథకం ప్రకారం యాసిడ్ దాడి చేసింది. ఈ ఘటన గుంటుపల్లి డాన్ బాస్కో స్కూల్లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రియదర్శిని అనే ఉపాధ్యాయిని గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్లో ఒకటో తరగతి విద్యార్థులకు బోధన చేస్తుంటుంది. బోధన సమయంలో విద్యార్థులను అకారణంగా దారుణంగా దండిస్తుందని తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గత నెలలో ఆమెను ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్ విధుల నుంచి తప్పించాడు. దీంతో కోపం పెంచుకున్న ఆమె సోమవారం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో గొడవ పడింది. తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను ప్రిన్సిపాల్ ముఖంపై పోసింది. దీంతో ఆయన స్వల్పంగా గాయపడ్డాడు. ప్రిన్సిపాల్‌ను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ప్రియదర్శినిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యాసిడ్‌లో పవర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.


యాసిడ్ దాడిలో గాయపడిన ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్

మహిమాన్విత క్షేత్రం కొండపర్వ గట్టు!




కొండపైన మల్లేశ్వరస్వామి ఆలయం


కొండపైకి వెళ్లేందుకు అభివృద్ధి చేసిన రహదారి

ఆహ్లాదకర వాతావరణంలో ఆధ్యాత్మిక శోభతో అలరారుతుతున్న సుందర ప్రాంతం

- కొండపై స్వయంభువుగా వెలసిన మల్లయ్యస్వామి
- భక్తుల కొంగుబంగారం..కోర్కెలు తీర్చే స్వామిగా ప్రతీతి
- శివరాత్రికి అర లక్షకు పైగా భక్తుల రాక
- మౌలిక సదుపాయాలు కల్పించి, కాటేజీలు ఏర్పాటు చేస్తే క్షేత్రానికి మరింత ఆదరణ
- ఎన్టీఆర్ జిల్లాలో పర్యాటకాభివృద్ధికి దోహదపడే క్షేత్రం

ఎన్టీఆర్ జిల్లాలోని కొండపర్వ గట్టు పైన శైవక్షేత్రంలో శ్రీ భ్రమరాంభికా మల్లేశ్వరస్వామి(మల్లయ్యస్వామి) కొలువై ఉన్నారు. కొండపై కొలువై భక్తుల కొంగుబంగారంగా స్వామి విలసిల్లుతున్నాడని, స్వామిని మొక్కుకుంటే తీరని కోర్కెలు తీరతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. పచ్చటి ప్రకృతి అందాలతో ఆహ్లాదకర వాతావరణం పంచే కొండపర్వ గట్టును ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేయడానికి అనేక అవకాశాలున్నాయి. జిల్లా ఆర్థికాభివృద్ధిలో 64 శాతం పర్యాటకం, సేవారంగాల ద్వారా ఆదాయం వస్తున్న నేపథ్యంలో, స్వర్ణాంధ్ర- 2047 కల సాకారం చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం, ఏపీటీడీసీ అధికారులు ఆధ్యాత్మిక, పర్యాటకాభివృద్ధికి అవకాశమున్న ఇటువంటి ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- (ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట)

ఇదీ ఆలయ నేపథ్యం

70 ఏళ్ల క్రితం నూజివీడు, విస్సన్నపేటకు మధ్యలో ఉన్న కొండపర్వలో కొండగట్టుపై శ్రీ భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి (మల్లయ్యస్వామి) స్వయంభువుగా వెలసినట్టు ప్రతీతి. కొండగట్టు సమీపంలోని చిత్తపూర్‌కు చెందిన కొందరు మేకల కాపరులు మేకలను మేపుతుండగా మల్లయ్యస్వామి దర్శనమిచ్చారని అప్పటి నుంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఏడాది పాటు చిత్తపూర్ గ్రామస్థులు తిరునాళ్ల నిర్వహించారు. రెండో ఏడాది నుంచి కొండపర్వకు చెందిన గొట్టిపూళ్ల ఉమామహేశ్వర వెంకటరామారావు(పెద్దబాబు), గొట్టిపూళ్ల దుర్గా మల్లేశ్వరవరప్రసాద్(చిన్నబాబు) ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి స్వామి కల్యాణం నిర్వహించారు. వారి తర్వాత వారి వారసులు దివంగత మాజీ సర్పంచ్ గొట్టిపూళ్ల రామకృష్ణ రంగారావు ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో అంగరంగ వైభవంగా తిరునాళ్ళు, బుర్రకథలు, హరికథలు, డ్రామాలు నిర్వహించేవారు. గొట్టిపూళ్ల బుచ్చి వెంకట్రామ లక్ష్మీనరసింహారావు(బుచ్చిబాబు) ఆలయ ట్రస్టీగా ఉన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాలరావు తన సొంత నిధులు రూ.50 వేలతో భక్తుల సౌకర్యార్థం రహదారిని ఏర్పాటు చేశారు. 2006లో కొండపర్వ అల్లుడు గోవర్ధనగిరి వెంటక బుచ్చిబాబు తన సొంత నిధులతో గట్టుపై ఆలయాన్ని పునర్నిర్మించారు. 2017లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో పోలీసులు లాఠీచార్జీ చేశారు. అప్పటి నుంచి ప్రతి శివరాత్రికి స్వామి కల్యాణం మాత్రమే నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం లేదు. ఇటీవల జరిగిన శివరాత్రికి అర లక్షకు పైగా భక్తులు స్వామి దర్శనానికి వచ్చారని గణాంకాలు చెబుతున్నాయి.

ఆహ్లాదం..ఆధ్యాత్మికతల మేళవింపు

కొండ చుట్టుపక్కల మామిడి తోటలు, పొలాలతో ఆహ్లాదకర వాతావరణం, కొండపైన ఆధ్యాత్మిక శోభ మేళవింపుతో కొండపర్వ మల్లయ్యస్వామి మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆలయానికి వచ్చిన భక్తులకు మానసిక ప్రశాంత కలుగుతుంది. గట్టుపై నుంచి చూస్తే విహంగ వీక్షణ చేసినట్లు ఉంటుంది. చుట్టుపక్కల పల్లెలు ఉండటంతో గ్రామాల్లో తిరునాళ్ల మూడు రోజులు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ఆలయం వెలసిన కొత్తలో ఒక స్వామి ఉండే వారని నిత్యం స్వామికి పూజలు చేసేవాడని ఆయన ఉన్నట్టుండి మాయమైపోయాడని భక్తులు చెబుతుంటారు. వృద్ధులు కూడా కొండెక్కి మొక్కులు చెల్లించుకుంటుంటారు.


గట్టు కింద స్వామి ఆలయం

పూర్వ వైభవం తెస్తాం



స్వామికి సేవ చేయడం నా పూర్వ జన్మ సుకృతం. స్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆలయానికి పూర్వ వైభవం తెస్తాం.

- మట్టా వేణుగోపాల్, ఉత్సవ కమిటీ చైర్మన్


2021లో వైసీపీ దౌర్జన్యాలకు నిరసనగా మునిసిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన నల్లగట్ల స్వామిదాసు(ఫైల్)


చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా సోమవారం వైసీపీ కౌన్సిలర్లకు మద్దతుగా ఆందోళన చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి

నాటి వైసీపీ తప్పులు..నేడు ఒప్పులయ్యాయా?

- 2021 మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైసీపీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందంటూ నలగట్ల స్వామిదాసు నిరసన
- నేడు వైసీపీ కౌన్సిలర్లకు మద్దతుగా ఆయన భార్య, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుధారాణి ఆందోళన

తిరువూరు, మే 19(ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ తప్పులు పార్టీ మారగానే ఒప్పులయ్యాయా అంటూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఆయన భార్య జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి తీరును పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా సోమవారం వైసీపీ కౌన్సిలర్లతో పాటుగా కార్యాలయంలోకి వచ్చేందుకు యత్నించిన బయట వ్యక్తులను పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌కు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, అప్పటి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థుల్ని బెదిరించి, నామినేషన్లు విత్‌డ్రా చేయించి కౌన్సిలర్‌గా ఎన్నికైనవారు, కొందరు వైసీపీ నాయకులు ఆరోపించారు. వారంతా రోడ్డుపక్కన బైఠాయించారు. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల్ని నామినేషన్లు వేయనీయకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారంటూ, నామినేషన్లు విత్‌డ్రా చేయించారంటూ వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, అక్రమ మార్గంలో మున్సిపల్ బోర్డును దక్కించుకునేందుకు కుట్రపూరితంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ నాడు టీడీపీ నేత నలగట్ల స్వామిదాసు మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించారు. నాడు వైసీపీ అక్రమాలకు పాల్పడుతోందని ఆందోళన చేసిన స్వామిదాసు..వైసీపీలో చేరగానే ఆ పార్టీ తప్పులు ఒప్పులుగా మారాయా? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది ఎవరు అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చెట్టు కింద ఇబ్రహీంపట్నం తహసీల్దార్ విధులు

● కార్యాలయంలోకి భారీగా చేరిన వర్షపునీరు


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు


చెట్టు కిందే రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని పలు పల్లపు ప్రాంతాలు ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి జలమయమయ్యాయి. రోడ్లు ఏర్లను తలపించాయి. డ్రెయినేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ఇబ్రహీంపట్నంలోని తహసీల్దార్ కార్యాలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. సోమవారం విధులు నిర్వర్తించే వీలు లేకపోవడంతో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు చెట్టు కిందే విధులు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీగా వర్షపు నీరు చేరింది. ఉద్యోగులు లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఎంఈవో కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. ఈకార్యాలయాలన్నీ పల్లపు ప్రాంతంలో ఉండటంతో జలమయయ్యాయి. జి.కొండూరు మండలం కోడూరులో శిథిలావస్థలో ఉన్న మూతపడిన గ్రంథాలయం శ్లాబు వర్షానికి బాగా నాని పడిపోయింది.

ప్రాణం తీసిన ఈత సరదా

గెడ్డలో మునిగి నూజివీడుకు చెందిన ఇద్దరు యువకుల మృతి

పార్వతీపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పులిగుమ్మి గ్రామంలో సోమవారం సాయంత్రం దారుణం జరిగింది. వివాహ శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు గెడ్డలోకి స్నానానికి దిగి ఈతరాక మునిగిపోయారు. వీరిది నూజివీడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పులిగుమ్మి గ్రామానికి చెందిన మడక గుంపుస్వామి కుమారుడు శేఖరానికి నూజివీడుకు చెందిన అమ్మాయితో బుధవారం వివాహం జరుగనుంది. పెళ్లి కుమార్తె తమ్ముడు, అతన్ని స్నేహితులు నలుగురు పెళ్లి ఏర్పాట్లు చేసేందుకు సోమవారమే గ్రామానికి వచ్చారు. వారంతా సాయంత్రం పులిగుమ్మి సమీపంలో ఉన్న గెడ్డలోకి స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా కొద్దిసేపటికి బొత్స ఈశ్వర్‌కుమార్(16), నగిరెడ్డి రాము (16)లు ఉన్నట్టుండి మునిగిపోయారు. ఊబిలోకి దిగబడిపోయారు. ఇది చూసిన మిగతా వారు వెంటనే చుట్టుపక్కల గ్రామస్థులను పిలిచారు. వారొచ్చి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వందే భారత్ డిపో రెడీ!

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ - విశాఖపట్నం వయా విజయవాడ, విజయవాడ - చెన్నై, తిరుపతి - విజయవాడ (అవుటర్) మధ్యన మొత్తం మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో పెద్ద ఎత్తున వందేభారత్ రైళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. రానున్న రోజుల్లో మరికొన్ని రూట్లలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు విజయవాడమీదుగా రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

అన్ని వసతులు ఏర్పాటు

దేశంలోనే రెండో అతి పెద్ద రైల్వే జంక్షన్ విజయవాడ కావటంతో ఇక్కడ వందేభారత్ రైళ్లకు మెయింటెనెన్స్ స్టేషన్ అవసరమన్న ఉద్దేశ్యంతో రైల్వేబోర్డు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయవాడలో మిల్క్ ఫ్యాక్టరీ ఎగువన ఫ్లై ఓవర్‌కు సమీపంలో రైల్వే యార్డుకు దగ్గరగా దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే వందేభారత్ రైళ్లకు సరిపడా అతి పెద్ద డిపోను ఏర్పాటు చేశారు. ఈ డిపోలో మెట్రో రైల్ రావటానికి వీలుగా ట్రాక్‌లను సిద్ధం చేశారు. ఈ ట్రాక్స్ వెంబడే మెకానిక్‌లు నడుచుకుంటూ అటు, ఇటు వెళ్లటానికి వీలుగా కాంక్రీట్ స్లాబ్స్ ఏర్పాటు చేశారు. విజయవాడ - చెన్నై మధ్యన నడిచే వందేభారత్ రైలుకు ప్రస్తుతం విజయవాడలోనే మెయింట్‌నెన్స్ చేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ - చెన్నై వందేభారత్ రైలుకు కోచింగ్ డిపోలో మెయింట్‌నెన్స్ పనులు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రాగానే.. ఇక్కడి నుంచే వందేభారత్ రైళ్లకు ప్రత్యేకంగా మెయింట్‌నెన్స్ చేస్తారు. మెయింట్‌నెన్స్‌చార్ట్ ప్రకారం రైలును ప్రయాణ అవసరాలకు తగ్గట్టుగా ఇక్కడ సిద్ధం చేస్తారు. ఎలాంటి రిపేర్లు ఉన్నా కూడా ఇక్కడే నిర్వహిస్తారు. వందేభారత్ మెయింట్‌నెన్స్ కోసం పక్కనే ఒక పరిపాలనా భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ వందేభారత్ విభాగానికి సంబంధించిన విభాగాధిపతులు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. నిరంతర నీటిసరఫరాకు వీలుగా ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు.

బెంగళూరుకు వందేభారత్?

● రైల్వే అధికారుల ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మీదుగా మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అవకాశం రానుంది. బెంగళూరు మార్గంలో ఈ ఎక్స్‌ప్రెస్ నడపటానికి విజయవాడ డివిజనల్ అధికారులు ప్రతిపాదన పెట్టినట్టు సమాచారం. దీంతో నాల్గో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడ నుంచి అత్యంత ప్రధానమైన రూట్లలో బెంగళూరు ఒకటి. ఈ మార్గంలో సూపర్‌ఫాస్ట్ రైళ్లు చాలా నడుస్తున్నాయి. మరిన్ని రైళ్లకు డిమాండ్ ఉంది. ఈ మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ప్రస్తుతం విజయవాడ మీదుగా సికింద్రాబాద్-విశాఖపట్నం, విజయవాడ-చెన్నై, సికింద్రాబాద్-తిరుపతి మధ్య మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి.

కడగండ్లు తీరేనా..?

(5వ పేజీ తరువాయి)

ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వర్షాలు కురుస్తుండటం ఇబ్బందికరంగా మారింది. ఎర్త్‌వర్క్ పూర్తయిన ప్రదేశంలో కాంక్రీట్ వేయాల్సి ఉండగా, అక్కడ వర్షపు నీరు భారీగా నిలిచింది. ప్రస్తుతం ఆ నీటిని ట్రాక్టర్ ఇంజన్లతో బయటకు పంపే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ముందే మేల్కొని ఉంటే..

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు నెల ముందే మొదలుపెట్టి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ వర్షాలు పడుతున్న ఈ సమయంలో అనుకోకుండా వరద వస్తే పరిస్థితి ఏమిటనే భయాందోళనలు కూడా కలుగుతున్నాయి.

పొంచి ఉన్న ముప్పు

గత సెప్టెంబరులో వచ్చిన బుడమేరు వరదలకు పులివాగుకు, వెల్లటూరు చెరువుకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఇప్పటి వరకు వాటికి మరమ్మతులు చేయించలేదు. వాటిని పూడ్చకుంటే అకాల వర్షాలకు ఎగువ నుంచి వచ్చే అనేక వాగుల వరద మొత్తం ఆ గండ్ల నుంచి నేరుగా బీడీసీలోకి చేరుతుంది. ఇప్పటికైనా ఆ గండ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టకుంటే రిటైనింగ్ వాల్ పనులు సవ్యంగా సాగే పరిస్థితి ఉండదు.

తప్పతాగి తన్నులాట

(5వ పేజీ తరువాయి)

స్నేహితులు ఆదివారం సాయంత్రం భారతీనగర్‌లో ఉన్న నెట్ క్రికెట్‌కు వెళ్లారు. అక్కడ ఆడుకున్న తర్వాత వారితోపాటు ఉన్న అజయ్ అనే స్నేహితుడి పుట్టినరోజు వేడుకను బార్‌లో జరుపుకొన్నారు. మొత్తం అంతా కలిసి మైకం తెలియకుండా తాగారు. తర్వాత కారులో రహదారులపై వీరంగం చేశారు. భారతీనగర్‌లో డెలివరీ ఇచ్చి వెళ్లిపోతున్న బ్లింకిట్ ఉద్యోగి కె.రాజశేఖర్‌రెడ్డిని పిలిచి గొడవ పడ్డారు. ద్విచక్ర వాహనం తాళాలు ఇవ్వాలని అసభ్యకరంగా దూషించారు. ఇది చూసిన అదే సంస్థలోని ఏజెంట్ నాగిపోగు రమేశ్ అక్కడికి వెళ్లాడు. అతడినీ బూతులు తిట్టారు. గొడవ జరుగుతుండటం బ్లింకిట్ సంస్థ అధికారులకు తెలియజేయడానికి రాజశేఖర్‌రెడ్డి వెళ్లాడు. కార్యాలయం నుంచి ఉద్యోగులు వచ్చే సరికి రమేశ్ తలను నేలకేసి కొట్టారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. రక్తపు మడుగులో ఉన్న రమేశ్‌ను తోటి ఉద్యోగులు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అతడు ప్రస్తుతం అపస్మారకస్థితిలో ఉన్నాడు. ఇక్కడి నుంచి కారులో వెళ్లిపోయిన ముగ్గురూ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఆటో డ్రైవర్‌ను ఆపి దాడి చేశారు. ఈ ఘటనలపై పటమట, మాచవరం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ ముగ్గురు నిందితులను పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇదేం మాయ గోవిందా?

(5వ పేజీ తరువాయి)

నుంచి సంక్రమించిన సర్వే నెంబర్ 91/2లోని ఏ5.92 సెంట్ల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. ఇది దేవదాయ చట్టం 1966 సెక్షన్ 38 ప్రకారం రిజిస్టరైంది. ట్రస్ట్ ఆధీనంలో ఉండగానే ఈ భూమిని లీజుకిచ్చారు. ఈ భూమిలో ఏ3.92 సెంట్ల స్థలాన్ని వన్‌టౌన్‌కు చెందిన ఆంధ్రా ఆయిల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, సురేంద్ర కాటన్ ఆయిల్ మిల్స్ వారికి ఏడాదికి రూ.3,800 ప్రాతిపదికన లీజుకిచ్చారు. లీజుదారుడు ఆ భూమిని ప్లాట్లుగా సబ్‌లీజుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. లీజుదారుడి మరణాంతరం అతని కుమారుడు ఈ స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతో నకిలీ పత్రాలు తయారు చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగా ట్రస్టుకు సంబంధించిన భూమిని సీలింగ్ భూమిగా పరిగణించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నగరానికి చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యే తన మొదటి సిఫారసు పత్రంపై ఎన్‌వోసీ ఇవ్వమని సంబంధిత శాఖ అధికారులకు లేఖ రాసినట్లు తెలిసింది. ఆ తర్వాత సర్వే నెంబరును తారుమారు చేసి లీజుదారుడి కుమారుడు ఈ భూమిని ఓ బ్యాంక్‌లో తనఖా పెట్టి పెద్ద మొత్తంలో రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాయిదాలు చెల్లించకపోవటంతో 2018 నాటికి అసలు, వడ్డీ కలిపి సుమారు రూ.100 కోట్లకు బకాయి పేరుకుపోవటంతో బ్యాంకు అధికారులు రుణం తీసుకున్న వ్యక్తికి కోర్టు ద్వారా నోటీసులు పంపి ఓ పేపర్‌లో సదరు యజమానిని డిఫాల్టర్‌గా పేర్కొంటూ ప్రకటన ఇచ్చినట్లు తెలిసింది. తాజాగా గోవిందరాజులు ఈనాం ట్రస్టుకు చెందిన వారసుడొకరు ఈ భూములు, ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెచ్చారు. తమ పూర్వీకులు ఆస్తులు రాయలేదంటూ, అవి తమకే చెందుతాయంటూ ఆయన కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

ఇంటిదొంగల పనేనా?

రికార్డుల మాయం వ్యవహారం ఇంటిదొంగల పనేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్టుకు మేనేజర్‌ను కానీ, కార్యనిర్వాహణాధికారిని కానీ ఇంతవరకు నియమించకపోవటం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. సుమారు రూ.250 కోట్ల విలువైన భూముల రికార్డుల మాయంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలొస్తున్నాయి.

నేటికి వాయిదా

(5వ పేజీ తరువాయి)

వద్ద అరుపులు, తోపులాటతో అంతా గందరగోళం ఏర్పడింది. ఇటీవల తమ పార్టీలో చేరిన కొందరు సభ్యుల్ని వైసీపీ నాయకులు అక్రమంగా నిర్బంధించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. కాగా, సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల్లోపు చైర్‌పర్సన్ ఎన్నిక జరగాల్సి ఉండగా, సమావేశ మందిరంలోకి కేవలం ఏడుగురు సభ్యులే హాజరుకావడంతో ఎన్నిక సమయం పూర్తై, మంగళవారానికి వాయిదా వేశారు. వాయిదా ప్రకటన రాగానే, వైసీపీ కౌన్సిలర్లు ప్రత్యేక వాహనంలో వెళ్లిపోయారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

బాధితులకు ఆర్థికసాయం

పటమట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆర్థిక సాయాన్ని అందించి కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్నారని టీడీపీ యువ నాయకుడు గద్దె హేమాన్ష్ తెలిపారు. సోమవారం తూర్పు పరిధిలో ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రూ.30 వేల ఆర్థిక సాయాన్ని యువ నేత సోమవారం వారి ఇళ్లకు వెళ్లి అందించారు. నర్రా కిషోర్, గరికపాటి బద్రి, పడాల గంగాధర్, వేముల దుర్గారావు, గురునాథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు

● కమిషనర్ ధ్యానచంద్ర

బెంజిసర్కిల్/లబ్బీపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తూర్పు పర్యటనలో భాగంగా బెంజిసర్కిల్, డీవీ మనార్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్, రమేష్ హాస్పిటల్ రోడ్డు, నిర్మలా కాన్వెంట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన డ్రెయినేజీ వ్యవస్థ మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఒక ప్రాంతంలోని సైడ్ కాల్వలో పూడిక తీసినప్పుడు సంబంధిత కల్వర్టు కింద ఉన్న వ్యర్థాలను కూడా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ ఇంజనీర్ ప్రతిరోజు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ప్రజలు ఎదుర్కొనే సమస్యలను సేకరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎస్ఈలు , జేడీలు అమృత, లత పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కార్పొరేషన్: నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో 17 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, ఎస్ఈ పి. సత్యకుమారి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడు కాలనీలోని ఓపెన్ డ్రెయినేజీలో పేరుకున్న చెత్త



బెంజిసర్కిల్ నుంచి వారధి వెళ్లే సర్వీస్‌రోడ్డు పక్కన శిథిలమైన ఓపెన్ డ్రెయినేజీ



పూడిక తీయక పటమటలంక మెయిన్ రోడ్డులో, డీమార్టు ఎదురుగా శిథిలమైన ఓపెన్ డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

అస్తవ్యస్తం...ఓపెన్ డ్రెయినేజీ వ్యవస్థ

● 9వ డివిజన్‌లో ప్రమాదభరితంగా మారిన డ్రెయినేజీలు
● పలు డ్రెయినేజీలు శిథిలం ● సిల్ట్ తీయకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే
● దుర్వాసన, ఈగలు, దోమలు వృద్ధి ● అనారోగ్యాలకు ఆసరా

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి: నగరంలోని 9వ డివిజన్‌లో ఓపెన్ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరగా మరికొన్ని డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోతోంది. దీంతో ఓపెన్ డ్రెయినేజీ నుంచి దుర్వాసం వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలో నిలిచిపోయిన మురుగునీటిపై ఈగలు, దోమలు వృద్ధిచెంది అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. ఈ పరిస్థితి 9వ డివిజన్ మొత్తం కనిపిస్తోంది.

బందరురోడ్డు పక్కన డ్రెయినేజీలేవీ?

బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ కూడలి వైపు వెళ్లే రహదారిలో బస్‌స్టాప్ వద్ద అసలు డ్రెయినేజీనే లేదు. దీంతో వర్షం పడితే ఈనీరు అంతా బందరురోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పటమటలంక మెయిన్ రోడ్డులోని మేజర్ ఓపెన్ డ్రెయినేజీలో పూడిక తీయకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి దుర్వాసన కొడుతోంది.

పటమటలంకలోని డీమార్టుకు ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన డ్రెయినేజీ శిథిలమవడం, పూడిక తీయకపోవడంతో ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోయి ఈగలకు, దోమలకు నిలయంగా మారాయి. బెంజిసర్కిల్ నుంచి వారధిపైపు వెళ్లే సర్వీస్‌రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ శిథిలావస్థకు చేరి పూడిపోయింది. నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఉన్న డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు ముందుకు వెళ్లక దుర్వాసన వెదజల్లుతోంది. డివిజన్‌లోని ఓపెన్ డ్రెయినేజీ అంతా ప్రమాదభరింతగానే ఉంది. వీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 9వ డివిజన్‌లో ఓపెన్ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. లేనిపక్షంలో రానున్న వర్షాకాలంలో వర్షాలకు మురుగునీరంతా పొంగి రోడ్లు, ఇళ్లల్లోకి వచ్చే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేద కాపు మహిళలకు పెళ్లికానుక ప్రవేశపెట్టాలి



ఎంపిక పత్రాలతో నూతన కమిటీ

గుణదల, మే 19 (ఆంధ్రజ్యోతి): పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని 26వ డివిజన్లో ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు సోమవారం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్ల వారిని సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం కాపులకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉందని, ఈ తరుణంలో సంక్షేమంపై ఏ తరహా పథకాలు ప్రవేశపెడితే బాగుంటుందనే దానిపై అధికారులకు తెలియజేయనున్నామని ఆయన తెలిపారు.



పటమట ఈ సేవా కేంద్రం వద్ద, కృష్ణలంకలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పటమట, మే 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని నేటితరం యువత, కార్మికులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి టి.కృష్ణ పిలుపునిచ్చారు. పటమట ఈ-సేవా కేంద్రం వద్ద సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు వి.బి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి సుందరయ్య నాయకత్వం వహించారన్నారు. ఈనెల 20న జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బెనర్జీ, రవీంద్ర, గురుమూర్తి, ఏడుకొండలు, వై.ఎల్లారావు, నాంచారయ్య, మస్తాన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంకలో పలు ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ సుందరయ్య చిన్ననాటి నుంచే కుల వివక్షను రూపుమాపేందుకు కృషిచేశారని, పేరు చివరన కులాన్ని తొలగించుకొని సుందరయ్య అందరివాడుగా మారారన్నారు. సీపీఎం నాయకులు కోరాడ రమణ, టి.చంద్రశేఖర్, డి.వరప్రసాద్, వై.కృష్ణ, తాడి రమణ, టి.రమా, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాణిగారితోట: రాణిగారితోటలోని సీపీఎం కార్యాలయంతో పాటు పలు చోట్ల పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వాన్ని నిలదీసిన వ్యక్తి సుందరయ్య అని, సుందరయ్య స్ఫూర్తితో మనం ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ కార్యదర్శి టి .కృష్ణ, నాయకులు హరినారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

విజయవాడ స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): సిలంబమ్ (కర్రసాము) క్రీడాకారులు విజయవాడలోని శాప్ కార్యాలయంలో సోమవారం శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిలంబమ్ క్రీడాకారులు మాట్లాడుతూ ఏలూరు జిల్లా కలిదిండిలో ఏప్రిల్ 30న జరిగిన స్టేట్ లెవల్ సిలంబమ్ చాంపియన్‌షిప్ 2025లో సాధించిన విజయాలు, పతకాల గురించి శాప్ చైర్మన్‌కు వివరించారు. ఈ పోటీలలో 73 గోల్డ్, 16 సిల్వర్, 5 బ్రాంజి మెడల్స్ సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని శాప్ చైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, క్రీడా సదుపాయాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిలంబమ్ కోచ్‌లు శ్రీకాంత్, వర్మ, సిలంబమ్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



సిలంబమ్ క్రీడాకారులతో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు

విజయవాడ రైల్వే డివిజన్‌లో

ఇద్దరు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డు



సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నుంచి అవార్డులు అందుకుంటున్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, విజయవాడ డివిజన్‌లో ఇద్దరు ఉద్యోగులకు విధిలో అప్రమత్తతను చూపించినందుకు ఉద్యోగి ఆఫ్ ది మంత్ భద్రతా అవార్డులను అందజేశారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో సోమవారం జరిగిన వర్చువల్ సేఫ్టీ సమావేశానికి విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్స్ (డీఆర్ఎంఎస్) నుంచి ప్రధాన విభాగాలతో పాటు మిగతా నాలుగు డివిజన్‌ల నుంచి హాజరయ్యారు. ట్రాక్ భద్రత, ఇతరత్రా రక్షణ చర్యలను అరుణకుమార్ జైన్ సమీక్షించారు. అనంతరం ఆయన అవార్డులను అందజేశారు. విజయవాడ విభాగానికి చెందిన డార్లా బంగారి, జే. దుర్గాప్రసాద్‌కు ఏప్రిల్-2025 'నెల ఉద్యోగులు' భద్రతా అవార్డులను పొందారు.

లయోలలో ముగిసిన ఎన్‌సీసీ క్యాంప్

భారతీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో ఎన్‌సీసీ 8ఆంధ్రా నావెల్ యూనిట్ విజయవాడ, క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ వైపీపీ ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ, ఆర్‌టీసీ క్యాంపు సోమవారంతో ముగిసింది. ఈ సంద ర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కెప్టెన్ వైపీపీ ప్రదీప్ మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో సర్వీస్ సబ్జెక్టు, కామన్ ట్రైనింగ్ సబ్జెక్టులతో పాటు డ్రిల్, ఫైర్ ఫైటింగ్, హెల్త్, హైజీన్, విపత్తుల నిర్వహణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్షిప్, ఫైరింగ్, స్విమ్మింగ్ తరగతులు నిర్వహించామన్నారు. దేశం కోసం సేవలందించేందుకు క్యాడెట్లకు ఈ క్యాంప్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. స్విమ్మింగ్, ఫైరింగ్‌లో బెస్ట్ క్యాడెట్ ఎంపిక చేశామన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల లెఫ్టినెంట్ వెంకటేష్, స్టెల్లా కళాశాల సబ్ లెఫ్టినెంట్ స్వప్న, ఏపీఎస్ఆర్‌యం స్కూల్ థర్డ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న మురుగునీరు



అన్నమ్మ తల్లి గుడి సెంటర్‌లో

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి : కృష్ణలంక 22వ డివిజన్‌లోని పలు వీధుల్లో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్డుమీదకు పొంగిపొర్లుతోంది. పాత పోస్టాఫీసురోడ్డులో కార్పొరేటర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రోడ్డుపై వున్న మ్యాన్‌హోల్ నుంచి కొద్దిరోజులుగా మురుగునీరు పొంగిపొర్లుతున్నా పట్టించుకొనే నాథుడే లేడు. భ్రమరాంబపురం అన్నమ్మ తల్లి గుడి సెంటర్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు రోడ్లపైకి చేరడం వల్ల దుర్వాసనతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ డ్రెయినేజీ సిబ్బంది మురుగునీరు రోడ్లపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మన చేతుల్లోనే అగ్ని భద్రత

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర ● వీఎంసీ కార్యాలయంలో మాక్‌డ్రిల్

కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని భద్రత మన చేతుల్లోనే ఉందని, ప్రమాదాలు అనుకోకుండా వస్తాయని, చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించుకోవచ్చునని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్రలు తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు, అత్యవసర స్పందన, పలు అంశాలను అగ్నిమాపక అధికారులు స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అగ్ని భద్రత, ప్రమాదం నివారణ చర్యలు ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగితే సమయస్ఫూర్తితో వ్యవహరించా లన్నారు. ముఖ్యంగా ప్రమాదం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకునే అవగాహన రికార్డు కీపర్, సిబ్బందికి ఉండాలన్నారు. ఈ సందర్భంలో వారి చేత మాక్ డ్రిల్ చేయించి మంటలు ఎలా ఆర్పే విధానం తదితరాలు వారి చేత చేయించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కమిషనర్ చాంబర్ వద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవాలో చేసి చూపించారు. ఈ మాక్ డ్రిల్‌లో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు , అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, సీఈ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, ఎస్ఈ ప్రాజెక్ట్ పి. సత్యకుమారి, వీఎంసీ రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎన్. వెంకటేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ డి.మాల్యాద్రి, శంకర్ రావు, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ ఎం. రాజా, నరేష్, గౌతమ్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మంటలను అదుపు చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పైపులైన్లకు లీకులు...తాగునీరు వృథా



మాచవరం డౌన్‌లో వాణి విద్యాలయం పక్క వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి: గుణదల రెండు, మూడు డివిజన్లలో మంచి నీటి పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. గుణదల మైత్రినగర్‌లో కొండపైన మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డు, దంత వైద్య కళాశాల, లూర్దునగర్ పరిసర ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. ఆయా ప్రాంతాల్లో పలు చోట్ల తాగునీటి పైపులైన్ ధ్వంసం అయ్యాయి. లీకులు ఏర్పడ్డాయి. తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు, సిబ్బంది ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



గుణదల సాయి మెస్ సమీపంలో..

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

- హైవే అధికారుల నిర్లక్ష్యం
- ముందే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి
- అయినా స్పందించని హైవే అధికారులు



మృతుడు సాంబయ్య

ఇబ్రహీంపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యం ఓ ఆటో డ్రైవర్ ప్రాణాలను బలి తీసుకుంది. ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిలో హైవే అధికారులు ఏర్పాటు చేసిన డ్రెయినేజీ వ్యవ స్థ అస్తవ్యస్తంగా మారడంతో కొండపల్లి శాంతినగర్ డౌన్‌లో జాతీయ ర హదారిపై వర్షపు నీరు భారీగా నిలుస్తుంది. ఈవిషయాన్ని ఈనెల 17న పల్లపు ప్రాంతాలు జలమయమని హైవే అధికారులు తీరుతో జాతీయ రహదారిపై నీరు నిలుస్తున్నాయని హెచ్చరించినా స్పందించలేదు. ఈక్రమంలో ఈనెల 18న కురిసిన వర్షానికి మరోమారు జాతీయ రహదారిపై శాంతినగర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచింది. కొండపల్లిలో ఎస్టీ కాలనీలో ఉండే టీడీపీ ఎస్టీ సెల్ కార్యకర్త కంపా సాంబయ్య (59) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం జి.కొండూరు వైపు ఆటోలో వె ళుతూ శాంతినగర్ వద్ద పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తప్పించే క్రమంలో వెనుక నుం చి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి సాంబయ్య తీవ్రంగా గాయపడి అపస్మార స్థితికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు ముందే స్పందించి ఉంటే..

జాతీయ రహదారిపై కిలోమీటర్ దూరం వరకు చెరువును తలపించేలా నిలుస్తున్న వర్షపు నీటిని బయటకు పంపితే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరిగేవి కావని పలువురు అభిప్రాయం పడుతున్నారు. ఇప్పటికైనా మరో ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

పలువురు సంతాపం

కంపా సాంబయ్య ఆకాల మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ మండలాధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు చుట్టుకుదురు శ్రీనివాసరావులు అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 95.71 శాతం మంది హాజరు

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో సోమవారం జరిగిన ఏపీ ఈఏపీసెట్‌కు 95.71 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం సమయంలో రెండువిడతలుగా జరిగిన పరీక్షకు 583 మంది హాజరుకావాల్సి ఉండగా, 558 మంది హాజరయ్యారు.

ద్వీపానికి ఉక్కు కవచం

- రూ. 2.65 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 200 మీటర్ల మేర వరద తాకే పశ్చిమ ప్రాంతంలో షీట్ ఫైలింగ్ పనులు
- 9 మీటర్ల నదీ లోతున షీట్ ఫైలింగ్ వేయనున్న బీఐటీసీ
- మేజ్ గార్డెన్, గేమింగ్ జోన్ పునరుద్ధరణ పనులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎంత పెద్ద వరద వచ్చినా భవానీ ద్వీపాన్ని వరద దుర్భేద్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 కోట్ల నిధులను భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కు విడుదల చేసింది. ఈ నిధులతో స్టీల్ షీట్ ఫైలింగ్ చేపడతారు. భవానీ ద్వీపానికి పశ్చిమ భాగాన వరద తాకే ప్రాంతంలో ఈ షీట్ ఫైలింగ్ చేపడతారు. మొత్తం 200 మీటర్ల వరకు మొదటి దశలో స్టీల్ షీట్ ఫైలింగ్ చేపడతారు. మొత్తం 9 మీటర్ల పొడవైన షీట్ ఫైల్స్‌ను భవానీ ద్వీపం ఒడ్డున నదీగర్భంలోకి దించుతారు. ఒక షీట్‌కు మరొక షీట్‌కు జాయింట్ ఉంటుంది. షీట్లను జాయింట్లకు అనుసంధానం చేసి వైబ్రేటర్ మెషీన్ ద్వారా భూమిలోకి దింపుతారు. ఒక్కసారి ఈ స్టీల్ షీట్ ఫైలింగ్‌ను చేసిన తర్వాత ద్వీపానికి గట్టిగా వరద తాకినపుడు కొట్టుకుపోవటం ఉండదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకసారి భవానీ ఐల్యాండ్ తూర్పు, ఉత్తర భాగాల్లో కొంతమేర షీట్ ఫైలింగ్ చేపట్టారు. దీంతో అప్పట్లో ఎంత పెద్ద వరదలు వచ్చినా షీట్ ఫైలింగ్ చేసిన ప్రాంతంలో మాత్రం ద్వీపానికి ఏమీ కాలేదు. అప్పట్లో 5 మీటర్ల లోతున ఒడ్డునే షీట్ ఫైలింగ్ చేశారు. కృష్ణానదికి ప్రధానంగా వరద వచ్చినపుడు పశ్చిమ భాగంలోనే తాకుతుంది. గతంలో పశ్చిమ ప్రాంతం చాలావరకు నిరుపయోగంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీన్ని కూడా అందుబాటులోకి తెచ్చి పాత్‌వేలు, సెల్ఫీ పాయింట్స్, ఫ్లవర్ గార్డెన్స్, గేమింగ్ జోన్, మేజ్ గార్డెన్, మిర్రర్ మేజ్, రోబోటిక్ పార్క్ వంటివి ఏర్పాటు చేశారు. ఇటీవల వచ్చిన భారీ వరదలకు ఈ ప్రాంతం వైపు చాలావరకు భవానీ ద్వీపం కొట్టుకుపోయింది. భారీగా ఇసుక కొటుకటకొచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ద్వీపం పునరుద్ధరణ పనుల విషయంలో బీఐటీసీ అధికారులు ప్రణాళికగా వెళుతున్నారు. గతంలో జరిగిన నష్టం భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ద్వీపం చుట్టూ పూర్తిస్థాయిలో స్టీల్ షీట్ ఫైలింగ్ వేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.2.65 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధుల్లో సింహభాగం స్టీల్ షీట్ ఫైలింగ్‌కు కేటాయించాలని, మిగిలిన నిధులను గేమింగ్ జోన్, మేజ్ గార్డెన్ పునరుద్ధరణకు ఖర్చు చేస్తారు. తొలి దశలో 200 మీటర్ల వెంబడి పశ్చిమ దిశలో షీట్ ఫైలింగ్ చేయాలని నిర్ణయించారు. ద్వీపం పశ్చిమ భాగం లోతు ఎక్కువగా ఉంటుంది కాబట్టి గతంలో మాదిరిగా 5 మీటర్ల లోతున కాకుండా ఈ సారి 9 మీటర్ల లోతున షీట్ ఫైలింగ్ చేయాలని నిర్ణయించారు. పూర్తిస్థాయిలో చేయాలంటే నిధుల అవసరం ఏర్పడుతుంది కాబట్టి సీఆర్‌డీఏను డబ్బులు ఇవ్వమని అడిగారు. ఎందుకో అక్కడి సానుకూల స్పందన రావటం లేదని తెలుస్తోంది. మంత్రి నారాయణతో మాట్లాడి సీఆర్‌డీఏ ద్వారా ఫండ్స్ మొబిలైజేషన్ చేయాలని బీఐటీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ సీఆర్‌డీఏ ఆసక్తి చూపకపోతే ఎన్‌జీవోల నుంచి కానీ, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం కృషి చేయాలని బీఐటీసీ అధికారులు భావిస్తున్నారు.

స్టీల్ షీట్ ఫైలింగ్‌తో వరద దుర్భేద్యంగా భవానీ ఐలాండ్



ఐలాండ్‌కు ఉత్తర భాగంలో వేసిన షీట్లు



ఐలాండ్‌కు తూర్పు భాగంలో వేసిన షీట్లు

అర్జీల పరిష్కారానికి కృషి

- విశ్వాసం పెరగటం వల్లే భారీగా అర్జీలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



జగ్గయ్యపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారమవుతున్నందున, ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం పెరగటంతోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు బాధితుల నుంచి అర్జీలు భారీగా వస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. జగ్గయ్యపేట బీ-కన్వెన్షన్‌లో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో జరిగిన నందిగామ డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జిల్లా అధికారులతో కలిసి పాల్గొని స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలాన్ని, ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రాల స్థాయిల్లో పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నామని, తిరువూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు, జగ్గయ్యపేట పీజీఆర్ఎస్‌కు మంచి స్పందన లభించిందన్నారు.

పీజీఆర్ఎస్‌కు 500 అర్జీలు

జగ్గయ్యపేటలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 461 అర్జీలు రాగా, సింహభాగం రెవెన్యూ సమస్యలే వచ్చాయి. ఇనామ్ భూములు, భూ సర్వేలో హెచ్చు తగ్గులపై, భూ వివాదాలు, 22ఏలో మినహాయింపులు, ల్యాండ్ సీలింగ్ వివాదాలపై 240కి పైగా అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. వచ్చిన అర్జీల్లో అధికంగా జగ్గయ్యపేట మండలం నుంచి 222, వత్సవాయి నుంచి 24, పెనుగంచిప్రోలు నుంచి 56, నందిగామ మండలం నుంచి 222, చందర్లపాడు నుంచి 8, వీరులపాడు నుంచి 4, కంచికచర్ల నుంచి 8 అర్జీలు వచ్చాయి. గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి బి.జ్యోతి, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, డీఆర్‌డీఏ ఏపీడీ ఏఎస్వీ నాంచార రావు, డీపీవో లావణ్యకుమారి, డీఎస్పీలు ఏబీజీ తిలక్, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. కాగా ఆఫ్‌లైన్‌లో మరో 40 అర్జీలు వచ్చినట్టు జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్ తెలిపారు.

- 20న సీఎంతో వీడియోకాన్ఫరెన్స్: ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజలనుంచి ఇచ్చే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. ఈలోగా పెండింగ్‌లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 22,770 అర్జీలు రాగా, వాటిలో 20,865 అర్జీలు పరిష్కారమయ్యాయన్నారు. ఇంకా 1,905 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. గడువుమీరిన అర్జీలు 13 ఉన్నాయని, వాటిని పరిష్కరించకపోవడానికి గల కారణాలపై ఆయా విభాగాల అధికారులను వివరణ కోరారు. కోర్టులకు సెలవులున్నప్పటికీ, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేసవి క్రీడాశిబిరాలను నిర్వహించే నిమిత్తం 45 శిక్షణా శిబిరాలకు రూ.5వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: డీఆర్‌వో

కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుడు సంతృప్తిచెందేలా స్పష్టమైన సమాచారంతో అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు ఆయా శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తెచ్చుకుని అర్జీలు పునరావృతం కాకుండా సమస్యలు పరిష్కరించి సంతృప్తి పరచడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఎండ వేడిమి లెక్కచేయక సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలను సమర్పిస్తున్న వారి ఆశలను నెరవేర్చాలని, వారి సమస్యలకు పరిష్కారం చూపడంలో జవాబుదారితనంఉండాలని డీఆర్వో లక్ష్మీనరసింహం అన్నారు.

ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు

అందుబాటులో ఉంచాలి

- పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా చంద్రబాబు చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే

గాంధీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్‌కు కాలువలు, డ్రైనేజీలు అభివృద్ధి చేయలేదని, రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడం శోచనీయమని మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఇలా జరగలేదని, పరిపాలనపై అవగాహన లేని వ్యక్తుల చేతుల్లో రాష్ట్ర పాలన సాగుతుందనే అనుమానం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక బ్యారేజ్‌గా, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా మార్చిందని మండిపడ్డారు. 150 అడుగుల ఎత్తుల నిర్మించాల్సిన ప్రాజెక్టును కేవలం 135 అడుగుల ఎత్తులో నిర్మించడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాజెక్టుకు భవిష్యత్‌లో రూ.12157 కోట్లు మాత్రమే ఇస్తామని పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం దారుణమన్నారు. 194 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం నుంచి 109 టీయంసీలకే పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి ప్రధాని మోదీతో చర్చించాలని డిమాండ్ చేశారు. రాబోయే నాలుగేళ్లలో పూర్తిచేసే ప్రాజెక్టుల పై దృష్టి సారించాలని చంద్రబాబుకు సూచించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలనే ఆలోచన విరమించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత బొగ్గు గనులను కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

బస్‌స్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డిపో గ్యారేజీలో 20న జరిగే ఒక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు విజయవాడ డిపో మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారులు ప్రశంసా పత్రాలను అందజేస్తారన్నారు.

ఆక్రమణ చెరలో అంపాపురం కోడు కాలువ

- వేలాది ఎకరాలకు సాగునీరు, గ్రామానికి తాగునీరు అందించే కాలువ
- గడ్డివాములు, పశువులపాకలు, వ్యర్థాలతో నిండిపోయిన పంట కాలువ.



ఆక్రమణలతో కుచించుకుపోయిన అంపాపురంలోని పంట కాలువ (కోడు కాలువ)

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి: వేలాది ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరందిస్తూ గ్రామానికి ఉన్న మంచినీటి చెరువు ద్వారా తాగునీరందించే పంటకాలువ (కోడు) వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకునేలా ఆక్రమణలతో నిండిపోయింది. గ్రామానికి తాగునీరు, అంపాపురం, ఎ.సీతారాంపురం, తేలప్రోలు, ఉమామహేశ్వపురం, బండారుగూడెం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల వ్యవసాయ భూముల సాగునీరందించే కోడుకాలువ ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో పాటు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీసం నీరు ప్రవహించేందుకు కూడా వీలులేక చెత్తతో నిండిపోయింది. ఏలూరు కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా అంపాపురంలోని మూడు చెరువులకు నీరందించే పంటకాలువ అధికారుల నిర్లక్ష్యంతో మురుగుకాలువగా మిగిలిపోయింది. 15 అడుగులకు పైగా వెడల్పు, ఐదడుగుల లోతుతో ఉన్న పంట కాలువ ప్రస్తుతం ఐదడుగుల వెడల్పుతో రెండడుగుల లోతుతో మురుగునీరు నిలువ ఉంటోంది. ఇదే కాలువ ద్వారా అంపాపురం గ్రామానికి త్రాగునీరందించే ఊరచెరువుకు, 5 గ్రామాలకు చెందిన 2వేల ఎకరాలకు పైగా వ్యవసాయభూములకు మద్ది చెరువు, తొండం చెరువుల ద్వారా సాగునీరందించేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వ్యక్తిగత స్వార్థాలతో ఆక్రమణలకు గురై కుంచించుకుపోవడంతో పాటు పశువుల వ్యర్థాలు, చెత్తలో నిండిపోయి మురుగుకాలువను తలపిస్తోంది. ఈ కాలువ ద్వారా వచ్చే నీటితో ఊరచెరువు నింపితే గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండువైపులా ఆక్రమణలు

పంట కాలువను రెండు వైపుల నుంచి కొందరు ఆక్రమించడంతో కుంచించుకుపోయింది. కొందరు వ్యక్తులు మెరకతోలి పశువుల పాకల నిర్మాణంతో పాటు గడ్డివాములు, పెంటపోగులు వేస్తూ ఆక్రమించారు. మరికొందరైతే ఏకంగా కాలువలోనే గోడలు నిర్మించారు. ఎన్నికల్లో ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చేంత పెద్ద సమస్యగా మారిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, అధికారులు నిర్లక్ష్యంతో ఆక్రమణలకు మరింత ఊతమిచ్చినట్టయింది.

భూమి విలువ పెరగడంతో..

జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు గ్రామానికి దగ్గరగా వెళుతుందని కొందరు వ్యక్తులు వెంచర్ల కోసం భూములు కొనడంతో భూమి విలువ అమాతం పెరిగింది. దీంతో కొందరు వ్యక్తుల స్వార్థప్రయోజనాలకు గ్రామస్థులకు తాగునీరు, వేలాది ఎకరాలకు సాగునీరందించే పెద్ద కాలువ కాస్త మురుగునీటి కాలువగా మారిపోయింది. ఏలూరు కాలువ నుంచి అంపాపురం వరకున్న ఈ పంట కాలువ ఆక్రమణలను తొలగించి సరిహద్దులు నిర్ణయించాలని అంపాపురం గ్రామ ప్రజలు, రైతులు మే 16న పంచాయతీ కార్యదర్శి ద్వారా తహసీల్దార్‌కు అర్జీ పెట్టడంతో ఈ ఆక్రమణ పర్వం వెలుగుచూసింది.

ఎమ్మెల్యే ఆదేశాలు అమలు చేస్తారా..!

ఇటీవల బాపులపాడులో నిర్వహించిన ప్రజావేదికలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చెరువులు, కాలువల ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కానీ క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టలేదని అధికారులపై మండిపడుతున్నారు. ఏలూరు కాలువ నుంచి అంపాపురం వరకూ గల (పంట కాలువ) కోడు కాలువ ఆక్రమణలను తొలగిస్తే అటు గ్రామ ప్రజలకు, ఇటు రైతులకు మేలుతో పాటు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

భవిష్యత్ ఎన్నికలకు నాంది మహానాడు

- బూత్ స్థాయి నుంచే పార్టీ పటిష్టత: మంత్రి కొల్లు రవీంద్ర



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు తదితరులు

మోపిదేవి, మే 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలు, 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రపంచం గుర్తించేలా పార్టీ విజయం సాధించేందుకు మహానాడు నాంది కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మోపిదేవిలో సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ విఎనీ మహానాడులో కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టీసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు పునాది వేసింది టీడీపీనేనని ముందుగా ఎన్టీ రామారావు అమలు చేయగా, ప్రస్తుతం సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. నియోజకవర్గం, గ్రామం, బూత్ స్థాయి కుటుంబ సాధికార సమితి కమిటీల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మినీ మహానాడు ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. మినీ మహానాడులో ఏకగ్రీవంగా 9 తీర్మానాలను ఆమోదించారు. ఉత్తరాఖండ్, పహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. కోడూరు మండలంలో 5వేల ఎకరాలు సాగుకు నోచలేదంటూ వైసీపీ చేసిన ఆరోపణలు తిప్పికొడుతూ తీర్మానించారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలపటంతో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఘంటసాల మండలాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించటం, గ్రామాల్లో అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా నిర్మాణాలు చేపట్టినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మినీ మహానాడు తీర్మానాలు ఆమోదించారు. పార్టీ మండలాధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు బొబ్బా గోవర్ధన్, సజ్జా చలపతి, తలశిల స్వర్ణలత, రావి నాగేశ్వరరావు, మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, తుమ్మల చౌదరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెడన: కూటమి ఏడాది పాలనలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం పెడన నియోజకవర్గ మినీమహానాడు జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పదవులు పొందిన వారు ఇళల్లో కూర్చోకుండా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలన్నారు. వైసీపీ నేతల తప్పులే వారి పాలిట శాపాలుగా మారడంతో జైళ్లకు వెళుతున్నారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. జగన్‌ను పెద్ద సైకోగాను, మాజీ మంత్రి జోగి రమేష్‌ను చిన్న సైకోగాను నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు అభివర్ణించారు. తొలుత ఎన్టీఆర్, కాగిత వెంకట్రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మినీమహానాడు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, సీనియర్ టీడీపీ నేత శలపాటి ప్రసాద్ సారథ్యంలో కొనకళ్ల బుల్లయ్య, శలపాటి ప్రసాద్, యక్కల శ్యామలయ్య, కూనపరెడ్డి వీరబాబు, పోతన స్వామి, వడుగు తులసీరావు, అబ్దుల్ ఖయాం, గోపీ నాగబాబు, హమీదుల్లా, బొర్రా కాశీ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను త్వరగా నిర్మించండి



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాద్

కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పేదలకు అందించే ఇళ్లను త్వరగా నిర్మించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.శివప్రసాద్ అన్నారు. ఈ మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నూతన మీటింగ్ హాలులో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్ వీఎంసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లందరూ సహకరించి త్వరగా ఇళ్ల పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్యనున్న సమన్వయ లోపాలను, సమస్యలను ముఖాముఖిగా చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహాయం అందుతుందని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. వీఎంసీ చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ వర్క్స్ పి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ విభాగం పీ వెంకట నారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం



పొగతోనే ప్రమాదం

హైదరాబాద్ చార్మినార్ చేరువలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఏకంగా 17 మంది దుర్మరణం పాలైన విషయం మనందరికీ తెలిసిందే! సాధారణంగా ఇలాంటి అగ్నిప్రమాదాల్లో కాలిన గాయాలకు మించి, అగ్నికీలల నుంచి వెలువడే పొగను పీల్చుకోవడం వల్లే మరణాలు ఎక్కువగా సంభవిస్తూ ఉంటుంది. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ఎలా నడుచుకోవాలో, విషపూరిత పొగల నుంచి ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో వైద్యులు వివరిస్తున్నారు

సాధారణంగా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు భయంతో, మంటలకు దూరంగా పరుగులు పెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ దట్టంగా పరుచుకున్న పొగల నుంచి తప్పించుకునే ప్రయత్నం కూడా చేయాలి. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెలువడే పొగలను పీల్చుకోవడం వల్ల శరీరానికి సరిపడా ఆక్సీజన్ అందని పరిస్థితి తలెత్తుతుంది. దీనికి తోడు పొగలోని కార్బన్ మోనాక్సైడ్ అనే విషపూరిత వాయువు ఊపిరితిత్తులను దెబ్బ తీస్తుంది. ఆ ప్రదేశంలోని వేడి, సెగ, మంటల వల్ల ముక్కు నుంచి గొంతు వరకూ శ్వాసకోశాల్లో వాపు ఏర్పడుతుంది. అలాగే మంటల మూలంగా ఊపిరితిత్తుల గొట్టాలకు గాయాలవుతాయి. కాబట్టి అగ్నిప్రమాదానికి గురైనప్పుడు ఆ తీవ్రత నుంచి తప్పించుకునే మార్గాలను అనుసరించాలి. అందుకోసం...

- తేలికగా ఉండే పొగలు గదిలో పైకి చేరుకుంటాయి. కాబట్టి నేల మీదకు వంగి అక్కడి నుంచి తప్పించుకోవాలి
- వస్త్రాన్ని ముక్కుకు అడ్డుపెట్టుకోవడం వల్ల కొంత మేరకు ప్రయోజనం ఉంటుంది
- శరీరం కాలకుండా తడిపిన వస్త్రాన్ని చుట్టుకోవచ్చు
- మంటల్లో కాలిన వారిని రక్షించాలనే తొందర్లో చేతులతో చుట్టేస్తే గాయాల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాళ్ల ఒంటికి వస్త్రం చుట్టి, ఆ తర్వాతే తరలించాలి
- లేదంటే కాలిన గాయాలైన వారికి వస్త్రం చుట్టి నేల మీద దొర్లిస్తూ తరలించాలి

నియంత్రణ ఇలా...

- మంట, పొగలను పసిగట్టే ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్ లాంటి ఏర్పాట్లు చేసుకోవాలి
- ఇంట్లో తేలికగా తగలబడే వీలున్న వస్తువులను పరిమితం చేసుకోవాలి
- ఇంటికి రెండు వైపులా తలుపులు ఉండేలా చూసుకోవాలి
- మంటలను ఆర్పే పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి

ప్రథమ చికిత్స

అగ్నిప్రమాద బాధితులను ఆస్పత్రికి తరలించేలోగా...

- నూరు శాతం ఆక్సిజన్‌ను అందించే 'నాన్ రీబ్రీతర్ మాస్క్'ను ఉపయోగించి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందేలా చేయాలి
- కుంచించుకుపోయిన శ్వాసనాళాలను విప్పార్చే ఇన్‌హేలర్స్ కూడా ఉపయోగించుకోవచ్చు

దీర్ఘకాలంలో...

అగ్నిప్రమాదం బారిన పడిన వారు దీర్ఘకాలంలో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సిఒపిడి)కు గురయ్యే అవకాశాలుంటాయి. అగ్నిప్రమాద సమయంలో పొగలను పీల్చుకోవడం వల్ల, ఆ ప్రభావంతో ఊపిరితిత్తుల్లోని గాలిగదులు దెబ్బతినే పరిస్థితి ఇది. అలాగే విపరీతమైన మంటలు, పొగలకు బహిర్గతమైన వారి ఊపిరితిత్తులు గట్టిపడిపోతాయి. గాలిగొట్టాలు కూడా కుంచించుకుపోయే అవకాశం ఉంటుంది. అలాగే పొగలోని కార్బన్ మోనాక్సైడ్ వాయువును ఎక్కువగా పీల్చుకోవడం వల్ల, ఆ క్రమంలో మెదడుకు సరిపడా ఆక్సీజన్ అందక, తర్వాతి కాలంలో కొన్ని మెదడు సంబంధ సమస్యలు కూడా తలెత్తుతాయి. ఇంకొందరు ఆస్తమాను పోలిన పిల్లకూతలు, ఆయాసంతో బాధపడే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి అగ్నిప్రమాదం బారిన పడినవారు ఎటువంటి చికిత్సతో పనిలేకుండా పూర్తిగా కోలుకున్నప్పటికీ, దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల అస్వస్థలకు గురికాకుండా ఉండడం కోసం, ఊపిరితిత్తుల పనితీరునూ, సామర్థ్యాన్నీ తరచూ పరీక్షించుకుంటూ ఉండాలి. ఇందుకోసం ప్రమాదం జరిగిన ఒక నెల, మూడు నెలలు, ఆరు నెలలకు ఒకసారి పల్మొనరీ ఫంక్షన్ టెస్ట్ చేయించుకోవాలి.

డాక్టర్ హరికిషన్ గోనుగుంట్ల
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



తెలుసుకుందాం

'బెడ్ రాటింగ్' గురించి విన్నారా?



గంటల తరబడి ఏ పనీ చేయకుండా, కదలకుండా విశ్రాంతిలో గడపడం లేదా ఫోన్, టివి చూస్తూ కాలక్షేపం చేయడమే 'బెడ్ రాటింగ్'. నేటి తరం ఈ ధోరణిని 'సెల్ఫ్ కేర్'గా పరిగణిస్తున్నప్పటికీ, దీంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పని ఒత్తిడి, అలసట, అనాసక్తి... ఇవన్నీ కలిసి పడక పైనుంచి కదలనివ్వవు. తీరిక దొరికన వెంటనే ఫోన్ చేతిలోకి తీసుకుని అదే పనిగా స్క్రోలింగ్ చేయడం లేదా నచ్చిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌ను గంటల తరబడి కొనసాగించడం లాంటివి చేస్తోంది జెన్ జడ్ తరం. కొందర్లో ఈ అలవాటు ఉదయం నిద్ర లేచిన వెంటనే, లేదా రాత్రి నిద్రకు ముందు కొనసాగుతూ ఉంటుంది. దీన్ని కాలక్షేపంగా, సేద తీరడంగా వాళ్లు బలంగా నమ్ముతూ ఉంటారు. కానీ ఇక్కడే ఒక తిరకాసు ఉంది. అడపాదడపా ఫోన్లు, టివిలతో సేద తీరడంలో తప్పు లేదు. కానీ తీరిక దొరికిన ప్రతిసారీ ఇదే పని చేస్తుంటే జీవగడియారం అస్తవ్యస్థమై, సెరటోనిన్ హార్మోన్ మోతాదులు తగ్గిపోయి, గాబా, డోపమైన్ న్యూరోట్రాన్స్‌మీటర్లు అదుపు తప్పుతాయనీ, ఫలితంగా ఆందోళన, ప్రేరణ లోపం, మానసిక కుంగుబాటుకు గురవుతారనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా దీర్ఘసమయాల పాటు అచేనతంగా ఉండిపోవడం వల్ల, శరీర కదలికలు లోపించి, మనసును తేలిక పరిచే, హుషారుగా ఉంచే హ్యాపీ హార్మోన్ల స్రావాలు తగ్గిపోయి, నిద్రలేమి, కుంగుబాటు, ఆందోళనలు వేధించే అవకాశం ఉంటుంది. కాబట్టి తీరిక దొరికిన కొద్దిపాటి సవయాన్ని మానసిక ప్రశాంతతను చేకూర్చే పనులకు కేటాయించడం అవసరం. కిటికీలో కూర్చుని ప్రకృతిని ఆస్వాదించడం, ఆరుబయట విహరించడం, వ్యాయామం చేయడం, పుస్తకాలు చదవడం, ఆప్తులతో సరదా సమయాలు గడపడం, స్నేహితులతో గడపడం లాంటి పనుల కోసం తీరిక సమయాలను కేటాయించడం అలవాటు చేసుకోవాలి.

అధ్యయనం

క్యాన్సర్ చికిత్సతో మతిమరుపు

కార్-టి సెల్ థెరపీ ఫలప్రదమైన క్యాన్సర్ చికిత్స. అయితే ఈ చికిత్సతో మతిమరుపు, ఏకాగ్రతా లోపం లాంటి దుష్ప్రభావాలు ఉంటాయని తాజాగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ చేపట్టిన ఒక అధ్యయనంలో వెల్లడైంది.

రోగి సొంత టి సెల్స్‌ను మార్పుకు గురి చేయడం ద్వారా, క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని నాశనం చేసే కార్-టి సెల్ చికిత్స ఎంతో సమర్థవంతమైనది. వేగంగా విజృంభించే తత్వం కలిగిన క్యాన్సర్ కొమ్ములు విరచడంలో ఈ చికిత్స అత్యంత సమర్థమైనదిగా పేరుపొందింది. అయితే ప్రతి కేన్సర్ చికిత్సకూ దుష్ప్రభావాలు ఉనట్టే, దీనికి కూడా మెదడు పనితీరును ప్రభావితం చేసే స్వభావం ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. మెదడు, చర్మం, రక్తం, ఎముక... ఇలా వేర్వేరు శరీరావయవాలకు క్యాన్సర్ సోకిన ఎలుకలపై చేపట్టిన చిట్టెలుకలను అధ్యయనం చేసినప్పుడు, కార్-టి చికిత్సకు ముందు, తర్వాత సదరు చిట్టెలుకలతో మెదడు సామర్థ్యం తగ్గిన సూచనలు కనిపించినట్టు పరిశోధకులు కనిపెట్టడం జరిగింది. అయితే కార్-టి చికిత్స ఎంతో సమర్థమైనది కాబట్టి ఈ చికిత్స ప్రభావం మెదడు పనితీరు మీద కనబరిచే శాశ్వత ప్రభావాలను అర్థం చేసుకోవడం ఎంతో కీలకం. కాబట్టి ప్రస్తుతం పరిశోధకులు, ఈ చికిత్సతో



క్షీణించిన మెదడు పనితీరును తిరిగి సరిదిద్దగలిగే వ్యూహాత్మకమైన చికిత్సా ప్రత్యామ్నాయాలను కనిపెట్టడంతో పాటు, ఇలాంటి దుష్ప్రభావాలు తక్కువగా ఉండే భవిష్యత్తు చికిత్సా విధానాలను కూడా రూపొందించే పనికి పూనుకున్నారు.

మైగ్రేన్



పార్శ్వ నొప్పిని భరించడం కష్టమే! అయితే తెలివిగా వ్యవహరించగలిగితే దీని మీద పైచేయి సాధించడం అంత కష్టమేమీ కాదనీ, ప్రేరకాలను కనిపెట్టి, ముందస్తు మందులతో దీనికి అడ్డుకట్ట వేయడం సులభమేనని వైద్యులు అంటున్నారు. పార్శ్వ నొప్పి పని ఎలా పట్టాలో ఇలా వివరిస్తున్నారు.

పార్శ్వ నొప్పి పని పడదాం!

ఈ నొప్పికి వయసుతో పని లేదు. పిల్లల్లో, పెద్దల్లో, వృద్ధుల్లో ఎవరినైనా ఈ నొప్పి వేధించవచ్చు. అయితే ముఖ్యంగా 20 నుంచి 40 ఏళ్ల వయస్కుల్లో ఈ నొప్పి ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. సాధారణ తల నొప్పికీ పార్శ్వపు నొప్పికీ స్పష్టమైన తేడాలుంటాయి. సాధారణ తలనొప్పులు కొన్ని నిమిషాల పాటు ఇబ్బంది పెడితే, మైగ్రేన్ నొప్పి గంటలు, రోజుల తరబడి వేధిస్తుంది. అలాగే కొన్ని లక్షణాలతో ఈ నొప్పిని తేలికగా కనిపెట్టవచ్చు. అవేంటంటే....

- కంటి వెనక నొప్పి మొదలవుతుంది
- తలకు ఎడమ వైపు, కుడి వైపు ఇలా తలలో ఒక వైపున నొప్పి మొదలవుతుంది
- ఈ ప్రదేశాలు కూడా వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి
- తల మీద కొట్టినట్టు, తల పగిలిపోతున్నట్టు నొప్పి ఉంటుంది
- కళ్లు బైర్లు కమ్మడం
- నీరసం, చీకాకు
- శబ్దాలను, వెలుతురునూ భరించలేకపోవడం
- వాంతి వస్తున్న భావన కలగడం
- వాంతితో పాటు తలనొప్పి తగ్గడం

వ్యాధినిర్ధారణ సులువే!

ఈ నొప్పికి కొన్ని అంశాలు దోహదపడుతూ ఉంటాయి. నిద్ర లేమి, వేడుకల్లో అధిక వెలుగులకూ, శబ్దాలకూ బహిర్గతం కావడం, సినిమాకు, పబ్‌లకూ వెళ్లి రావడం, విపరీతమైన ఒత్తిడికి లోనవడం, మద్యం తీసుకోవడం, మాదక ద్రవ్యాలు తీసుకోవడం.. వీటి తదనంతరం తల నొప్పి మొదలైతే దాన్ని మైగ్రేన్ నొప్పిగా, మైగ్రేన్ ప్రేరేపిత అంశాలుగా పరిగణించాలి. ఈ నొప్పి ప్రారంభంలో నెలలో ఒకసారికి పరిమితమైతే, క్రమేపీ నెలలో ఐదారుసార్లకు పెరిగిపోతుంది. ఈ నొప్పి తీవ్రత కూడా కాలక్రమేణా పెరిగిపోతూ, రోజంతా పడకకే పరిమితమయ్యే పరిస్థితికి దారి తీస్తుంది. కాబట్టి మైగ్రేన్ నొప్పిని వీలైనంత త్వరగా నిర్ధారించుకుని, వెంటనే చికిత్స మొదలుపెట్టుకోవాలి. ఎమ్మారై, స్కాన్‌లో తలలో ఎటువంటి సమస్య లేదని తేలినప్పుడు, ఒక ప్రశ్నావళి ఆధారంగా ఈ సమస్యను మైగ్రేన్‌గా వైద్యులు నిర్ధారిస్తారు. సమస్య తీవ్రత పెంచే కారకాలు, ప్రేరకాలు, లక్షణాల ఆధారంగా ఈ సమస్యను కచ్చితంగా నిర్ధారించుకోవచ్చు.

మందులతో అదుపులోకి రాని మైగ్రేన్ కోసం నేడు బొటాక్స్ ఇంజెక్షన్లు అందుబాటులో కొచ్చాయి. తలలో నొప్పి వేధించే ప్రదేశంలో కండరాలకు ఈ ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా నొప్పి నుంచి ఉపశమనాన్ని అందించవచ్చు.

వీటికి దూరం

- సరైన నిద్రవేళలు పాటించడం
- ఆహార సమయాలు పాటించడం
- ఒత్తిడికి దూరంగా ఉండడం
- డిజెలు, బిగ్గర శబ్దాలకు దూరంగా ఉండడం
- వ్యాయామం చేయడం
- వెలుగులకు బహిర్గతం అవకపోవడం

తలలోని ట్రైజెమైనల్ నాడి, న్యూరోట్రాన్స్‌మీటర్లలో హెచ్చుతగ్గులు మైగ్రేన్‌కు కారణం. సెరోటినిన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ మోతాదు తగ్గితే, శరీరం న్యూరోపెప్టైడ్స్‌ను విడుదల చేస్తుంది. దాంతో తల్లోని రక్తనాళాలు విప్పారి, ఎక్కువ రక్తం మెదడులోకి చేరుకుంటుంది. దాంతో తలభారం మొదలవుతుంది. స్థూలంగా మైగ్రెయిన్ నొప్పికి కారణమిదే!

- నొప్పిని ప్రేరేపించే పదార్థాలను మానేయడం
- మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం

చికిత్స ఇలా...

మైగ్రేన్ నొప్పి ప్రేరకాలకు దూరంగా ఉండడం ద్వారా ఈ సమస్యను నిలువరించుకోవచ్చు. ఏఏ అంశాలు ఈ నొప్పిని ప్రేరేపిస్తున్నాయో ఎవరికి వారు కనిపెట్టి వాటికి దూరంగా ఉండడం ముఖ్యం. అప్పటికీ నొప్పి వేధిస్తుంటే మందులతో నొప్పిని అదుపు చేసుకోవచ్చు. మైగ్రేన్ నొప్పిని ప్రారంభంలోనే గుర్తించడం, గుర్తించిన వెంటనే మందులు వేసుకుని నొప్పిని అదుపులో ఉంచుకోవడం అవసరం. సమస్యను త్వరగా నిర్ధారించుకోవడంతో పాటు నివారణ చర్యలు, చికిత్సలను ఎంత త్వరగా అనుసరించగలిగితే ఈ సమస్య అంత మెరుగ్గా అదుపులో ఉంటుంది. వైద్యులు సూచించిన మాత్రలను నొప్పి మొదలైన మొదటి గంటలోపే వాడుకుంటే, నొప్పి తీవ్రమవకుండా ఉంటుంది. నొప్పి తీవ్రమైన తర్వాత మందులు వాడుకుంటే, ఆ మందులతో నొప్పి అదుపులోకి రావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అలాగే వేర్వేరు ఆరోగ్య సమస్యలున్న వారికి వైద్యులు సూచించే మైగ్రేన్ మాత్రలు కూడా వేర్వేరుగా ఉంటాయి. అన్ని మాత్రల్లాగే వీటికి కూడా జుట్టు రాలిపోవడం, బరువు పెరగడం, నెలసరి సమస్యలు లాంటి దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. అయితే ఈ తలనొప్పి శాశ్వత సమస్య కాదు. వైద్యుల సూచనల మేరకు కారకాలకు దూరంగా ఉంటూ క్రమం తప్పకుండా మందులు వాడుకోగలిగితే, క్రమేపీ మందులతో పని లేకుండానే ఈ నొప్పి అదుపులోకొస్తుంది.

కాలక్రమేణా మైగ్రేన్ తలనొప్పులు పెరుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం అసహనం. అన్నీ క్షణాల్లో జరిగిపోవాలనే తొందర అందర్లో ఉంటోంది. అనుకున్నదే తడవుగా చేతికి అందాలనే స్వభావం మెదడు ఒత్తిడికి దారి తీసి, అదనపు హార్మోన్లు విడుదలై అంతిమంగా మైగ్రేన్ లాంటి సమస్యలను తెచ్చిపెడుతోంది. కాబట్టి శాంత స్వభావాన్ని అలవరుచుకోవడం కూడా కీలకమే! మనసును ప్రశాంతంగా ఉంచుకుంటూ, వాస్తవ దృష్టితో నడుచుకుంటూ, పార్శ్వ నొప్పిని ప్రేరేపించే కారకాలకు దూరంగా ఉండగలిగితే, ఈ సమస్య నుంచి తేలికగా బయటపడవచ్చు.

నొప్పి నాలుగు దశల్లో...

24 నుంచి 72 గంటల పాటు వేధించే పార్శ్వపు నొప్పి నాలుగు దశల్లో సాగుతుంది. అవేంటంటే...

ప్రొడ్రోమ్: నొప్పికి రెండు గంటల నుంచి రెండు రోజుల ముందు వరకూ చోటుచేసుకునే అంశాల సమూహమిది. ఈ సమయంలో చీకాకు, ఒత్తిడి, ఆందోళన, వెలుతురు భరించలేకపోవడం, మెడనొప్పి లాంటి లక్షణాలుంటాయి.

ఆరా: నొప్పి మొదలయ్యే కొన్ని నిమిషాల ముందుండే దశ ఇది. చూపు మందగించడం, కళ్లకు ఎగుడుదిగుడు లైన్లు కనిపించడం, తలలో సూదులు గుచ్చినట్టు ఉండడం, మాటలు తడబడడం, నీరసం లాంటి లక్షణాలుంటాయి.

ఎటాక్: ఈ దశ రెండు నుంచి మూడు రోజుల వరకూ ఉండవచ్చు. ఈ దశలో వాంతులు వేధిస్తాయి.

పోస్ట్‌డ్రోమ్: ఈ చివరి దశలో నొప్పి తగ్గిపోయినా, తల భారం కొన్ని రోజుల పాటు కొనసాగుతుంది.

డాక్టర్ వేణుగోపాల్ గోక
సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ అండ్ స్పైన్ సర్జన్,
మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్



మనోగతం

ఆ రోగుల పట్ల దృక్పథం మారాలి

నేనొక వ్యక్తిగతమైన, ఎంతో ప్రాధాన్యం ఉన్న విషయం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఇది నాకెందుకింత ముఖ్యమో చెప్పాలంటే మూడు సంవత్సరాలు వెనక్కి వెళ్లాలి. అది పీజీ సీటు వచ్చిందన్న వార్త తెలిసిన రోజు. సైకియాట్రీకి ఎంపికైనట్టు తెలిసినప్పుడు మొదట గర్వంగా అనిపించింది. నా తల్లిదండ్రులు చదువుకున్న వాళ్లు అయినప్పటికీ, "సైకియాట్రీలో సీటొచ్చింది" అని



వారితో పంచుకోవడం అంత సులభం కాలేదు. నాకే కాదు నా తోటి డాక్టర్ల పరిస్థితి కూడా అదే! "నేను మానసిక వైద్యురాలిని అవుతున్నాను అని చెప్పినప్పుడు మా అమ్మ... "నిన్ను పిచ్చి డాక్టర్ అంటారు, నిన్ను పెళ్లాడడానికి ఎవరూ ముందుకు రారు" అని అంది. అవి కోపంతో వచ్చిన మాటలు కావు. ఆ మాటల వెనక అమ్మ ఆందోళన నాకు అర్థమైంది. చివరకు మా కుటుంబ స్నేహితులందరూ కలిసి తల్లిదండ్రులను ఒప్పించవలసి వచ్చింది. ఇందులో మా అమ్మ తప్పేమీ లేదు. ఇది ప్రతి తల్లి ఆవేదనే! ఆప్తులే కాదు, నా తోటి డాక్టర్లు కూడా వింతగా స్పందించారు. "ఓహ్ సైకియాట్రీ తీసుకున్నావా? ఎలాంటి పేషెంట్స్ వస్తారు నీ దగ్గరికి? వాళ్లతో ప్రమాదం ఉండదా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది రోగుల గురించిన చర్చలా లేదు. ఒక జాతికి ఇంకో జాతికీ, ఇంకో జాతికీ మధ్య జరిగే పోరాటంలో నేనొక భూమికను పోషిస్తున్న భావనకు వాళ్లు లోనయ్యారు.

సానుభూతి, తోడ్పాటు అవసరం

మానసిక రోగులు మిగతా రోగుల్లా తినే ఆహారం, వైరస్, బ్యాక్టీరియాలతో ఆరోగ్యాన్ని వాళ్లే పాడు చేసుకున్న వాళ్లు కాదు. వాళ్లు సమాజంలోని అనేక అపసవ్య సంబంధాలు, రుగ్మతల బాధితులు. కానీ వారి పట్ల ఎంతో సానుభూతితో, బాధ్యతతో వ్యవహరించాల్సిన కుటుంబసభ్యులు, స్నేహితులు, సభ్య సమాజం... వారికి తగిన వైద్యం చేయించి సహాయపడడానికి బదులుగా, దూరం పెట్టాలనే ఆలోచిస్తున్న పరిస్థితి నేడు నెలకొని ఉంది. ఈ సమస్యకు తోడు, మానసిక అనారోగ్యానికి గురైన వ్యక్తులు కూడా తామొక మానసిక రుగ్మతకు గురైనట్టు అంగీకరించకుండా సమస్యను పెద్దది చేసుకోవడం మరో పెద్ద అడ్డంకిగా మారుతోంది. ఫలితంగా చికిత్స ఆలస్యమై, ఏళ్ల తరబడి సమస్యను భరిస్తూ ఉండిపోతున్నారు. దాంతో వ్యాధి ముదిరిపోయిన దశలోనే వైద్యులను కలుస్తూ ఉంటారు. వ్యాధితో బాధపడడం ఒక ఎత్తైతే, వ్యాధిని గుర్తించకుండా, చికిత్సకు దూరంగా బ్రతకడం మరొక ఎత్తు.

మనందరి బాధ్యత

మానసిక వ్యాధి కేవలం వ్యక్తిగతం కాదు. అది సామాజికం కూడా. మానసిక రుగ్మతల పట్ల సమాజంలో నెలకొని ఉన్న వ్యతిరేకతలు బాధితులను ఒంటరులను చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని శారీరక ఆరోగ్యంగా పరిగణించే పరిపక్వత సమాజం సాధించవలసిన అవసరం ఉంది. మనిషి ఆరోగ్యంగా ఉండడం అంటే సదరు వ్యక్తి మానసికోల్లాస పరిస్థితిలో ఉండడమే! ప్రపంచీకరణ, అనిశ్చిత ప్రపంచ రాజకీయ వ్యాపార పరిస్థితి వలన ఈ రోజు సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులు ప్రతి వ్యక్తి మానసిక ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. మనమింకా "మానసిక వ్యాధి" అనే పదానికి భయపడుతూ ఉన్నాం. ఈ మౌనం, ఈ అపహాస్యం ఆగాలి. సైకియాట్రిస్ట్‌లు అంటే పిచ్చివాళ్ల డాక్టర్లు కాదు. మనందరి ప్రాణాలు కాపాడే మిగతా వైద్యులతో ఈ వైద్యులూ సమానులే! చికిత్స తీసుకోవడం బలహీనత కాదు, అదొక తెలివైన నిర్ణయం. ప్రతి మనిషి మానసిక ఆరోగ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించుకునే సమాజం కావాలి.

డాక్టర్ సనా కౌసర్
ఎంబీబీఎస్(ఎండీ, సైకియాట్రి)
కాంటాక్ట్ నంబరు- 9121318569
మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం



మీకు తెలుసా?

వీటిని ఇలా తినాలి

కొన్ని పదార్థాల్లోని పోషకాలు ఇంకొక పదార్థంలోని ఇతర పోషకాలతో జత కలిసినప్పుడే ప్రభావవంతమైన ఫలితాన్నిస్తాయి. అవేంటో తెలుసుకుందాం!

- పుచ్చ ముక్కల మీద కొద్దిగా ఉప్పు చల్లుకుని తింటే, పుచ్చలోని పొటాషియం ఉప్పులోని సోడియంతో జతకట్టి మనలోని ఎలక్ట్రోలైట్స్ సంతులనానికి సహాయపడుతుంది



- బాదం పప్పును, చాక్లెట్‌తో కలిపి తింటే బాదంలోని విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు డార్క్ చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్‌తో కలిసి, యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ పెరిగి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది
- ఓట్స్‌ను పెరుగులో నానబెడితే, ఓట్స్‌లోని ప్రిబయాటిక్ బీటా గ్లూకాన్ పెరుగులోని ప్రొబయాటిక్స్‌తో కలిసి పేగుల్లోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది, పేగుల ఆరోగ్యం మెరుగు పడుతుంది
- బ్రొకొలిని ఆవాలతో కలిపి తీసుకుంటే, ఆవాలలోని ఎంజైమ్స్, బ్రొకొలిలోని సల్ఫొరఫైన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ శోషణకు తోడ్పడతాయి
- గ్రీన్ టీలో నిమ్మరసం కలుపుకుని తాగాలి. నిమ్మరసంలోని విటమిన్ సి, గ్రీన్‌టీలోని యాంటీఆక్సిడెంట్లను శరీరం మెరుగ్గా శోషించుకోడానికి తోడ్పడుతుంది

విదేశీ కంపెనీలపై పారాహుషార్

- విదేశీ పెట్టుబడులపైనా సమీక్ష

న్యూఢిల్లీ: దొడ్డి దారిన భారత కంపెనీలను చేజిక్కించుకునే విదేశీ కంపెనీలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలనూ సమీక్షిస్తున్నట్లు సమాచారం. దాదాపు తుది దశకు చేరిన కొత్త నిబంధనలను ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని భావిస్తున్నారు. చైనాతో సహా భారత్‌తో భూ, సముద్ర సరిహద్దులు ఉన్న దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డీఐపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. ఈ కంపెనీలు భారత్‌లో సొంత కంపెనీలు పెట్టాలన్నా లేదా స్థానిక సంస్థలతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేయాలన్నా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా చైనాకు చెందిన కొన్ని కంపెనీలు దొడ్డి దారిన దేశీయ కంపెనీల ముసుగులో భారత్‌లో తమ సొంత వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. కొత్త నిబంధనలతో దేశంలోని విదేశీ కంపెనీలు తమ వాటాలు బదిలీ చేయాలన్నా ప్రభుత్వ ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయబోతున్నారు.

‘సుప్రీం’లో టెల్కోలకు చుక్కెదురు

ఏజీఆర్ బకాయిల రద్దుకు నో
ప్రభుత్వం ఆదుకుంటే అడ్డురాం



న్యూఢిల్లీ: దేశంలోని టెలికాం కంపెనీల (టెల్కో)కు సుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురైంది. తమ సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్)పై చెల్లించాల్సిన బకాయిల నుంచి మినహాయింపు ఇప్పించాలన్న వొడాఫోన్ ఐడియా, భారతి ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీఆర్ బకాయిలపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును టెల్కోలు పొరపాటుగా అర్థం చేసుకున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ‘ఈ పిటిషన్లు చూస్తుంటే ఆందోళన, ఆశ్చర్యం కలుగుతోంది. ఒక బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సీ) ఇలాంటి పిటిషన్ దాఖలు చేస్తుందని ఊహించలేం. ఈ పిటిషన్‌ను మేము డిస్మిస్ చేస్తున్నాం’ అని వొడాఫోన్ ఐడియాకు సుతిమెత్తగా చీవాట్లు పెట్టింది. అయితే ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న టెల్కోలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే తాము అడ్డురామని వొడాఫోన్ కంపెనీ తరఫున వాదించిన సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గికి ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ఆదుకోవాలని ఉన్నా ఏజీఆర్ బకాయిలపై 2021 జూలైలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అందుకు అడ్డంకిగా ఉందని రోహత్గి ధర్మాసనానికి చెప్పారు. దాంతో ధర్మాసనం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వం వొడాఫోన్ ఐడియాను ఆదుకునేందుకు కొత్త చర్యలు ఏమైనా తీసుకునే అవకాశం ఉందనే ఆశలు చిగురిస్తున్నాయి.

ఇదీ కేసు

కేంద్ర టెలికాం శాఖ (డాట్) తమ సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) లెక్కించేటప్పుడు ప్రధాన వ్యాపారం ఆదాయాన్ని తప్ప, ఇతర ఆదాయాలను లెక్కలోకి తీసుకోకూడదని టెల్కోలు గతంలో సుప్రీంకోర్టుని ఆశ్రయించాయి. అయితే 2021 జూలైలో కోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.93,000 కోట్లకు పైగా ఏజీఆర్ బకాయిలను 10 సంవత్సరాల్లో ఏటా 10 శాతం చొప్పున చెల్లించాలని ఊరట ఇచ్చింది. ఆ విషయంలో కూడా వొడాఫోన్ ఐడియా విఫలమైంది. దీంతో ఈ బకాయిల్లో కొంత భాగాన్ని ప్రభుత్వం కంపెనీ మూలధనం (ఈక్విటీ)లో తన వాటాగా మార్చుకుంది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో ప్రభుత్వానికి 48.99 శాతం వాటా ఉంది. 2021 జూలై నాటి తీర్పును సమీక్షించాలని వొడాఫోన్ ఐడియా ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించినా నిరాశే మిగిలింది. ఈ విషయంలో వొడాఫోన్‌కు మినహాయింపు ఇస్తే దాన్ని తమకూ వర్తింప చేయాలని ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ సుప్రీంకోర్టును కోరాయి. అయితే సుప్రీంకోర్టు సోమవారం ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు.

షేర్లు ఢమాల్

సుప్రీం తీర్పుతో వొడాఫోన్ ఐడియా షేర్లు సోమవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో ఒక దశలో కంపెనీ షేర్లు 12.21 శాతం నష్టపోయి రూ.6.47 వద్ద ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి 8.68 శాతం నష్టంతో రూ.6.78 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రూ.6,933.95 కోట్లు తగ్గి రూ.72,914.86 కోట్లకు చేరింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండస్ టవర్స్ షేర్లు 2.87 శాతం, టాటా టెలీ షేర్లు 0.46 శాతం నష్టపోయాయి. ఎయిర్‌టెల్ షేర్లలోనూ తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించింది. చివరికి 0.17 శాతం స్వల్ప లాభంతో రూ.1,817.40 వద్ద ముగిశాయి.

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ 271 పాయింట్లు డౌన్
- 25,000 దిగువకు నిఫ్టీ

ముంబై: ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజు నష్టపోయాయి. అమెరికా పరపతి రేటింగ్‌ను మూడీస్ ‘ట్రిపుల్ ఏ’ నుంచి ‘ఏఏ1’కు తగ్గించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా ట్రేడింగ్ సెంటిమెంట్ బలహీనపడటం కూడా మన మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సరికి, సెన్సెక్స్ 271.17 పాయింట్లు కోల్పోయి 82,059.42 వద్దకు జారుకుంది. నిఫ్టీ 74.35 పాయింట్ల నష్టంతో 24,945.45 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 25,000 కీలక స్థాయిని మళ్లీ చేజార్చుకుంది. బీఎస్ఈలోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టపోయాయి.

ఈ నెలలో 6 ఐపీఓలు

రూ.11,000 కోట్ల సమీకరణ

ప్రైమరీ మార్కెట్లో మళ్లీ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల సందడి మొదలైంది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలోని ప్రధాన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో షేర్లను నమోదు చేయాలనుకుంటున్న 6 కంపెనీలు ఈ నెలలో ఐపీఓకు రానున్నట్లు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. ఈ ఆరు కంపెనీలు మార్కెట్ నుంచి రూ.11,669 కోట్ల వరకు నిధులు సమీకరించనున్నాయని వారన్నారు. ఈనెలలో ఐపీఓ ప్రారంభించనున్న కంపెనీల జాబితాలో ‘ది లీలా’ బ్రాండ్‌నేమ్‌తో లగ్జరీ హోటళ్లను నిర్వహించే ష్లోస్ బెంగళూరు, బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇండస్ట్రీస్, ఏజీస్ వోపక్ టెర్మినల్స్, అరిస్ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్, స్కోడా ట్యూబ్స్ ఉన్నాయి. బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇప్పటికే తమ ఐపీఓ ధరల శ్రేణిని సైతం ప్రకటించగా.. మిగతా కంపెనీలు ఈ వారంలో వెల్లడించే అవకాశాలున్నాయి. ష్లోస్ బెంగళూరు ఐపీఓ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించనుంది. ఏజీస్ వోపక్ టెర్మినల్స్ రూ.3,500 కోట్లు, అరిస్ఇన్‌ఫ్రా రూ.600 కోట్లు, స్కోడా ట్యూబ్స్ రూ.275 కోట్లు సేకరించనున్నాయి.

రికార్డు స్థాయికి ఫండ్ ఆస్తులు

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 23% వృద్ధితో రూ.65.74 లక్షల కోట్లకు చేరిక
- యాంఫీ వార్షిక నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశీయ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) రంగ మొత్తం ఆస్తులు ఏకంగా రూ.12 లక్షల కోట్లకు పైగా లేదా 23 శాతం వృద్ధి చెంది సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.65.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ, డెట్ మార్కెట్లు మంచి ప్రతిఫలాలు అందిస్తున్న నేపథ్యంలో మదుపర్లు సమృద్ధిగా పెట్టుబడులు పెట్టడం, మార్క్ టు మార్కెట్ గెయిన్స్ (ఎంటీఎం) ఇందుకు తోడ్పడ్డాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి నాటికి ఫండ్ ఆస్తులు రూ.53.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ-50 టీఆర్ఐ (టోటల్ రిటర్న్ ఇండెక్స్) 6 శాతంగా, సెన్సెక్స్ టీఆర్ఐ 5.9 శాతంగా నమోదైందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సోమవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతేకాదు, గతసారి ఫండ్ల పథకాల్లోకి నికరంగా రూ.8.15 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	127
విశాఖపట్నం	121	అనంతపురం	127
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,100 ▼	87,550 ▲	1,09,000 ▲
విజయవాడ	96,500 ▼	88,800 ▼	97,500 ▼
విశాఖపట్నం	96,800 ▲	87,850 ▲	1,09,000 ▲
రాజమండ్రి	95,510 ▲	87,550 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	95,400 ▲	87,770 ▲	98,000 ▼
ముంబై	93,785 ▲	85,907 ▲	95,755 ▲

యూకో బ్యాంక్ మాజీ సీఎండీ గోయల్ అరెస్ట్

మనీలాండరింగ్ అభియోగాలపై అదుపులోకి తీసుకున్న ఈడీ

న్యూఢిల్లీ: బ్యాంకు రుణ మోసం కేసులో మనీలాండరింగ్ అభియోగాలపై యూకో బ్యాంక్ మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుబోధ్ కుమార్ గోయల్‌ను అరెస్ట్ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (సీఎస్‌పీఎల్), ఇతరులపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా గోయల్‌ను ఈ నెల 16న ఆయన నివాసంలో అరెస్ట్ చేసినట్టు పేర్కొంది. 17న కోల్‌కతాలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో గోయల్‌ను హాజరు పరచగా.. మే 21 వరకు ఈడీ కస్టడీకి కోర్టు అప్పగించినట్టు తెలిపింది. ఈడీ తన దర్యాప్తులో భాగంగా గత ఏప్రిల్‌లో గోయల్‌తో పాటు మరికొందరి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్నప్పుడు సీఎస్‌పీఎల్‌కు రూ.6,210.72 కోట్ల రుణాలు మంజూరు చేయగా ఆ సంస్థ ఆ మొత్తాలను దారి మళ్లించినట్టు ఈడీ పేర్కొంది. ప్రతిగా సీఎస్‌పీఎల్ నుంచి గోయల్ ముడుపులు అందుకున్నట్టు ఆరోపించింది. సీఎస్‌పీఎల్‌కు క్రెడిట్ ఫెసిలిటీలను మంజూరు చేయడం, తర్వాత భారీ ఎత్తున రుణ మొత్తాల మళ్లింపునకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	550
వరంగల్	532	గోదావరి	540
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	72

దొడ్ల డెయిరీ లాభం రూ.68 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దొడ్ల డెయిరీ.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.67.96 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 45.12 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.787.44 కోట్ల నుంచి రూ.909.62 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.3,720.10 కోట్ల ఆదాయంపై రూ.259.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం తొలిసారిగా రూ.200 కోట్ల మైలురాయిని అధిగమించిందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు. కాగా రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2 (20 శాతం) డివిడెండ్‌ను అందించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందన్నారు.

కేవీబీ లాభంలో 13 శాతం వృద్ధి

చెన్నై: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.513 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.456 కోట్లు)తో పోల్చితే లాభం 13 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.2,813 కోట్ల నుంచి రూ.3,025 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను లాభం 21 శాతం వృద్ధితో రూ.1,605 కోట్ల నుంచి రూ.1,942 కోట్లకు పెరిగిందని కేవీబీ తెలిపింది. కాగా రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.60 (130 శాతం) డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

మా ఆర్థిక పరిస్థితి గ్రీస్ కంటే ఘోరం

జపాన్ ప్రధాని షిగేరు ఇషిబా

టోక్యో: జపాన్ కూడా ఆర్థిక సంక్షోభానికి చేరువైంది. తమ దేశ ఆర్థిక పరిస్థితి గ్రీస్ కంటే ఘోరంగా ఉందని సాక్షాత్తూ ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబా ప్రకటించారు. ప్రభుత్వ అప్పుల భారం జీడీపీలో 260 శాతాన్ని మించి పోయిందన్నారు. జీ-7 సంపన్న దేశాల్లో మరే దేశ ప్రభుత్వ రుణ భారం ఈ స్థాయిలో లేదు. వృద్ధుల జనాభా పెరిగిపోవడం, సంక్షేమ పథకాల భారం గుదిబండలా మారడం, పెరిగిపోతున్న వడ్డీ రేట్లు ఇందుకు కారణమని ప్రధాని స్పష్టం చేశారు. ఇక అప్పులు చేసి పన్నుల కోత సాధ్యం కాదని చెప్పారు. 2010లో జపాన్ రుణ భారం జీడీపీలో 218 శాతానికి చేరినప్పుడూ అప్పటి ప్రధాని ఇలానే హెచ్చరించారు.

అవన్నీ వదంతులే

ఆసియాకప్ బాయ్‌కాట్ ఊహాగానాలను ఖండించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఆసియాకప్ నుంచి భారత్ వైదొలగుతుందంటూ వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ ఖండించింది. ఇండో-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియాకప్, మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియాకప్ టోర్నీల నుంచి తప్పుకోవాలని బీసీసీఐ నిర్ణయించుకున్నదంటూ సోమవారం జోరుగా వదంతులు వ్యాపించాయి. ప్రస్తుతం ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్‌గా పాకిస్థాన్ మంత్రి, పీసీబీ చైర్మన్ మొహిసిన్ నక్వీ ఉండడమే ఈ వదంతులకు కారణంగా తెలుస్తోంది. ‘ఆసియాకప్ ఈవెంట్ల నుంచి బీసీసీఐ తప్పుకోనుందంటూ ఊహాజనిత వార్తలు ఉదయం నుంచి చక్కర్లు కొడుతున్నాయి. కానీ, వాటిల్లో నిజం లేదు. ప్రస్తుతం మా దృష్టంతా ఐపీఎల్, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌పైనే. ఏదైనా నిర్ణయం తీసుకొంటే అధికారికంగా ప్రకటన చేస్తామ’ని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపాడు.

మందు మానేశా!


బెన్ స్టోక్స్

లండన్: గతేడాది డిసెంబరులో గాయపడిన ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రస్తుతం పూర్తి స్థాయిలో కోలుకున్నాడు. ఈనెల 22 నుంచి జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టులో ఆడబోతున్నాడు. అయితే గాయాల నుంచి కోలుకునేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని స్టోక్స్ తెలిపాడు. కివీస్ టూర్‌లో తొడకండరాల గాయం తర్వాత తాను మద్యం మానేశానని తెలిపాడు. ఎందుకంటే 2023లోనూ ఇదే గాయానికి గురి కావడంతో ఈసారి జాగ్రత్త పడాలని భావించినట్టు స్టోక్స్ చెప్పాడు. అత్యుత్తమ ఫిట్‌నెస్ అందుకోవడానికే ఇలా చేశానని, అయితే శాశ్వతంగా మందు మానేసే ఆలోచన మాత్రం లేదని తేల్చాడు.

సింధు, ప్రణయ్ ఆట గాడిలో పడేనా?

నేటినుంచి మలేసియా మాస్టర్స్



కౌలాలంపూర్: సుదీర్ఘ కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలోనైనా పుంజుకోవాలని పట్టుదలగా ఉన్నారు. మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే టోర్నీలో జపాన్‌కు చెందిన నట్సుకి నిదైరాతో సింధు తొలి రౌండ్‌లో తలపడనుంది. ప్రణయ్‌కు మొదటి రౌండ్‌లోనే ఐదో సీడ్, కెంటా నిషిమోటో (జపాన్) రూపంలో కఠినమైన ప్రత్యర్థి ఎదురు కానున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, పురుషుల సింగిల్స్‌లో సతీష్ కరుణాకరన్, ప్రియాన్షు రజావత్ బరిలో నిలిచారు. మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల/తనీష, రోహన్/రుత్వికా శివానీ, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ తలపడుతున్నారు. ప్రపంచ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్, తరుణ్ క్వాలిఫయింగ్ రౌండ్ల ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

లఖ్‌నవూ ఇంటికి


క్లాసెన్ (47)


అభిషేక్ (59)

సన్‌రైజర్స్ చేతిలో ఓటమి
ప్లేఆఫ్స్ రేసు నుంచి అవుట్
అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్

1 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లో (2381)నే 150 వికెట్లు తీసిన బౌలర్‌గా హర్షల్ పటేల్.

1 ఐపీఎల్ సీజన్‌లో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (మార్ష్, మార్‌క్రమ్, పూరన్) 400+ స్కోర్లు నమోదు చేయడం ఇదే తొలిసారి.

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పోరాటం కూడా ముగిసింది. ప్లేఆఫ్స్‌లో మిగిలిన ఒక్క బెర్త్ కోసం రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ బోల్తా పడింది. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లతో ఓడింది. దీంతో 12 మ్యాచ్‌లు 10 పాయింట్లతో అధికారికంగా పంత్ సేన ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. అటు భారీ ఛేదనలో అభిషేక్ శర్మ (20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 59)తో పాటు రైజర్స్ బ్యాటర్లు కలిసికట్టుగా కదం తొక్కడంతో వీరికి నాలుగో విజయం దక్కింది. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 205 పరుగులు చేసింది. మార్ష్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 65), మార్‌క్రమ్ (38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 61) అర్ధసెంచరీలు సాధించగా, పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 45) ఆకట్టుకున్నాడు. ఎషాన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 18.2 ఓవర్లలో 4 వికెట్లకు 206 రన్స్ చేసి గెలిచింది. క్లాసెన్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 47), ఇషాన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35), కమిందు (21 బంతుల్లో 3 ఫోర్లతో 32 రిటైర్డ్ హర్ట్) రాణించారు. దిగ్వేష్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

చెలరేగిన అభిషేక్: భారీ ఛేదనలో రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర ఆటను ప్రదర్శించగా, మిగతా బ్యాటర్లంతా సహకారమందించారు. ఇక హెడ్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన అథర్వ (13) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగినా శర్మ మాత్రం జోరు ఆపలేదు. మూడో ఓవర్‌లో 4,6,4తో 17 రన్స్ అందించాడు. ఓరౌర్కీ ఓవర్‌లోనూ 4,6 బాదడంతో పవర్‌ప్లేలో స్కోరు 72/1కి చేరింది. ఆ తర్వాత కూడా అభిషేక్ ఎదురుదాడి ఆగలేదు. బిష్ణోయ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో వరుసగా 4 సిక్సర్లతో 26 రన్స్ రాబట్టడంతో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. ప్రమాదకరంగా మారిన తనను దిగ్వేష్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు ఇషాన్‌తో 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మార్‌క్రమ్ ఓవర్‌లో 4,6 బాదిన ఇషాన్‌ను దిగ్వేష్ అవుట్ చేశాడు. అయితే క్లాసెన్ చెలరేగి లక్ష్యాన్ని సులువు చేశాడు. కమిందు సహకారం అందిస్తూ 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అయితే రెండు వరుస ఫోర్ల తర్వాత క్లాసెన్‌ను శార్దూల్ అవుట్ చేసినా అప్పటికి సమీకరణం 15 బంతుల్లో 11 పరుగులే కావడంతో రైజర్స్ విజయానికి ఇబ్బంది లేకుండా పోయింది.

ఓపెనర్ల శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్ అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి పది ఓవర్లపాటు రైజర్స్ బౌలర్లపై ఈ జోడీ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వీరి జోరు చూస్తే స్కోరు సునాయాసంగా 220 దాటుతుందనిపించింది. కానీ డెత్ ఓవర్లలో 45 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. పూరన్ దాదాపు చివరిదాకా ఉన్నా 200+ స్కోరు కోసం కష్టపడాల్సి వచ్చింది. మొదట్లో మార్ష్ దూకుడు కనబరుస్తూ తొలి ఓవర్‌లో 4,6.. రెండో ఓవర్‌లో మరో సిక్సర్ బాదాడు. అటు స్పిన్నర్ హర్ష్ దూబే ఓవర్‌లో మార్‌క్రమ్ 6,4తో జోరు చూపాడు. వీరి బౌండరీల ధాటికి పవర్‌ప్లేలో జట్టు 69 పరుగులకు చేరింది. అలాగే 28 బంతుల్లో మార్ష్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొమ్మిదో ఓవర్‌లో మార్‌క్రమ్ క్యాచ్‌ను అనికేత్ వదిలేశాడు. అదే ఓవర్‌లో జట్టు స్కోరు వందకి చేరింది. ఇక తర్వాతి ఓవర్‌లో మార్ష్ ఆడిన బంతిని హర్షల్ రిటర్న్ క్యాచ్ తీసుకున్నా.. రీప్లేలో బంతి నేలకు తాకినట్టు తేలడంతో బతికిపోయాడు. అయితే 11వ ఓవర్‌లో మార్ష్‌ను పెవిలియన్‌కు చేర్చిన హర్ష్ జట్టుకు రిలీఫ్ నిచ్చాడు. దీంతో 63 బంతుల్లో తొలి వికెట్‌కు 115 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ఎల్ఎస్‌జీ తడబడింది. కెప్టెన్ పంత్ (7) ఎప్పటిలాగే నిరాశపర్చాడు. ఎషాన్ మలింగ స్టన్నింగ్ రిటర్న్ క్యాచ్‌తో అతడికి షాకిచ్చాడు. 16వ ఓవర్‌లో మార్‌క్రమ్ రెండు సిక్సర్లు బాది జోరు పెంచాలని చూసినా హర్షల్ అతడిని అవుట్ చేశాడు. అటు మలింగ రెండు పరుగులే ఇచ్చి హిట్టర్ బదోని (3)ని పెవిలియన్‌కు చేర్చాడు. ఇక ఆఖరి ఓవర్‌లో పూరన్, శార్దూల్ (4) రనౌట్ కాగా సమద్ (3)ను నితీశ్ బౌల్డ్ చేశాడు. అయినా ఆఖరి బంతికి ఆకాశ్ (6 నాటౌట్) సిక్సర్‌తో మురిపించాడు. మొత్తంగా చివరి రెండు ఓవర్లలో 35 పరుగులు రావడంతో లఖ్‌నవూ స్కోరు 200 దాటగలిగింది.

దిగ్వేష్ X అభిషేక్



రైజర్స్ ఓపెనర్ అభిషేక్.. లఖ్‌నవూ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. 8వ ఓవర్‌లో అతడిని అవుట్ చేసిన రాఠీ అతడిని వెళ్లిపో అన్నట్టు చేతులు ఊపుతూ సిగ్నేచర్ స్టయిల్లో సంబరాలు చేసుకున్నాడు. దీంతో డగౌట్‌కు వెళుతున్న అభిషేక్ వెనక్కి రాగా.. దిగ్వేష్ కూడా ఏమిటంటూ ముందుకు వెళ్లాడు. వెంటనే అంపైర్లు కలుగజేసుకుని ఇద్దరినీ శాంతింపచేశారు. ఆ తర్వాత ఇషాన్‌ను అవుట్ చేశాక కూడా రాఠీ డగౌట్ వైపు చూపిస్తూ చేతులు ఊపడం కనిపించింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) మలింగ (బి) హర్ష్ దూబే 65, మార్‌క్రమ్ (బి) హర్షల్ 61, పంత్ (సి అండ్ బి) మలింగ 7, పూరన్ (రనౌట్) 45, బదోని (సి) నితీశ్ (బి) మలింగ 3, సమద్ (బి) నితీశ్ 3, శార్దూల్ (రనౌట్) 4, బిష్ణోయ్ (నాటౌట్) 0, ఆకాశ్‌దీప్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 205/7; వికెట్ల పతనం:** 1-115, 2-124, 3-159, 4-169, 5-194, 6-199, 7-199; **బౌలింగ్:** కమిన్స్ 4-0-34-0, హర్ష్ దూబే 4-0-44-1, హర్షల్ 4-0-49-1, మలింగ 4-0-28-2, జీషన్ 2-0-22-0, నితీశ్ 2-0-28-1.

సన్‌రైజర్స్: అథర్వ (సి) దిగ్వేష్ (బి) ఓరౌర్కీ 13, అభిషేక్ శర్మ (సి) శార్దూల్ (బి) దిగ్వేష్ 59, ఇషాన్ (బి) దిగ్వేష్ 35, క్లాసెన్ (సి) పంత్ (బి) శార్దూల్ 47, మెండిస్ (రిటైర్డ్ హర్ట్) 32, అనికేత్ (నాటౌట్) 5, నితీశ్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.2 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-17, 2-99, 3-140, 4-195, 4-197 (రిటైర్డ్ హర్ట్); **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 3-0-33-0, విల్ ఓరౌర్కీ 2.2-0-31-1, దిగ్వేష్ రాఠీ 4-0-37-2, అవేశ్ 3-0-25-0, రవి బిష్ణోయ్ 1-0-26-0, మార్‌క్రమ్ 1-0-14-0, శార్దూల్ ఠాకూర్ 4-0-39-1.

నేటి మ్యాచ్

నేటి మ్యాచ్	వేదిక ఢిల్లీ
చెన్నై X రాజస్థాన్	రా.7.30 నుంచి

గంభీర్ వల్లే శ్రేయాస్‌కు ఆ ఘనత దక్కలేదు



న్యూఢిల్లీ: టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌పై దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ విమర్శనాస్త్రాలు సంధించాడు. గత ఏడాది కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ టైటిల్ అందించినా..జట్టు మెంటార్‌గా ఉన్న గంభీర్ వల్ల అతడికి ఆ క్రెడిట్ దక్కలేదని వ్యాఖ్యానించాడు. ఇక ఈసారి సారథిగా పంజాబ్ కింగ్స్‌ను శ్రేయాస్ ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. ‘గత సీజన్‌లో నైట్‌రైడర్స్ ఐపీఎల్ టైటిల్ సొంతం చేసుకున్నా కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు తగిన గుర్తింపు రాలేదు. మరొకరికి ఆ కీర్తి లభించింది. మైదానంలో ఉండి జట్టును నడిపించే కెప్టెన్‌దే ప్రధాన పాత్ర. డగౌట్‌లో కూర్చునే వ్యక్తిది కాదు’ అని గంభీర్‌నుద్దేశించి గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో.. అమ్మానాన్న పీఓకేలో ఉన్నారు


మొయిన్ అలీ

లండన్: ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన సమయంలో తన తల్లిదండ్రులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉన్నారని కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ వెల్లడించాడు. ‘ఆ సమయంలో నా తల్లిదండ్రులు అక్కడ ఉన్నారు. వారు ఉన్న ప్రాంతానికి గంట ప్రయాణ దూరంలోనే దాడులు జరిగాయి. అందుబాటులో ఉన్న విమానమెక్కి వారు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. అప్పుడు కానీ నా మనస్సు కుదుటపడలేదు’ అని మొయిన్ తెలిపాడు. మొయిన్ అలీ తాత పీఓకేలోని మిర్పూర్‌కు చెందిన వారు. ఆయన చిన్నతనంలోనే బ్రిటన్ వెళ్లి స్థిరపడ్డారు. ఓ బ్రిటిష్ మహిళను మొయిన్ తాత వివాహం చేసుకున్నారు. బర్మింగ్‌హామ్‌లో మొయిన్ అలీ జన్మించాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	13	3	10	0	6	-0.701
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

బియ్యం ఉత్పత్తిలో.. సస్యశ్యామల భారతం



- చైనాను దాటి.. భారత్ రికార్డు
- 14.9 కోట్ల టన్నులతో ముందంజ
- 2వ స్థానంలో చైనా.. 14.46 కోట్ల టన్నులు
- గోధుమ ఉత్పత్తిలో భారత్‌కు రెండో స్థానం
- పడిపోతున్న నూనె గింజల ఉత్పత్తి

(సెంట్రల్ డెస్క్)

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోంది! గత ఏడాది(2024-25) మూడు సీజన్లలో-- రబీ, ఖరీఫ్, జైద్‌లో వరి దిగుబడిలో.. బియ్యం ఉత్పత్తిలో ముందంజలో నిలిచింది. ఇప్పటి దాకా బియ్యం ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న చైనాను వెనక్కి తోసి గతేడాది 14.9 కోట్ల టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేసింది. చైనా 14.46 కోట్ల టన్నులకు పరిమితమైందని అమెరికా వ్యవసాయ శాఖ(యూఎస్‌డీఏ) గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ భారత్ 14.8 కోట్ల టన్నుల మేర ఉత్పత్తి సాధించనుందని, చైనా కొంత మెరుగుదలతో 14.52 కోట్ల టన్నులు ఉత్పత్తి చేయనుందని అంచనా. భారత్ ఈ ఘనత సాధించడంలో రాష్ట్రాల పాత్ర కీలకంగా ఉందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. భారతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల కృషి కూడా ఎంతో ఉందంటున్నారు. 2023-24తో పోలిస్తే.. గతేడాది పంట విస్తీర్ణం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మూడు సీజన్లలో కలిపి 2023-24లో వరి విస్తీర్ణం 4.78 కోట్ల హెక్టార్లుగా ఉండగా.. 2024-25లో అది మరో 5.1 కోట్ల హెక్టార్ల మేర పెరిగింది. జైద్ సీజన్‌లో పంట దిగుబడి ఏకంగా కోటి టన్నులకు చేరుకోవడం కూడా దోహదపడినట్లు నిపుణులంటున్నారు.

రాష్ట్రాల పథకాలతో ఊతం

ఒకప్పుడు వరి పంటలో వాయవ్య రాష్ట్రాలు ముందంజలో ఉండేవి. అయితే, గడిచిన పదేళ్లలో తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసాల్లో వరి సాగు విస్తీర్ణం, ఉత్పత్తి బాగా పెరిగింది. వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు సాగుకు చేస్తున్న సాయం కూడా భారత్ వరి దిగుబడిలో అగ్రస్థానంలో నిలవడానికి కారణమైందని నిపుణులు వివరిస్తున్నారు. 2014-15తో పోలిస్తే.. 2024-25 వరకు దేశంలో వరి దిగుబడి దాదాపు 4.5 కోట్ల టన్నుల మేర పెరగడం గమనార్హం.!

దేశంలో వరి ఉత్పత్తి

సంవత్సరం	దిగుబడి (కోట్ల టన్నుల్లో)
2015-16	10.44
2016-17	10.97
2017-18	11.27
2018-19	11.64
2019-20	11.88
2020-21	12.43
2021-22	12.94
2022-23	13.57
2023-24	13.78
2024-25	14.90

గోధుమల దిగుబడిలోనూ..

గోధుమల దిగుబడిలోనూ భారత్ దూసుకుపోతోంది. 2014-15లో 8.65 కోట్ల టన్నులు కాగా.. 2024-25లో అది 11.7 కోట్ల టన్నులకు చేరుకుంది. గోధుమ ఉత్పత్తిలో చైనా 14.2 కోట్ల టన్నులతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానాన్ని ఆక్రమించింది. పలు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ పురోగతిని సాధిస్తున్నా.. నూనెగింజల ఉత్పత్తి స్వల్పంగా పడిపోయింది.

భారత్ ధర్మసత్రం కాదు!

ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బందులు.. శరణార్థులపై సుప్రీం వ్యాఖ్య

- ఆశ్రయం కోరిన శ్రీలంక జాతీయుడి పిటిషన్ తిరస్కరణ



న్యూఢిల్లీ, మే 19: భారత్‌లో ఆశ్రయం కోరుతూ ఓ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ధర్మశాల (ఉచిత సత్రం) కాదని, ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో దేశం ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంది. అసలు ఇక్కడ స్థిరపడేందుకు మీకేం హక్కు ఉందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఎల్‌టీటీఈతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో 2015లో ఒక శ్రీలంక జాతీయుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. 2018లో ట్రయల్ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద అతన్ని దోషిగా తేల్చి, 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే 2022లో అతను మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. అయితే శిక్ష పూర్తయిన వెంటనే దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, తిరిగి తమ దేశానికి వెళ్తే తన ప్రాణాలకు ముప్పు అని వాదించాడు. అంతేగాక తన భార్య, పిల్లలు కూడా భారత్‌లోనే స్థిరపడ్డారని పేర్కొన్నాడు. దాదాపు మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, బహిష్కరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, తనకు ఇక్కడే ఆశ్రయం అవకాశం కల్పించాలని పిటిషనర్ అయిన శ్రీలంక తమిళుడు అభ్యర్థించాడు. పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ జరిపింది. 'ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శరణార్థులందరికీ భారత్ ఆశ్రయం ఇవ్వాలా? మేం ఇప్పటికే 140 కోట్ల మంది జనాభాతో ఇబ్బంది పడుతున్నాం. విదేశీ శరణార్థులను ఆశ్రయించేందుకు ఇదేమీ ధర్మశాల కాదు' అని జస్టిస్ దత్తా అన్నారు. రాజ్యాంగంలోని 19, 21 అధికరణలను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషన్ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషనర్‌ను చట్టప్రకారమే కస్టడీలోకి తీసుకున్నారని, అతని నిర్బంధం ఆర్టికల్ 21ను ఉల్లంఘించ లేదని, అదేవిధంగా ఆర్టికల్ 19 అనేది భారత్ పౌరులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అసలు ఇక్కడ స్థిరపడేందుకు మీకేం హక్కు ఉందని కోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. పిటిషనర్ శరణార్థి అని, శ్రీలంక వెళ్తే అతని ప్రాణాలకు ప్రమాదమని న్యాయవాది వాదించగా.. అయితే వేరే దేశానికి వెళ్లండని కోర్టు పేర్కొంది.

చిత్రజ్యోతి

SINCE 1965

సూర్య కొత్త సినిమా ఆరంభం



తెలుగునాట సూర్యకు ఉండే ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'గజని', 'సింగం', 'యముడు' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇప్పటి వరకు డబ్బింగ్ చిత్రాలతోనే అలరించిన సూర్య ఇప్పుడు నేరుగా తెలుగు చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించబోతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న చిత్రంలో సూర్య నటిస్తున్నారు. ఇది సూర్యకు 46వ చిత్రం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందించనున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. మొత్తానికి తెలుగు సినిమా చేయాలన్న సూర్య కోరిక ఇన్నాళ్లకు నెరవేరింది.



జూనియర్ తొలి గీతం

కర్ణాటక మాజీ మంత్రి, పారిశ్రామికవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. వారాహి చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. జూన్ 18న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కాబోతోంది. బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం నుంచి 'లెట్స్ లివ్ దిస్ మూమెంట్' అనే తొలి పాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో దేవీశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ 'ఈ వేడుక చూస్తుంటే ఒక లైవ్ కాన్సర్ట్ చేస్తున్న ఆనందం కలిగింది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. శ్రీరమణి అద్భుతమైన సాహిత్యం రాశారు' అని అన్నారు. హీరో కిరీటి రెడ్డి మాట్లాడుతూ 'నా తొలి సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించడం చాలా ఆనందంగా ఉంది. శ్రీలీల, జెనీలియాతో కలసి పనిచేయడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను' అని అన్నారు. 'ఈ సినిమాలోని ప్రతి పాట ప్రత్యేకమైనదే. మరిన్ని అద్భుతమైన పాటలు రాబోతున్నాయి' అని చిత్ర దర్శకుడు రాధాకృష్ణ తెలిపారు. కాగా, ఈ సినిమాతో జెనీలియా మళ్లీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. అలాగే కన్నడ నటుడు డా.రవిచంద్రన్ ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.

నా కెరీర్‌లో నిలిచిపోయే క్యారెక్టర్

"భైరవం' సినిమాలో గజపతి వర్మ లాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు చేయలేదు. ఈ సినిమా నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది' అని అన్నారు హీరో మంచు మనోజ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'భైరవం'. డా.జయంతిలాల్ గడా సమర్పణలో కె.కె. రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే మంగళవారం మంచు మనోజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ "భైరవం' సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌కి ప్రాధాన్యం ఉంటుంది. ఎవరి స్ర్కీన్ స్పేస్ వారిదే. ప్రతి ఒక్కరు అద్భుతంగా నటించారు. శ్రీ చరణ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. మంగళవారం ఒక ప్రత్యేక పాట విడుదల కాబోతోంది. మా నాన్నగారి జీవన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. నిజాయితీగా ఉండడం ఆయన దగ్గరే చూసి నేర్చుకున్నాను. నాకు మా ఫాదరే హీరో. ఈ పుట్టినరోజు నుంచి నాకు కొత్త జన్మ మొదలు కాబోతోంది. భవిష్యత్తులో కొత్త రకం సినిమాలు చేయాలనుంది. అలాగే పిల్లల కోసం ఒక సినిమా తీయాలనుంది. ఎప్పుడైనా అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను' అని అన్నారు.



శివుడిని శివయ్యా అని పిలిస్తే రాడు

'భైరవం' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో ఎన్నో జరిగాయి. ఎన్నో చూశాను. కట్టుబట్టలతో రోడ్డు మీదకు తెచ్చారు. నేను ఊరు వెళ్లొచ్చేసరికి నా పిల్లల వస్తువులతో సహా అన్నీ రోడ్డు మీద పెట్టారు. బయటకు వెళ్లడానికి కార్లు లేకుండా తీసుకెళ్లిపోయారు. కానీ.. నాకు ఆ శివుడు అభిమానుల రూపంలో వచ్చి 20 కార్లు పెట్టించాడు. శివుడిని శివయ్యా... అని పిలిస్తే రాడు. ఆయన్ని మనసారా తలచుకుంటే మా దర్శకుడి రూపంలోనో.. మీ అందరి రూపంలోనో వస్తాడు' అని అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంచు విష్ణుని ఉద్దేశించే మనోజ్ ఇలా వ్యంగ్యంగా మాట్లాడి ఉంటారని అభిమానుల మధ్య చర్చ సాగుతోంది.



సిరివెన్నెల పాటలను బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నా...

త్రివిక్రమ్

దివంగత గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని దర్శకుడు త్రివిక్రమ్ ఎంతలా ఆదరిస్తారో అందరికీ తెలిసిందే. సందర్భం వచ్చినప్పుడల్లా తనకు అయనపై ఉన్న ప్రేమను చాటుకుంటుంటారు త్రివిక్రమ్. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీతారామశాస్త్రి గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. "తాను రాసిన పాటలు కలకాలం నిలిచిపోవాలనే తపనతో ఆయన పాటలు రాసేవారు. ఆయన రాసిన పాటలకు కాలంతో సంబంధం లేకుండా ఇప్పటికీ ఆదరణ దక్కుతోంది. 'జల్సా' సినిమాలో 'ఛలోరే ఛలోరే' పాటను 34 పేజీల్లో రాశారు. కానీ సినిమాలో రెండు పేజీలు కూడా వాడలేదు. నిజానికి మాటలు రాయడం కంటే పాటలు రాయడం చాలా కష్టం. నేను ఆరు పాటలు రాశాను. తెలియకుండానే మొదటి పాటలోని పదాలు ఆరో పాటలో రిపీట్ అయ్యాయి. కొన్ని వేల పాటలు రాశారాయన. అందులో రెండు, మూడు వేల పాటలను సినిమాల్లో వాడనేలేదు. వాటిని ఎలా బయటకి తీసుకురావాలా అని ప్రయత్నిస్తున్నాను. అవి బయటకొస్తే.. రాబోయే తరం గీత రచయితలకు ఎంతగానో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు.

ఆగస్టు 29న విశాల్ - సాయి ధన్షిక వివాహం



కోలీవుడ్‌లోని మోస్ట్ బ్యాచిలర్ హీరోల్లో ఒకరైన విశాల్ త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. హీరోయిన్ సాయి ధన్షికను ఆయన పెళ్లి చేసుకోనున్నారు. సాయి ధన్షిక ప్రధాన పాత్రను పోషించిన 'యోగి దా' చిత్ర మూవీ ఆడియో రిలీజ్ వేడుక సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విశాల్ అతిథిగా హాజరయ్యారు. ఇందులో తమ పెళ్లి విషయాన్ని వారు అధికారికంగా వెల్లడించారు. ఆగస్టు 29వ తేదీన వివాహం చేసుకోబోతున్నట్టు వారు వేదికపై నుంచి వెల్లడించారు. కాగా, నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన తర్వాత వీరిద్దరూ పెళ్లి పీటలెక్కనున్నారనే వార్తలు జోరుగా వినిపించాయి. ఈ నేపథ్యంలో వారు తమ పెళ్లి వార్తను ముందుగానే ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బోల్డ్ కాశీ పోరాటం



తమిళ హీరో విజయ్ సేతుపతి నటించిన చిత్రం 'ఏస్'. అరుముగ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. ఈ నెల 23న సినిమా తమిళ్‌లో, తెలుగులో విడుదలవుతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని పద్మినీ సినిమాస్ బ్యానర్‌పై బి.శివప్రసాద్ విడుదల చేయనున్నారు. సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో బోల్డ్ కాశీగా కనిపించనున్నారు విజయ్. ఆయన దేనికోసం పోరాటం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా ఉండబోతోంది. అదరగొట్టే యాక్షన్‌తో పాటు కడుపుబ్బా నవ్వించే కామెడీ సన్నివేశాలు, విజువల్స్ సంగీతం సినిమాకు ప్రధానార్షణగా నిలవనున్నాయి.

నటుడు భరత్‌కు మాతృవియోగం

- గుండెపోటుతో తల్లి మృతి



నటుడు బి.భరత్ (మాస్టర్ భరత్) ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి బి.కమల హాసిని (53) గుండెపోటుతో చెన్నై, తేనాంపేటలోని స్వగృహంలో మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భోజనం చేసిన తర్వాత టీవీ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా ఆమెకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి తుదిశ్వాస విడిచినట్టు నటుడు భరత్ మేనేజర్ ప్రకాశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆమె అంత్యక్రియలు తేనాంపేటలోని శ్మశానవాటికలో సోమవారం పూర్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్... ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్న విషయం తెల్సిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

రెండో విడతలో హజ్‌కు 906 మంది


జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హజ్ యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఏపీ నుంచి రెండవ విడతలో 906 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కేషన్ నుంచి సోమ, మంగళవారాల్లో మూడు విమానాల్లో జెడ్డాకు వెళుతున్నారు. వీరి కోసం ఏపీ మైనార్టీ మంత్రిత్వశాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లకడీకాపూల్‌లోని షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, హజ్ కమిటీ సభ్యులు తదితరులు జెండా ఊపి రెండో విడత హజ్‌యాత్రను ప్రారంభించారు. యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏపీ నుంచి మొత్తం 1630 మంది హజ్ యాత్రకు వెళ్తున్నట్టు తెలిపారు.

'సీబీఎన్ పాత్‌వేస్ టు సక్సెస్' పుస్తకావిష్కరణ


సీబీఎన్ పాత్ వేస్ టూ సక్సెస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాబు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 75 ఏళ్ల జీవిత ప్రస్థానాన్ని వివరిస్తూ ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థి డి.రాజేశ్ కుమార్, రీచ్ ఎయిట్స్ ఈటీ అండ్ సీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డీపీ రాజు సంయుక్తంగా రాసిన 'సీబీఎన్ పాత్‌వేస్ టు సక్సెస్' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. సచివాలయంలో సోమవారం ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకంలో సీఎం చంద్రబాబు జీవితాంశాలు, విజన్, విజయసూత్రాలు, అభివృద్ధి విధానాలు వంటి అంశాలను పొందుపరిచారు. కార్యక్రమంలో వీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బన్ బాబు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ వేగవంతం చేయండి

- జన్యుపరమైన సమస్యలపై అవగాహన కల్పించండి
- తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ అనీమియా చికిత్సా పద్ధతులపై శిక్షణ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్


విజయవాడలో హిమోఫీలియాపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సత్యకుమార్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): 'తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వ్యాధుల స్క్రీనింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి. జన్యుపరంగా వచ్చే ఈ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి' అని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు. రక్తసంబంధిత దీర్ఘకాలిక సమస్యలపై విజయవాడలో నేషనల్ హెల్త్ మిషన్, హిమోఫీలియా సొసైటీ, రెడ్ క్రాస్ సొసైటీలు సంయుక్తంగా వైద్యులకు అవగాహన కల్పిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. 'రాష్ట్రంలో దాదాపు 1,900 మంది హిమోఫీలియా బాధితులు ఉన్నారు. దాదాపు 2,100 మంది తలసీమియాతో, ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. ఇవి జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న వ్యాధులు. వీటికి మందులు జీవితాంతం వాడుతూనే ఉండాలి. వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. రాష్ట్రంలోని ఐదు ఐసీహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు అందిస్తోంది. ఈ వ్యాధిగ్రస్థులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది' అని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సికిల్ సెల్ అనీమియాతో ప్రాణాలను కోల్పోకూడదన్నారు. వ్యాధులపై అవగాహన కోసం ముద్రించిన పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఏపీశాక్స్ ఏపీడీ కామేశ్వర ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ ప్రసన్న, దేవి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, హిమోఫీలియా సొసైటీ కార్యదర్శి ఎన్‌బీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాల వైసీపీ నేతలపై విచారణ: సత్యకుమార్

వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడిన నేతలు ఇప్పటికీ ఆక్రమణలకు పాల్పడుతున్నారని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'వారధి' కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. వారధికి భూ కబ్జాలు, అక్రమాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై విచారణకు ఆదేశిస్తున్నామని చెప్పారు.

నేడు కేబినెట్ భేటీ.. ఏడాది పాలనపై కీలక చర్చ

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో జరగనుంది. వచ్చే జూన్ 12 నాటికి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తవుతుంది. దానిపై ప్రధానమైన చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాదిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామిక వృద్ధిపై పెద్ద ఎత్తున చేపట్టాల్సిన ప్రచారం, ముస్ముందు అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాలపై కేలండర్ రూపకల్పనపైనా చర్చించనున్నారు. ఎస్ఐపీబీ 6వ సమావేశంలో ఆమోదించిన 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్‌లో ఆమోదం తెలుపనున్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులపైనా చర్చించనున్నారు. ఉద్యోగుల బదిలీలు, పలు సంస్థలకు భూకేటాయింపులపైనా చర్చ జరిగే అవకాశం ఉంది.

డిగ్రీలో క్వాంటమ్ కంప్యూటింగ్

- ఒక పేపర్ తప్పనిసరిగా అమలు.. ఉన్నత విద్యామండలి చైర్మన్ వెల్లడి

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): డిగ్రీలో క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షను ఉన్నత విద్యామండలి తప్పనిసరి చేసింది. 14 నుంచి 16 క్రెడిట్లతో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఒక పేపర్ తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ఆదేశించారు. అదే విధంగా ఒకే పెద్ద సబ్జెక్టు(సింగిల్ మేజర్) ఉన్న డిగ్రీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండు పెద్ద సబ్జెక్టులు ప్రవేశ పెట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. సోమవారం యూనివర్సిటీల ఉపకులపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. సంప్రదాయ కోర్సుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌తోపాటు ఏఐ అండ్ ఎంఎల్ కూడా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దీనిపై బోధనా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. మోడల్ అకడమిక్ క్యాలెండర్‌ను అన్ని యూనివర్సిటీలు తప్పనిసరిగా అమలుచేయాలని కోరారు.

రాష్ట్రంలో బుద్ధిస్ట్ సర్క్యూట్స్ అభివృద్ధికి కమిటీలు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): అమరావతి, విశాఖపట్నంలో బుద్ధిస్ట్ సర్క్యూట్స్ అభివృద్ధి, వాటికి ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం కమిటీలను నియమించింది. పర్యాటక పాలసీ 2024-29లో భాగంగా రాష్ట్రంలో మూడు చోట్ల బుద్ధిస్ట్ సర్క్యూట్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. విశాఖపట్నం సర్క్యూట్‌లో శాలిహుండం, బావికొండ, తొట్లకొండ, బొజ్జనకొండ, ఆదుర్రు ప్రాంతాలు, అమరావతి సర్క్యూట్‌లో గుంటుపల్లి, ఉండవల్లి, అమరావతి, ఘంటశాల, నాగార్జునకొండ ప్రాంతాలను అభివృద్ధి చేయనుంది. ఈ రెండు సర్క్యూట్‌లకు ప్రత్యేక కమిటీలను నియమిస్తూ పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజేయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బేబీ కిట్స్ పథకం పునఃప్రారంభం

- ఒక్కో కిట్‌లో రూ.1,410 విలువైన వస్తువులు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో పుట్టిన చిన్నారుల కోసం బేబీ కిట్స్ పథకాన్ని ప్రభుత్వం పునఃప్రారంభించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కిట్‌లో 19 రకాల వస్తువులను బాలింతలకు అందించనున్నారు. ఒక్కో కిట్‌కు రూ.1,410 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. బేబి కిట్స్ పథకం కోసం ప్రభుత్వం రూ.51 కోట్ల నిధులను కేటాయించింది. 2014-19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చిన్నారుల కోసం బేబీ కిట్స్ పథకాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని విజయవంతంగా నిర్వర్తించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బేబీ కిట్స్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. అప్పటికే కొనుగోలు చేసిన లక్షల కిట్‌లను వృథా చేసింది. దీంతో చిన్నారులకు అవసరమైన సబ్బులు, పౌడర్లు, టవల్స్, ఆయిల్స్ మొత్తం బాలింతలు కొనుగోలు చేసుకునేవారు. వీటి కోసం పేద కుటుంబాలు దాదాపు రూ.2 వేలు ఖర్చు చేసేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బేబీ కిట్స్ పథకాన్ని పునఃప్రారంభించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. అందులో భాగంగానే సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన బాలింతలందరికీ ఈ కిట్‌లను అందించనున్నారు.

నాటి తప్పులకు.. నేడు శిక్ష!

ఉపాధి పథకంలో వైసీపీ ప్రభుత్వం పాపాలు

మెటీరియల్ నిధుల కోసం ఒత్తిడి చేసి దొంగ మస్టర్లు



- ఇప్పుడు సోషల్ ఆడిట్ తనిఖీలతో సిబ్బంది విలవిల
- బాధ్యులైన వందల మందిపై వేటు.. భారీగా రికవరీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ సర్కార్ ఉపాధి హామీ పథకం నిర్వహణలో చేసిన తప్పిదాలు ఇప్పుడు ఉపాధి సిబ్బంది ఉద్యోగాలకు చేటు తెస్తున్నాయి. మెటీరియల్ నిధుల కోసం సిబ్బందిపై ఒత్తిడి చేసి దొంగ మస్టర్లు వేయించిన ఫలితంగా ఇప్పుడు వారు ఉద్యోగాలు పోగొట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. సోషల్ ఆడిట్ తనిఖీల్లో మస్టర్లకు సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో జరిగినట్లు కనిపించకపోవడంతో ఆ రికవరీని సిబ్బందిపై విధిస్తున్నారు. చెల్లించని కొంతమందిపై పోలీసు కేసులు కూడా నమోదవుతున్నాయి. ఒక్కో జిల్లాలో వందల మంది సిబ్బంది సస్పెండ్ అయి డ్వామా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో విచారణకు ఆదేశిస్తున్నారు. పత్రికల్లో కథనాలు, ఫిర్యాదుల మోతతో ఉపాధి అధికారులు తప్పనిసరిగా విచారణ చేపట్టి, రికవరీలు చేయాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది ఇరుక్కుపోతున్నారు. అప్పటి ప్రభుత్వం తమపై ఒత్తిడి తెచ్చి మస్టర్లు వేయించిందని, ఒత్తిడి చేసిన అధికారులు ఇప్పుడు లేకపోవడం, ఒకవేళ ఉన్నా నిస్సహాయ స్థితిలో ఉండటంతో తాము బలవుతున్నామని వాపోతున్నారు.

దొంగ మస్టర్లు వేయాలంటూ ఒత్తిళ్లు

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా జరిగిన దాఖలాల్లేవు. మండల కార్యాలయాల్లో ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ముందు కూర్చొని మస్టర్లు నమోదు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి టార్గెట్లు పెట్టి మరీ మస్టర్లు వేయించారు. కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు రాబట్టుకునేందుకు లేబర్ కాంపోనెంట్ పెంచుకోవాలనే ప్రయత్నంలో భాగంగా దొంగ మస్టర్లు వేయించారు. దీంతో కూలీలు పనులకు వెళ్లకపోయినా వేతనాలు పడ్డాయి. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత కూడా అదే సిబ్బంది కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా గతంలానే మస్టర్లు వేయాల్సిన పరిస్థితి! దొంగ మస్టర్లు వేయకపోతే సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పట్లో వేసి, ఇప్పుడు ఎందుకు వేయరని నిలదీస్తున్న, గొడవకు దిగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పథకంలో లొసుగులు లేకుండా కట్టడి చేసేందుకు ఇప్పటికే సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను మార్చడంతో పాటు ఉపాధి పథకానికి చీఫ్ విజిలెన్స్ అధికారిగా పోలీసు శాఖకు చెందిన అదనపు ఎస్పీని నియమించారు.

సోషల్ ఆడిట్ తనిఖీలతో విలవిల

గత ప్రభుత్వంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందాలు ఇటీవల తనిఖీలు చేపట్టాయి. పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ ఆదేశించారు. 2023-24, 2024-25ల్లో చేపట్టిన పనులకు సంబంధించి తనిఖీలు చేపట్టినప్పుడు.. ఫీల్డ్‌లో పనులు చేసిన ఆనవాళ్లు లేవు. దీంతో అప్పట్లో శ్రామికులకు చెల్లించిన మొత్తాన్ని ఉపాధి సిబ్బందిపై రికవరీ వేస్తున్నారు. ఒక్కో మండలంలో రూ.కోట్ల రికవరీలను సోషల్ ఆడిట్ మండల సభలో తేలుస్తున్నారు. దీంతో బాధ్యులైన సిబ్బందికి రికవరీలు వేయడం, ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. అప్పట్లో దొంగ మస్టర్లు చేయాలని ఒత్తిడి తెచ్చిన అధికారి గాని, వైసీపీ నేతలు గానీ ఇప్పుడు మొహం చాటేస్తున్నారు.

డ్వామా, కమిషనరేట్ కార్యాలయం చుట్టూ సిబ్బంది

ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బంది డ్వామా, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు ఫైనల్ కావడంతో జిల్లా విజిలెన్స్ అధికారులు మరోసారి ఆ పనులపై తనిఖీలకు ఆదేశించకుండా రికవరీలు విధిస్తున్నారు. దీంతో సిబ్బంది ఉద్యోగాలు కాపాడుకునేందుకు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. అప్పటి సర్కారే తమకు ఈదుస్థితి తీసుకొచ్చిందని నిందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం అర్థం చేసుకుని, ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డామని, తమకు ఉద్యోగాలు తిరిగివ్వాలని కమిషనర్ కృష్ణతేజ, ఆయా డ్వామా పీడీలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో కొలిక్కిరాని చర్చలు

- మీడియం, విద్యార్థుల నిష్పత్తిపై సంఘాల పట్టు
- రేపు డీఈవో ఆఫీసుల ముట్టడి యథాతథం
- సంఘాల ప్రతినిధులతో అధికారుల సుదీర్ఘ చర్చలు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యా శాఖ అధికారులు సోమవారం నిర్వహించిన చర్చలు కొలిక్కిరాలేదు. సంఘాల ప్రతినిధులు చేసిన డిమాండ్లపై అధికారుల నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడంతో తమ కార్యాచరణ యథావిధిగా కొనసాగుతుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. బుధవారం ఉమ్మడి 13 జిల్లాల్లోని జిల్లా విద్యాశాఖ అధికారుల(డీఈవో) కార్యాలయాల ముట్టడి కొనసాగుతుందని స్పష్టంచేసింది. కాగా, ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో 117కు ప్రత్యామ్నాయంపై సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. టీచర్ల బదిలీలకు ప్రభుత్వం సన్నద్ధమైన సమయంలో వాటిలో అనేక మార్పులు కోరుతూ ఈ నెల 16న అధికారులకు ఐక్య వేదిక నోటీసు ఇచ్చింది. దశలవారీగా ఉద్యమం చేస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి. విజయరామరాజు సోమవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఐక్య వేదిక ప్రతినిధులతో చర్చలు జరిపారు. చాలా అంశాల్లో సానుకూలత వచ్చినా కొన్ని అంశాల్లో డిమాండ్లు పరిష్కరించకపోవడంతో తమ కార్యాచరణ కొనసాగిస్తామని ఐక్య వేదిక ప్రతినిధులు తెలిపారు. ఆంగ్లంతో పాటు సమాంతరంగా తెలుగు మీడియం, ఇతర మీడియంలను కొనసాగించాలని, ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఇవ్వాలని ప్రతినిధులు పట్టుబట్టారు. మీడియం గత కొన్నేళ్లుగా కొనసాగుతోందని, దానిని ఇప్పుడు మార్చలేమని అధికారులు స్పష్టంచేశారు. పైగా, అది ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమని తెలిపారు. అలాగే, ఉన్నత పాఠశాలల్లో 53 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఇస్తున్నారని, దానికి బదులుగా 45 మంది దాటితే రెండో సెక్షన్ ఇవ్వాలని కోరగా అది సాధ్యంకాదని అధికారులు తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా మొత్తం ఎస్జీటీలనే నియమించాలని, ఫౌండేషనల్ స్కూల్స్ విధానం రద్దు చేయాలని ఐక్యవేదిక కోరగా.. దానిపైనా సానుకూల నిర్ణయం రాలేదు. ఫౌండేషనల్ స్కూళ్లలో టీచర్లు, విద్యార్థుల మధ్య నిష్పత్తిని 1:20కి తగ్గిస్తామని, స్టడీ లీవ్‌లో ఉన్నవారి పోస్టులను ఖాళీలుగా చూపబోమని, బదిలీల్లో పోస్టులు బ్లాక్ చేయబోమని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే 1400 మంది ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పదోన్నతి కల్పిస్తామని, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 120 మంది దాటితే అదనపు ఎస్జీటీని ఇస్తామని అధికారులు చెప్పారు. జూలైలో ఎంఈవోల బదిలీలు చేపడతామని హామీ ఇచ్చినట్టు సమాచారం. అయినప్పటికీ.. సమాంతర మీడియం, 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఇవ్వడంపై సంఘాలు గట్టిగా పట్టుబట్టాయి. కనీసం మండలానికి ఒకటైనా తెలుగు మీడియం పాఠశాల పెట్టాలని కోరాయి. అలాగే సమస్యలపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చలకు సంఘాలు డిమాండ్ చేశాయి. వీటిపై అధికారులు ఎలాంటి హామీ ఇవ్వలేదు.


ఎమ్మెల్యేలు, అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల

కాల్వల పనుల పర్యవేక్షణకు డ్రోన్లు

- రూ.10 లక్షలలోపు పనులు నీటి సంఘాలకే: మంత్రి నిమ్మల

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా సాగునీటి కాలవలు, ప్రాజెక్టు యాజమాన్య నిర్వహణ పనుల పర్యవేక్షణకు డ్రోన్‌లను వినియోగిస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. రూ.పది లక్షలలోపు పనులను నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్యలతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విజయవాడ జల వనరుల శాఖ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రాజెక్టులు, పంట కాలువల యాజమాన్య నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.344.39 కోట్లు విడుదల చేశారని చెప్పారు. ఈ నెలాఖరులోగా పది లక్షల రూపాయల్లోపు పనులను సాగునీటి సంఘాలు చేపట్టవచ్చని తెలిపారు. డ్రోన్‌లతో పర్యవేక్షణ, గుర్రపు డెక్క తొలగించడం, మందులు చల్లడం వంటి పనులు చేపట్టాలన్నారు. గతంలో వైసీపీ హయాంలో ప్రాజెక్టుల సాధారణ యాజమాన్య నిర్వహణకూ నిధులు కేటాయించలేదని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో జల వనరుల శాఖ విధ్వంసానికి గురైందని.. ఇప్పుడిప్పుడే సాగునీటి రంగాన్ని గాడిలో పెడుతున్నామని తెలిపారు.

ప్రధాన ప్రాజెక్టుల కోసం భూసేకరణ

- డిప్యూటీ కలెక్టర్లకు జల వనరుల శాఖ ఆదేశం

రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల భూసేకరణకు జల వనరుల శాఖ ఆమోదం తెలిపింది. భూసేకరణ చేపట్టాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఈ ప్రాజెక్టుల జాబితాలో పోలవరం కుడి కాలువ యూనిట్-1, 2, పోలవరం ఎడమ కాలువ యూనిట్-1, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు (చింతూరు), పులిచింతల, వెలిగొండ, శ్రీశైలం, తెలుగుగంగ, వంశధార, తోటపల్లి బ్యారేజీ, హంద్రీ-నీవా యూనిట్-2, 1, గాలేరు-నగరి యూనిట్-1, సోమశిల, పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొదలైనవి ఉన్నాయి.

జల్‌జీవన్ మిషన్ పనుల తనిఖీలకు అధికారులు

- 100 బృందాలు నియామకం.. ఆరు జిల్లాల్లో తనిఖీలు

రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో గత ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను కేంద్ర నోడల్ అధికారులు తనిఖీ చేయనున్నారు. ఈమేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ 100 మంది నోడల్ అధికారులను నియమిస్తూ ఆదేశాలిచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంలోని అన్నమయ్య, కాకినాడ, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల్లో జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టులను తనిఖీ చేయనున్నారు.

పీటీడీ ఉద్యోగులకు ఏఏఎస్ అమలుపై మార్గదర్శకాలు

విజయవాడ(బస్‌స్టేషన్), మే 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణాశాఖ (పీటీడీ)ఉద్యోగులకు ఆరు సంవత్సరాల సేవకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలుపై రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సోమవారం కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది. ఉద్యోగులు ఒకే పదవిలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత కూడా పదోన్నతులకు నోచుకోకపోతే వారిని ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉద్యోగికి జోన్‌లో అర్హతగల పదోన్నతి లేకపోయినా, ఆసక్తి చూపకపోయినా.. తనకన్నా జూనియర్లు పదోన్నతి పొందని పరిస్థితుల్లో అర్హతలు ఉన్న ఉద్యోగికి ఏఏఎస్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇంకా పలు అంశాలపై స్పష్టత ఇస్తూ చీఫ్ పర్సనల్ మేనేజర్, బోర్డు సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

బెంగళూరులో వర్ష బీభత్సం


కోరమంగళలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నీటమునిగిన వాహనాలు


కోరమంగళలో రోడ్డుపై బస్సును నెట్టుతున్న స్థానికులు

నగరంలో ఎడతెరిపి లేకుండా వాన

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- పలు కాలనీల్లో ఇళ్లలోకి చేరిన నీరు

బెంగళూరు, మే 19(ఆంధ్రజ్యోతి)/ముంబై: కర్ణాటక రాజధాని బెంగళూరులో వర్ష బీభత్సం సృష్టించింది. నగరవ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. నగరంలో 10.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు లోతట్టు ప్రాంతాలతో పాటు వాహనాలు నీట మునిగాయి. రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై నీళ్ల చెరువులను తలపించాయి. హెణ్ణూరు ప్రాంతంలోని ఓ అనాథాశ్రమంలోకి వర్షపు నీరు చేరడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం దాకా మంచాల పైనుంచి దిగే పరిస్థితి లేదు. కేఆర్ పురం పరిధిలోని సాయి లేఅవుట్‌లో ప్రజలు రెండో రోజూ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. కాలనీలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. స్థానిక ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఎక్స్‌కవేటర్‌పై ఎక్కి వివిధ ప్రాంతాలను సందర్శించారు. డ్రోన్‌ల ద్వారా పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలు కొనసాగించారు. రబ్బరు బోట్లు ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యలహంకలోని అట్టూరు ప్రాంతంలో విశ్వనాథ ఆలయం నీట మునిగింది.

గోడ కూలి మహిళ మృతి

మహదేవపురలోని చన్నసంద్ర వద్ద రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న శశికళ(35) అనే మహిళపై గోడ కూలిపడటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. కోరమంగళలోని అపార్ట్‌మెంట్‌లలోకి నీరు చేరింది. ఈ ప్రాంతంలో పలు ఇళ్లలోకి నీరు చేరి, ఎలక్ట్రికల్ వస్తువులు పాడైపోయాయి. నగరవ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం మరోసారి వర్షం కురిసింది. ఈ ప్రభావానికి ఎయిర్‌పోర్ట్ రోడ్డు ప్యాలెస్ గ్రౌండ్స్ వద్ద ఒక భారీ చెట్టు కూలి కారుపై పడింది.

మహారాష్ట్రలో ఈనెల 25 వరకు వర్షాలు

మహారాష్ట్రలోని చాలా ప్రాంతాల్లో ఉరుములతో భారీ వర్షాలు కొనసాగాయి. రోజువారీ జనజీవనం స్తంభించడంతో పాటు రవాణా నిలిచిపోయింది. షిర్డీలోనూ భారీ వర్షాలు పడ్డాయి. రానున్న రోజుల్లో తమిళనాడు, కేరళ, కర్ణాటక, మధ్య రీజియన్లకు ఈ వర్షాలు విస్తరించనున్నాయని ఐఎండీ శాస్త్రవేత్త అఖిల్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు మహారాష్ట్రలో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది.

నేడు, రేపు వర్షాలు


సోమవారం మధ్యాహ్నం నెల్లూరు నగరాన్ని కమ్మేసిన కరిమబ్బులు

విశాఖపట్నం, అమరావతి, మే 19 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన వడగాడ్పులతో అల్లాడిన రాష్ట్ర ప్రజలకు ఊరటనిచ్చేలా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా కోస్తాంధ్రను ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకూ, మధ్యప్రదేశ్ నుంచి మరట్వాడా, కర్ణాటక మీదుగా రాయలసీమ వరకూ వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించాయి. వీటి ప్రభావంతో సముద్రం నుంచి వచ్చే తేమగాలులు, వాయువ్య భారతం నుంచి వీచే పొడిగాలుల కలయికతో రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం ఉదయం ముసురు వాతావరణం నెలకొంది. తర్వాత పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. మంగళ, బుధవారాల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఏయే జిల్లాల్లో....

మంగళవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, ఉభయగోదావరి, కొనసీమ,కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

మరిన్ని ప్రాంతాలకు నైరుతి విస్తరణ

నైరుతి రుతుపవనాల విస్తరణకు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా మారింది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ బంగాళాఖాతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం మధ్య గల మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి.కాగా, ఈనెల 21వ తేదీన కర్ణాటకకు ఆనుకుని అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో 22న తూర్పు మధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడి తర్వాత ఉత్తరంగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. మే 27వ తేదీన కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయి.

గ్రీవెన్స్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

27 ఏళ్లుగా తిరుగుతున్నా..

సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన

ఆక్రమణదారుల నుంచి స్థలాలు ఇప్పించాలని డిమాండ్

ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం

గుంటూరు కలెక్టరేట్‌లో ఘటన.. జీజీహెచ్‌కు తరలింపు

గుంటూరు తూర్పు, మే 19(ఆంధ్రజ్యోతి): 'ఆక్రమణదారుల చెర నుంచి మా స్థలాలను విడిపించాలంటూ 27 ఏళ్లుగా తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక తిరిగే ఓపిక లేదు. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను' అంటూ దోమతోటి బుజ్జి అనే మహిళ గుంటూరు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. పక్కనున్నవారు వారిస్తున్నా.. పట్టించుకోకుండా ఎలుకల మందు తినేయడంతో పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మరో బాధితురాలు జొన్నలగడ్డ జ్యోతి వివరాలు తెలిపారు. '1998లో వసంతరాయపురం వద్ద రెండో వాటర్ ట్యాంకు నిర్మాణానికి, భూసేకరణ కింద మా స్థలాలను ప్రభుత్వం తీసుకుంది. దీనికి పరిహారంగా పెదపలకలూరు సమీప స్వర్ణాంధ్రనగర్ వద్ద 9 మందికి 60 గజాల చొప్పున 540 గజాలను కేటాయించింది. 373, 376, 377 సర్వే నంబర్లలోని ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకునేందుకు, చదును చేసుకునేందుకు వెళ్లగా.. అక్కడే ఉన్న షేక్ మౌలాలి అనే వ్యక్తి అడ్డుకుని, 'ఈ స్థలాలతో మీకు సంబంధం లేదు. మళ్లీ ఇక్కడికి వస్తే చంపేస్తా' అని బెదిరించాడు. దీనిపై ఎమ్మార్వోకు, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మాకు కేటాయించిన స్థలాలను మౌలాలి, అతని కుటుంబ సభ్యులు అమ్మేసుకుంటున్నారు. దీనిపై 27 ఏళ్ల నుంచి తిరుగుతున్నా ఎవరూ న్యాయం చేయలేదు' అని వాపోయారు. ఇప్పటికయినా న్యాయం జరక్కపోతే తాము కూడా ఆత్మహత్యలు చేసుకుంటామని చెప్పారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బుజ్జిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సౌదీ చిత్రహింసల నుంచి విముక్తి

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన అధికారులు

బాధితుడిని ఏపీకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



షేక్ నజీర్

న్యూఢిల్లీ, మే 19(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లి యజమాని చేతిలో చిత్రహింసలకు గురైన నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన షేక్ నజీర్‌కు ఎట్టకేలకు విముక్తి లభించింది!. బాధితుడిని ఏపీకి తీసుకొచ్చేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, ఏపీ ప్రభుత్వ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. కూలిపనులు చేసుకునే నజీర్ ఓ ఏజెంట్ మాటలు నమ్మి గతేడాది డిసెంబరులో రూ.2లక్షలు ఖర్చు చేసి సౌదీకి వెళాడు. అక్కడ ఓ యజమాని వద్ద పనికి కుదిరాడు. అయితే ఆయన పెద్దపెద్ద చెట్లు ఎక్కాలని ఇబ్బంది పెట్టేవాడు. చెట్లు ఎక్కకపోతే చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెడుతుండేవాడు. ఆ బాధను తాళలేని నజీర్ తన తల్లిదండ్రులకు వీడియో రికార్డు చేసి పంపాడు. ఈ విషయంపై.. 'ఈ నరకం భరించలేను.. కాపాడండి!' అనే శీర్షికన గత గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పందించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌ను అప్రమత్తం చేశారు. ఆయన వెంటనే కేంద్ర విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడారు. వారు సౌదీ, అక్కడి భారత ఎంబసీ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి నజీర్ ఎక్కడున్నదీ గుర్తించారు. సోమవారం, సౌదీ అధికారులు నజీర్‌ను భారత రాయబార కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది. అధికారిక ప్రక్రియలన్నీ పూర్తి చేసిన తర్వాత నజీర్‌ను ఏపీకి పంపేందుకు భారత ఎంబసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ తెలిపారు.

మహిళల భద్రతకు 'శక్తి'

- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న 1.52 కోట్ల మంది
- రాష్ట్రంలో164 బృందాలు.. 900 చోట్ల నిఘా
- మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలే: డీజీపీ

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై నేరాలకు పాల్పడిన కేసుల్లో గత పది నెలల్లో 169 మందికి జైలుశిక్షలు పడ్డాయని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ప్రతి మహిళ, బాలిక, చిన్నారికి అత్యంత భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ పని చేస్తోందని సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 164 శక్తి బృందాలు ఏర్పాటు చేసి 900 స్పాట్‌లలో నిఘా విస్తృతం చేశామన్నారు. అధునాతన ఫ్యూచర్లతో రూపొందించిన శక్తియాప్‌ను 1.52 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. 11.6 లక్షల కాల్స్ రాగా, అందులో అత్యవసరంగా స్పందించాల్సిన 34,192 ఫోన్లకు పోలీసులు సకాలంలో స్పందించినట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి 90 శాతం సమస్యలు పరిష్కరించినట్లు, 3,193 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రత కోసం శక్తి బృందాలను మఫ్టీలో ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని, మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాల కట్టడికి 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్' ఐజీ రాజకుమారి నేతృత్వంలో నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. నేరాల నుంచి తప్పించుకునేలా మహిళలకు 12,119 అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈవ్ టీజింగ్, అత్యాచారాలు, హత్యలు, గృహహింస, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు, దాడులు, దూషణలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై చర్య తీసుకున్నట్లు తెలిపారు. మహిళలు, యువతులు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


లోపాలకు చెక్!

(మొదటి పేజీ తరువాయి)

అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ తదితర విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎంవో కార్యదర్శులతో చంద్రబాబు చర్చించారు.

రేషన్ సరుకుల పంపిణీలో 'పశ్చిమ' టాప్

రేషన్ సరుకుల పంపిణీలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 'మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా' అనే ప్రశ్నకు 74 శాతం మంది అవునని సమాధానమిచ్చారు. 'రేషన్ సరుకుల నాణ్యత ఎలా ఉంది?'అనే ప్రశ్నకు 76 శాతం మంది బాగుందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే ప్రశ్నకు 62 శాతం మంది లేదని చెప్పగా.. అనేక చోట్ల ఈ సమస్య ఉందని పలువురు వినియోగదారులు చెప్పారు. దీంతో 'దీపం-2' పథకం ద్వారా ఏటా ఇచ్చే 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. లబ్ధిదారులు తమకు కావలసినప్పుడు సిలిండర్ పొందవచ్చని చెప్పారు. వారి నుంచి గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, ఇతర స్థాయిల్లో ఎక్కడా అదనంగా డబ్బులు వసూలు చేసే పరిస్థితి ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని.. తాగునీటిపై 44 శాతం, టాయ్‌లెట్ల నిర్వహణపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారని తెలిపారు. బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం, టాయ్‌లెట్ల నిర్వహణపై ప్రయాణికుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని, దీనిని సరిచేసుకోవాలని సూచించారు. ఇక పంచాయతీల్లో గతంతో పోల్చుకుంటే చెత్త సేకరణ మెరుగైందని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి కంపోస్ట్ తయారీ చేపడతామని తెలిపారు.



ప్రభుత్వ సేవల్లో డేటా అనలటిక్స్ కీలకం..

ప్రభుత్వ సేవల విషయంలో డేటా అనలటిక్స్ కీలకమని సీఎం చెప్పారు. డేటా ఆధారంగా ఆయా శాఖలు తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమర్థంగా విశ్లేషిస్తే.. ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవొచ్చని తెలిపారు. ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డేటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు.

45 లక్షల మందికి వాట్సాప్ సేవలు

వాట్సాప్ గవర్నెన్స్‌లో 325 సేవలు అందుతున్నాయని.. 'మన మిత్ర' ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చాక 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించుకున్నారని చంద్రబాబు తెలిపారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లో 300 ఎకరాల్లో ప్రభుత్వ ప్రతిపాదిత డ్రోన్ సిటీ ఏర్పాటు కానుందని.. ఇందులో మొదటి దశను 116 ఎకరాల్లో నెలకొల్పుతున్నారని చెప్పారు. ఇందులో భాగస్వాములయ్యేందుకు 38 సంస్థలు ఆసక్తి చూపించాయన్నారు. టెండర్ల ప్రక్రియ జూన్ 12నాటికి పూర్తవుతుందని వివరించారు.

మీ నాయకత్వ ప్రతిభ అద్భుతం!

చంద్రబాబుకు బిల్ గేట్స్ ప్రశంసలు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): 'మీరు ఆశించే ఏఐ డ్రివెన్ డెసిషన్ మేకింగ్, రియల్ టైమ్ డేటా సిస్టమ్, హ్యూమన్ కేపిటల్ డెవలప్‌మెంట్ వంటివి మీ నాయకత్వ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్‌కే కాదు భారత్ సహా అల్పాదాయ దేశాలకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటూ సీఎం చంద్రబాబుపై గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ప్రశంసల వర్షం కురిపించారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ బృందంతో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం, సమావేశాన్ని ప్రస్తావిస్తూ సీఎంకి ధన్యవాదాలు తెలుపుతూ బిల్ గేట్స్ లేఖ రాశారు. పేదలు - అట్టడుగువర్గాల విద్య, ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని అభినందిస్తున్నానని బిల్ గేట్స్ పేర్కొన్నారు. ఆరోగ్య రంగాన్ని పటిష్ఠపర్చడం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్‌టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడం తదితర అంశాలపై చంద్రబాబుతో జరిపిన చర్చ ఎంతో ఫలవంతంగా ఉందని బిల్ గేట్స్ లేఖలో ప్రస్తావించారు. పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు మీరు చూపిన ఆసక్తి మీ చిత్తశుద్ధికి.. విజన్‌కు నిదర్శనమని బిల్ గేట్స్ ప్రశంసించారు. ఈసారి తాను ఏపీకి వచ్చేనాటికి చంద్రబాబు నాయకత్వంలో తమ భాగస్వామ్యం అద్భుతమైన పురోగతిని సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ - ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం మున్ముందు కొనసాగాలని గేట్స్ తన లేఖలో పేర్కొన్నారు.

21 నుంచి 21 వరకు 'యోగాంధ్ర'

- యోగా డేపై నెలపాటు విస్తృత ప్రచారం: సీఎస్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రాష్ట్రంలోని రెండు కోట్ల మంది భాగస్వాములయ్యేలా చూడాలని, ఇందుకోసం మే 21 నుంచి జూన్ 21 వరకూ యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యోగా డే నిర్వహణపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 21న విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో ప్రధాని మోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొంటారని, దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని, ఇందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీనిపై మంగళవారం సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. కాగా, దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కోర్టు కాంప్లెక్సుల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. ఇందుకోసం రూ.50 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా యోగా డే నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ 'యోగాంధ్ర' పేరిట ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 27 వరకూ ట్రైనింగ్ అండ్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తామని, 28 నుంచి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4 నుంచి 16 వరకూ గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా వంద పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల్లో యోగా డే నిర్వహిస్తామన్నారు.

కుంకీలొస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించడం తెలిసిందే. అప్పట్లో కర్ణాటక ప్రభుత్వంతో పవన్ కల్యాణ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఆరు కుంకీ ఏనుగుల్ని రాష్ట్రానికి కేటాయించారు. బుధవారం సాయంత్రానికి పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు చేరుకుంటాయి. 22న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 4 కుంకీలను పలమనేరులోని క్యాంపునకు, 2 తిరుపతిలోని జూ పార్కుకు కేటాయిస్తారు.

50 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపు

కుంకీ ఏనుగుల కోసం చిత్తూరు జిల్లాలోని పలమనేరు సమీపంలో ముసల్లమడుగు ఎలిఫెంట్ క్యాంపును సిద్ధం చేశారు. ఈ క్యాంపు కోసం 50 ఎకరాల్ని కేటాయించగా.. ప్రస్తుతం 20 ఎకరాల్ని వాడుకున్నారు. ఇక్కడ 4 కుంకీ ఏనుగులకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎలిఫెంట్ బాత్, వాటర్ టబ్, షెడ్లు, కిచెన్, మావిటి క్వార్టర్స్ రోడ్లు, విద్యుత్, సోలార్, సహజ నీళ్ల కుంట, వాటర్ ట్యాంకు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఏనుగుల ఆరోగ్యం కోసం పశువుల ఆస్పత్రి, వైద్యుల కోసం ప్రతిపాదన పెట్టారు. మావిటీలు ఒకరు కేరళ, మరొకరు తమిళనాడుకు చెందినవారు ఉండగా, ఆరుగురు స్థానిక మావిటీలున్నారు. వారందరికీ క్వార్టర్స్‌ను కూడా నిర్మించారు. కర్ణాటక నుంచి కుంకీలు వచ్చాక వాటిని ఈ ప్రాంతానికి అలవాటు పడేలా చేసేందుకు కర్ణాటక నుంచి ఇద్దరు మావిటీలు వచ్చి నెల రోజులు ఉంటారు. కాగా, చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని ననియాలలో రెండు కుంకీ ఏనుగులు ఏళ్లుగా ఉన్నాయి. రాష్ట్రంలో ఇదే తొలి కుంకీ ఏనుగుల కేంద్రంగా ఉండేది. కానీ ఆ రెండు ఏనుగుల వయసు 60 ఏళ్లు దాటడంతో అవి అడవి ఏనుగుల్ని తరమడంలో ఉపయోగపడడం లేదు.



చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో కుంకీల కోసం సిద్ధం చేసిన ముసల్లమడుగు ఎలిఫెంట్ క్యాంపు

కుంకీల ప్రత్యేకత ఇదీ

కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. సాధారణ ఏనుగుల్నే కుంకీలుగా ఎంపిక చేసి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగుల్ని తరిమికొట్టడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు విశ్రమించవు.

కుంకీలు ఎందుకంటే..

పంట పొలాలపై అడవి పందులు, నక్కలు, ఎలుగుబంట్లు వంటి వన్యప్రాణులు దాడి చేస్తుంటాయి. వాటిని రైతులు తరిమికొడుతుంటారు. అయితే ఏనుగుల గుంపు అందుకు భిన్నం. గజరాజుల గుంపు దండెత్తిందంటే.. గ్రామాలు హడలిపోతాయి. ఏనుగులు విరుచుకుపడి పంటల్ని నాశనం చేస్తుంటాయి. మనుషుల్ని తొక్కి చంపేస్తుంటాయి. ఈ పరిస్థితి ముఖ్యంగా చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అధికంగా ఉంది. అలాంటి గజరాజుల్ని కూడా కుంకీ ఏనుగులు వణికిస్తాయి. కర్ణాటక నుంచి వాటిని మన రాష్ట్రానికి తీసుకురావడానికి డిప్యూటీ సీఎం పవన్ కృషి చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కూడా కుంకీ ఏనుగులు కేటాయించాలని పలుమార్లు అసెంబ్లీలో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో అడవి ఏనుగులతో ప్రాణ, పంట నష్టాలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయి. ఏడాదికి కనీసం ఇద్దరు ప్రాణాలు వదులుతున్నారు. ఏటా 5వేల హెక్టార్లలో పంట నష్టం జరుగుతోంది. ప్రతి రోజూ జిల్లాలోని ఏదో ఓ ప్రాంతంలో పంటల్ని నాశనం చేస్తూనే ఉన్నాయి.

శ్రీశైలం డ్యాంపై జలసంఘం కార్యాచరణ!

శాస్త్రవేత్త హనుమంతప్ప సారథ్యంలో ఐదుగురు రాక

ఎల్లుండి వరకు అక్కడే అధ్యయనం

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్, టెయిల్ ఎండ్ ప్రాజెక్టు, ప్లంజ్‌పూల్ పరిస్థితులపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాచరణ చేపట్టింది. ప్రముఖ సైంటిస్టు హనుమంతప్ప సారథ్యంలోని ఐదుగురు శాస్త్రవేత్తల బృందాన్ని సోమవారం ప్రాజెక్టు వద్దకు పంపింది. ఈ బృందం గురువారం (22వ తేదీ) దాకా అక్కడే ఉండి అధ్యయనం చేస్తుంది. జలసంఘం అధ్యయనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని జలవనరుల శాఖ గతంలో పదే పదే కోరినా ఆర్థిక శాఖ దాటవేస్తూ వచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్థిక శాఖతోనే అసలు 'పేచీ' శీర్షికన ప్రచురితమైన కథనంపై సీఎం చంద్రబాబు స్పందించడంతో ఆర్థిక శాఖ దిగొచ్చింది. గత శుక్రవారం రూ.50 లక్షలు విడుదల చేసింది. గతనెల 29, 30 తేదీల్లో జల సంఘం ఇంజనీర్ల బృందం, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని బృందం శ్రీశైలం జలాశయం వద్ద పర్యటించాయి. ఇవి అధ్యయనం చేసేంతవరకు.. డ్యాం స్పిల్‌వే ముందు ఏర్పడిన భారీ గొయ్యిపైనే కేంద్ర రాష్ట్రాలు ఆందోళన చెందేవి. అయితే పైబృందాల అధ్యయనంలో.. దానికంటే పెను ప్రమాదం పొంచి ఉన్నట్లు తేలింది. డ్యాం పునాదుల వద్ద ఏర్పాటు చేసిన స్టీల్ సిలెండర్లు దెబ్బతినడం, ప్రాజెక్టు రాతి గోడలకు ఎలాంటి సిమెంట్ రివిటింగ్ లేకపోవడం, అప్రోచ్ రోడ్ దెబ్బతినడం, డ్యాంను అనుకుని ఉన్న కొండరాళ్లు కోతకు గురికావడం వంటివి బయటపడ్డాయి. తొలుత వీటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని.. లేదంటే ఆనకట్టకే భారీ ముప్పని అనిల్ జైన్ ఏకంగా జలవనరుల శాఖకు లేఖ రాశారు. దీంతో ప్రభుత్వం బిత్తరపోయింది. పునరుద్ధరణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. ఈ క్రమంలోనే హనుమంతప్ప నేతృత్వంలో అధ్యయనం చేయనుంది.

అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు

- మహిళా సాధికారతకు కృషి.. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రాయపాటి శైలజ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాయపాటి శైలజ

అమరావతి, మంగళగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): 'మహిళా సాధికారతే ధ్యేయంగా పని చేస్తా, సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల దాడులను, అఘాయిత్యాలను నిరోధించేందుకు నా వంతు కృషి చేస్తా' అని రాయపాటి శైలజ పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్ పర్సన్‌గా అధికారుల సమక్షంలో పదవీ ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'గతంలో మా వద్ద నమోదైన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తా. అవసరమైతే వాటిని జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు సరైన న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తా. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే వారిపై శాఖాపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటాం. మహిళలు తమపై జరుగుతున్న దాడులను నేరుగా నా దృష్టికి తీసుకువచ్చేందుకు మా శాఖ ద్వారా నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నాం. కూటమి ప్రభుత్వం నాపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తా. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాను. బాధితులకు సత్వరమే న్యాయ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తా' అని శైలజ తెలిపారు. ఈ సందర్భంగా కీలక బాధ్యతలు అప్పజెప్పిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు ఫైలుపై చైర్‌పర్సన్ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు... మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం రామకృష్ణ, వ్యాపారవేత్త రాయపాటి గోపాలకృష్ణ, రమేశ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేశ్ బాబు, టీడీపీ నేత శివ నాగమల్లేశ్వరరావు అభినందనలు తెలిపారు.

కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవి: కొల్లు

- ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగుణమ్మ



బాధ్యతలు చేపడుతున్న సుగుణమ్మ

అమరావతి, విజయవాడ(గాంధీనగర్), మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవి వస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మన్నూరు సుగుణమ్మ ప్రమాణస్వీకార వేడుక గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'పొత్తుల్లో భాగంగా పార్టీ తనకు సీటు కేటాయించకపోయినా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి గెలుపునకు సుగుణమ్మ ఎంతో కృషి చేశారు. గతంలో ఎమ్మెల్యేగా తిరుపతి ప్రజలకు సేవలందించిన సుగుణమ్మకు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సేవలందించేందుకు అవకాశం వచ్చింది' అన్నారు. ఈ సందర్భంగా తనకు ఆమె కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. సుగుణమ్మ మాట్లాడుతూ, 'నాపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిని మరింత సుందరంగా తీర్చిదిద్దుతా. రాజధాని అమరావతిని పచ్చదనంతో నింపేందుకు నా వంతు కష్టపడి పనిచేస్తా' అని అన్నారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, పులివర్తి నాని, శ్రావణి, ఎమ్మెల్సీ గ్రీష్మ, బిలాపురం వెంకయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెను అభినందించారు.

ఉగ్ర కదలికలపై అప్రమత్తం!

సానుభూతి పరులను గుర్తించండి

- అనుమానితుల వివరాలు వెలికితీయండి
- సీఎస్, డీజీపీలకు డిప్యూటీ సీఎం లేఖలు

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో ఉగ్రవాద సానుభూతి పరుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్ అరెస్టు, అతనికి నిషేధిత ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థతో సంబంధాలున్నాయని తేలడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర పోలీసులను అప్రమత్తం కావాలని సూచించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ మేరకు పల సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలకు సోమవారం ఆయన లేఖలు రాశారు. ఇదే సమయంలో సాధారణ పరిపాలన శాఖకు కూడా పలు సూచనలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం వచ్చిందని, దీనిపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విజయనగరంలో సిరాజ్ అనే యువకుడికి ఐఎస్‌తో సంబంధాలున్నాయని, పేలుళ్లకు కుట్రపన్నిన విషయాన్ని తెలుగు రాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించి అరెస్టు చేసిన క్రమంలో కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్ అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికి, వారి కదలికలపై అన్ని జిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తం కావాలన్నారు. ఎక్కడైనా ఉగ్రనీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

వారికి.. ఐడీలున్నాయా?

రాష్ట్రంలోని అక్రమ వలసదారులు, ఉగ్రవాద సానుభూతిపరులపై ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని అనుసరించి మరింత లోతుగా విచారణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. గతంలో రాష్ట్రంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాలు జరిగి ఉంటే వాటిలో పాల్గొన్న వారిపై పూర్తి స్థాయి నిఘా అవసరమని తెలిపారు. ఉత్తరాంధ్ర, గోదావరి, మన్యం జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ లేఖలో రోహింగ్యాల విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుంటూరుతో పాటు ఇతర జిల్లాల్లో రోహింగ్యాల ఉనికి ఉందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. వీరిలో కొందరికి రేషన్, ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయనే సమాచారం వస్తోందని, ఇది ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. అనుమానితులు ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ మొదలైన గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారా?. ఉంటే.. వీటిని వారు ఎలా పొందారు? వారికి ఆశ్రయం ఇచ్చిందెవరు? స్థానికంగా వారికి ఎవరు సౌకర్యాలు కల్పిస్తున్నారు? వారికి సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.



జాతీయ, ప్రజల భద్రత ముఖ్యం

జాతీయ భద్రత, ప్రజల భద్రత అత్యంత ప్రాధాన్యంతాంశంగా పరిగణించి తక్షణం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. కొన్నేళ్ల కిందట గుంటూరు, గతేడాది రాయలసీమ ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు దాడులు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ఆ విషయాలను గమనంలోకి తీసుకోవాలని సూచించారు. దేశ భద్రత, ప్రజల రక్షణ అనేవి అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నవని తెలిపారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగం శాంతి భద్రతలతో పాటు అంతర్గత భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తేనే.. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర సహకారం తోడవుతుందని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంటులో సమ్మె సైరన్

- నేటి నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె
- రెగ్యులర్ కార్మికులు ఒకరోజు.. విరమించాలన్న యాజమాన్యం
- వెనక్కి తగ్గేది లేదన్న కార్మిక సంఘాలు



ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), మే 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలోని స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు. ప్లాంటులో ఇటీవలి వరకూ 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండేవారు. అందులో 1,750 మందిని అధికారికంగా, 1,000 మందిని అనధికారికంగా తొలగించారు. దీంతో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించబోమంటూ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. మరోవైపు ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6గంటల వరకూ కార్మికులు (నాన్-ఎగ్జిక్యూటివ్ కేడర్) సమ్మె చేయనున్నారు. ప్లాంటును ప్రైవేటీకరించొద్దని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని, ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నట్టు సంఘాల నాయకులు తెలిపారు. సమ్మె యోచన విరమించుకోవాలని యాజమాన్యం, ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) కోరినా నిరాకరించారు. స్పష్టమైన హామీ ఇస్తేనే విరమిస్తామని చెప్పారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో మంగళవారం నుంచి అధికారులు 2 షిఫ్టుల్లో విధులు నిర్వహించాలని యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు భారీ బందోబస్తుకు పోలీసులు సిద్ధమయ్యారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నేతృత్వంలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 208 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంటు పరిసర ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

తొలగించిన 'ఉక్కు' కార్మికులను తక్షణమే తీసుకోవాలి

- లేకుంటే రేపటి నుంచి ఆమరణ దీక్షకు దిగుతా: షర్మిల



అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): 'విశాఖ స్టీల్ ప్లాంట్‌లో విధుల నుంచి తొలగించిన 2,000 మంది కాంట్రాక్టు కార్మికులను 24 గంటల్లోగా విధుల్లోకి తీసుకోవాలి. లేకుంటే కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా 21 నుంచి ఆమరణ దీక్షకు దిగుతా' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అల్టిమేటమ్ ఇచ్చారు. 'ఇప్పటికే రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికుల పొట్టగొట్టిన యాజమాన్యం... మరో 3,000 మందిని రోడ్డున పడేసేందుకు కుట్రలు చేయడం దుర్మార్గం. అన్యాయాన్ని ప్రశ్నించిన కార్మికులను సైతం ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయడం దారుణం. తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. రెగ్యులర్ ఉద్యోగులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాలి. లేకుంటే కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా 21 నుంచి స్టీల్ ప్లాంట్ బయటే 'ఆమరణ దీక్షకు దిగుతాం' అని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

నరసరావుపేట లీగల్/గుంటూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు సోమవారం ముగిశాయి. తీర్పును మంగళవారానికి వాయిదా వేస్తూ నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. గాయత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలపై ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్లో బోరుగడ్డపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇక పెదకాకాని మండల సర్వేయర్‌ను సర్వే సర్టిఫికెట్ కోసం బెదిరించి, ఆయన విధులకు ఆటంకం కలిగించిన కేసులో బోరుగడ్డ 8 ఏళ్లుగా కోర్టుకు గైర్హాజరవుతున్నాడు.

మదనపల్లెలో పెద్దిరెడ్డి కబ్జా

(మొదటి పేజీ తరువాయి)

1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన పెద్దిరెడ్డి కుటుంబం.. చుట్టూ స్తంభాలు నాటి ఫెన్సింగ్ వేసింది. బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. తాజాగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, స్థానిక తహశీల్దార్ ధనంజయులు దీనిపై దృష్టి సారించారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం మండల సర్వేయర్ రెడ్డి శేఖర్‌బాబు, ఆర్ఐ భరత్‌రెడ్డి క్షేత్రస్థాయికి వెళ్లారు. సర్వే నంబర్ 552లోని పదెకరాలకు సరిహద్దులు నిర్ణయించి సర్వే చేశారు. ఇందులో పెద్దిరెడ్డి భార్య పేరున ఉన్న భూమికి ఆనుకుని సర్వే నంబర్ 552-1లో ఉన్న 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసినట్లు గుర్తించి హద్దులు నిర్ణయించామని తహశీల్దార్ ధనంజయులు పేర్కొన్నారు. ఆ 1.35 ఎకరాలను కలెక్టర్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుని ట్రెంచ్ కొట్టి.. హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆక్రమిత భూమి చుట్టూ ఉన్న సిమెంటు స్తంభాలు, ఫెన్సింగ్ కమ్మిని తొలగించారు.



పెద్దిరెడ్డి కుటుంబం ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను తీసేసి.. తొలగించిన సిమెంటు స్తంభాలు

ఫారెస్టు అధికారిని వెంటాడిన అవినీతి కేసు

2006లో నమోదు.. 2025లో శిక్ష.. ప్రభుత్వ పింఛను నిలుపుదల

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనతో ఆస్తులు కూడబెట్టుకున్న ఓ అధికారిని నేరం వెంటాడింది. 19 ఏళ్ల గడిచినా.. 70 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్నా.. శిక్ష అనుభవించక తప్పలేదు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఫారెస్టు డిపార్టుమెంట్‌లో జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సెల్ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా కాసకాని సత్యనారాయణ విధులు నిర్వర్తించేవారు. ఉద్యోగంలో ఉండగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో ఏసీబీ 2006 మార్చి 13న కేసు నమోదు చేసి రూ.22,17,563 విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. తర్వాత 2012 మే 31న సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందారు. కేసు విచారణ అనంతరం రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక కోర్టు ఈ ఏడాది మార్చి 26న తీర్పు ఇచ్చింది. నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించింది. కోర్టు శిక్ష విధించడంతో సత్యనారాయణకు పింఛను, గ్రాట్యుటీని శాశ్వతంగా నిలుపుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అమరావతిలో గలీజు పని



(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. రాజధాని నిర్మాణం కోసం గుంటూరు జిల్లాలో రోడ్ మెటల్, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మైనింగ్ లీజులను అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకు ఇచ్చేలా, వాటికి మాత్రమే మెటీరియల్ పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అమరావతి పనుల్లో వేగం పెరిగాక రోడ్ మెటల్, గ్రావెల్ కొరత రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయం తెలిసి కూడా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి మైనింగ్ లీజు ఇప్పించాలని చూశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ అధికారితో ఈ మేరకు ప్రతిపాదన పంపించారు. ఇది చూసి గనుల శాఖ ఉన్నతాధికారి కంగుతిన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. లీజు ప్రతిపాదన వ్యవహారంలో కీలక వ్యక్తి వద్ద మొన్నటి వరకు పనిచేసిన ఓ రిటైర్డ్ అధికారి పాత్ర ఉన్నట్లు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘించి..

అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వర్క్‌ల కోసం భారీగా రోడ్ మెటల్, గ్రావెల్ అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో అమరావతి పరిధిలో మైనింగ్ లీజులు, ప్రత్యేకించి రోడ్ మెటల్, గ్రావెల్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో, ప్రత్యేకంగా సీఆర్‌డీఏ జోన్‌లో అమరావతి నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీలకే లీజులు లేదా సరఫరా కాంట్రాక్టు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అది కూడా నామినేషన్ ప్రాతిపదికన ఇవ్వాలని ఆదేశించింది. దీని ప్రకారం అమరావతి నిర్మాణ పనులు చేయని కంపెనీలకు, వ్యక్తులకు మైనింగ్ లీజులు, సబ్ లీజులు ఇవ్వడానికి వీల్లేదు. అయినా గనుల శాఖలోని కీలక వ్యక్తి తన తోడల్లుడికి అమరావతిలో సివిల్ వర్క్‌లు ఇప్పించాలనుకున్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలోని రోడ్ మెటల్, గ్రావెల్ లీజులను తోడల్లుడికి చెందిన కంపెనీకి ఇవ్వాలని గుంటూరు గనుల అధికారి వద్ద దరఖాస్తు ఇప్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ కంపెనీకి నామినేటెడ్ ప్రాతిపదికన లీజులు ఇచ్చే అవకాశమే లేదు. కనీసం ఆ కంపెనీ దరఖాస్తును కూడా స్వీకరించకూడదు. కానీ గనుల అధికారి అవేవీ పాటించలేదు. దరఖాస్తును పరిగణనలోకి తీసుకొని, ఆ కంపెనీకే 22-1లోని లీజులు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. అయితే ఆ కంపెనీ అమరావతి పరిధిలో ఏ వర్క్‌లు చేస్తుందో పొందుపరచలేదు. ఈ ప్రతిపాదనపై అనుమానం వచ్చి గనుల ఉన్నతాధికారి సమగ్ర విచారణ చేశారు. సంబంధిత అధికారిని పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. తొలుత నిబంధనల ప్రకారమే పంపించానని చెప్పారు. ఆ తర్వాత మాట మార్చి గనుల శాఖలో కీలక వ్యక్తి వద్ద మొన్నటి వరకు పనిచేసిన రిటైర్డ్ అధికారి ఒత్తిడి మేరకే ప్రతిపాదించినట్లుగా అసలు విషయం నివేదించారు.

కీలక వ్యక్తి వర్సెస్ ఉన్నతాధికారి

మైనింగ్ లీజు ప్రతిపాదనలో పెద్దల పాత్ర ఉండటంతో అధికారులు సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో గోల్‌మాల్ ఉందని, వెంటనే సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీఎంవో ఆదేశించింది. అమరావతిలో వర్క్‌లు చేసే కంపెనీలకే లీజులు ఇవ్వాలని, బయటి వాటిని పరిగణనలోకి తీసుకోవద్దని అధికారులు ఆదేశించారు. సీఎంవో ఆదేశాల మేరకు గనుల శాఖ గుంటూరులో ఉన్న సదరు అధికారికి షోకాజ్ జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా లీజు ప్రతిపాదన ఎందుకు పంపించారు? మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే ఆ అధికారికి నోటీసివ్వడం గనుల శాఖలోని కీలక వ్యక్తికి ఆగ్రహం తెప్పించింది. తనకు తెలియకుండా నోటీసు ఎలా ఇస్తారంటూ ఆ శాఖ ఉన్నతాధికారికి ఫోన్ చేసి నిలదీసినట్టు తెలిసింది. 'సీఆర్‌డీఏ పరిధిలో అమరావతి వర్క్‌లు చేసే కంపెనీలకే లీజులివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ఆ అధికారి ప్రతిపాదన పంపించారు. సీఎంవో ఆదేశాల మేరకే షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సి వచ్చింది' అని ఉన్నతాధికారి వివరణ ఇచ్చారు. అయినా కీలక వ్యక్తి శాంతించలేదని తెలిసింది. దీంతో ఈ వ్యవహారం పంచాయితీగా మారి మరోసారి ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరినట్లు తెలిసింది. కీలక వ్యక్తి వద్ద పనిచేసిన రిటైర్డ్ అధికారి వ్యవహారం మరోసారి చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఆయన సిఫారసుల పేరిట వివిధ జిల్లాల నుంచి వచ్చిన లీజు ప్రతిపాదనలను పునఃపరిశీలన చేయాలని గనుల శాఖను ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించినట్లు తెలిసింది.

సెల్ఫీ తీసుకున్నంత ఈజీగా వైద్యపరీక్షలు!

- నిలోఫర్ ఆస్పత్రిలో దేశంలోనే తొలి 'నాన్ ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్' టూల్ అందుబాటులోకి



ఏఐ -ఆధారిత నాన్-ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రక్తపోటు ఎంతుందో తెలుసుకోవడానికి పరికరాలున్నాయి! కానీ.. అందుకు ఒక పట్టీని చేతికి ధరించి, అది గట్టిగా చేతికి బిగుసుకుని రక్తపోటును కొలిచేదాకా వేచి చూడాలి. గడిచిన 2-3 నెలల్లో మన రక్తంలో చక్కెర స్థాయులు ఎంతున్నాయో తెలుసుకోవడానికి చేసే పరీక్ష హెచ్‌బీఏ1సీ. దీనికి మన చేతి నుంచి రక్తం తీసుకుని పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండా.. సెల్ఫీ తీసుకున్నంత సులభంగా కెమెరాల సాయంతో రోగనిర్ధారణ పరీక్ష చేయగలిగితే? 'అమృత్ స్వస్థ్ భారత్ టూల్' పేరిట అలాంటి పరీక్షలు చేసే అద్భుతమైన 'నాన్ ఇన్వేజివ్ బ్లడ్ టెస్టింగ్ టూల్'ను దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. మన శరీరంలో ప్రవహించే రక్తపరిమాణాన్ని 'బ్లడ్ వాల్యూమ్' అంటారు. మన రక్తపోటు నియంత్రణలో/నిర్ణీత స్థాయుల్లో ఉండాలంటే అందుకు ఈ బ్లడ్ వాల్యూమ్ చాలా కీలకమైనది. దాంట్లో తేడాలు వస్తే మన శరీరం కాంతిని శోషించుకునే విధానంలో తేడాలు వస్తాయి. 'అమృత్ స్వస్థ్ భారత్' టూల్‌లోని రిమోట్ ఫొటోప్లెథిస్మోగ్రఫీ (పీపీజీ).. మన శరీరం కాంతిని శోషించుకునే తీరును పరిశీలించి, ఆ సమాచారాన్ని ఏఐ, డీప్‌లెర్నింగ్ ద్వారా విశ్లేషించి.. రక్తపోటు ఎంత ఉంది? ఆక్సిజన్ స్థాయులు (ఎస్పీవో2) ఎంత? హృదయ స్పందనల రేటు, శ్వాసక్రియ రేటు, హార్ట్ రేట్ వేరియబిలిటీ (హెచ్ఆర్‌వీ), హెచ్‌బీఏ1సీ స్థాయులు, పల్స్ రెస్పిరేటరీ కోషెంట్ (పీఆర్‌క్యూ) తదితర వివరాలను 20 నుంచి 60 సెకన్లలోపే తెలియజేస్తుందని నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.

మద్యం కుంభకోణంలో ఈడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

- నేడు విచారించనున్న ఏసీబీ కోర్టు
- గోవిందప్ప కస్టడీపై తీర్పు రిజర్వు
- 'సజ్జల' బెయిల్‌పై విచారణ వాయిదా

విజయవాడ, మే 19(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి వాంగ్మూలం నమోదుకు అనుమతి కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. రాజశేఖర్‌రెడ్డికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీని కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును ఏసీబీ కోర్టు మంగళవారానికి రిజర్వ్ చేసింది. గోవిందప్ప బాలాజీ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరో నిందితుడు, విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఇక ఈ కేసులో కసిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు సోమవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై వాదనలను కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

వైసీపీ నేత నందిగంకు 14 రోజుల రిమాండ్

- టీడీపీ కార్యకర్తపై దాడి కేసు

మంగళగిరి సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తపై దాడి చేసిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజుపై నందిగం సురేశ్ శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ కేసులో సురేశ్‌ను ఆదివారం అరెస్టు చేసిన పోలీసులు, సోమవారం మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి జూన్ రెండో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య నందిగం సురేశ్‌ను గుంటూరు జైలుకు తరలించారు. సురేశ్‌పై బీఎన్ఎస్ చట్టం ప్రకారం 141 (1), 127 (2), 109 (1), 351 (2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉన్నట్టు వెల్లడించారు. నందిగంపై ఇప్పటికే 12 కేసులు ఉన్నాయి. మరియమ్మ అనే మహిళ హత్య కేసు, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఆయన జైలుకు వెళ్లి వచ్చారు.

మధు బెయిల్‌పై రేపు తీర్పు

విజయవాడ, మే 19(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు 1 పరీక్ష అక్రమాల కేసులో రెండో నిందితుడు పమిడికాల్వ మధుసూదన్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును కోర్టు బుధవారానికి రిజర్వ్ చేసింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మధుసూదన్ విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో తీర్పును 21న వెలువరిస్తామని న్యాయాధికారి దేవిక ప్రకటించారు.

మద్యం కేసులో.. కసిరెడ్డి పిటిషన్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్

- నిర్ణయం సానుకూలంగా రాకుంటే.. బెయిల్ కోసం హైకోర్టుకే వెళ్లాలన్న ధర్మాసనం





న్యూఢిల్లీ, మే 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి, ఆయన తండ్రి ఉపేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తుది తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు అనుకూలంగా రానిపక్షంలో బెయిల్ కోసం హైకోర్టునే ఆశ్రయించాలని రాజ్ కసిరెడ్డికి సూచించింది. మద్యం స్కాం కేసులో సీఐడీ సీఆర్పీసీ 160 ప్రకారం తనకు నోటీసులు జారీ చేసిందని, హైదరాబాద్‌లో ఉంటున్న తనకు నోటీసులు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీకి లేదంటూ గత నెల 10న కసిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడి అరెస్టు అక్రమమని, జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన తండ్రి ఉపేందర్‌రెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించడంతో ఆ తీర్పును ఉపేందర్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ రెండు పిటిషన్లను కలిపి సోమవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మహేశ్ జెఠ్మలానీ, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది రమేశ్ అల్లంకి హాజరయ్యారు. తొలుత మహేశ్ జెఠ్మలానీ వాదనలు వినిపిస్తూ.. కసిరెడ్డి అరెస్టు అక్రమమని.. సీఆర్పీసీ 160 ప్రకారం మరో రాష్ట్రంలో నివసిస్తున్న వ్యక్తికి సమన్లు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీకి లేదని తెలిపారు. ఏప్రిల్ 21న విచారణకు స్వచ్ఛందంగా హాజరవుతానని చెప్పినప్పటికీ.. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారని.. అరెస్టు చేసినప్పుడు లేని సెక్షన్లను కుట్రపూరితంగా రిమాండ్ రిపోర్ట్‌లో చేర్చారని పేర్కొన్నారు. అరెస్టు చేసినప్పుడు 409, 420 సెక్షన్ల ప్రకారం అదుపులోకి తీసుకున్నారని.. రిమాండ్ రిపోర్ట్‌లో మాత్రం అవినీతి నిరోధక చట్టాన్ని చేర్చారని తెలిపారు. రాజ్ కసిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగా అని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించగా.. ఆయన గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రికి ఐటీ సలహాదారుగా పనిచేశారని జెఠ్మలానీ బదులిచ్చారు. ఎక్సైజ్ పాలసీకి, కసిరెడ్డికి ఎటువంటి సంబంధమూ లేదన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ, 19 సెక్షన్ల ప్రకారం సీఐడీ ఎటువంటి అనుమతులూ తీసుకోలేదని తెలిపారు. అయితే ఈ సెక్షన్లపై విస్తృత ధర్మాసనానికి ఇప్పటికే నివేదించామని జస్టిస్ పార్దీవాలా గుర్తుచేశారు. దీనికి సంబంధించి ఏమైనా చెప్పాలనుకుంటే.. చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత విస్తృత ధర్మాసనం ఎదుటే వినిపించాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం తరఫున లూథ్రా వాదనలు వినిపించారు. అరెస్టు సమయంలోనూ, కస్టడీ సమయంలోనూ పీసీ యాక్టుపై రాజ్ కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయలేదని.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో మాత్రం అభ్యంతరాలు లేవనెత్తారని తెలిపారు. కసిరెడ్డి చెబుతున్న దానికి, సుప్రీంకోర్టులో ఆయన తరఫు న్యాయవాదుల వాదనలకు పొంతనే లేదన్నారు. ఏపీ మద్యం కుంభకోణం చిన్న విషయమేమీ కాదని, రూ.వందల కోట్ల అవినీతికి సంబంధించిన అంశమని.. ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం జరిగిందని తెలిపారు. కసిరెడ్డి అరెస్టులో నిబంధనలు అతిక్రమించలేదని అగర్వాల్ పేర్కొన్నారు. మరోసారి వాదనలు వినిపించేందుకు జెఠ్మలానీ సిద్ధమవగా.. ఇప్పటికే సుదీర్ఘంగా ఆలకించామని.. దీనిపై తమకు స్పష్టత వచ్చిందని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. సాయంత్రంలోపు ఇరుపక్షాల వాదనలను 2పేజీలకు మించకుండా లిఖితపూర్వకంగా అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. నిర్ణయం సానుకూలంగా రాకపోతే.. బెయిల్ కోసం హైకోర్టునే ఆశ్రయించాలని కసిరెడ్డికి సూచిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- అక్రమ మైనింగ్ కేసులో హైకోర్టును ఆశ్రయించిన వల్లభనేని వంశీ
- విచారణ నేటికి వాయిదా



అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌పై గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టులో సోమవారం అత్యవసరంగా హౌస్‌మోషన్ పిటిషన్ వేశారు. దీనిని హైకోర్టు చేపట్టి.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని విజయవాడ రూరల్, బాపులపాడు గన్నవరం మండలాల పరిధిలో వంశీ అక్రమ మైనింగ్‌కు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు రూ. 195 కోట్ల నష్టం చేశారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖ తేల్చింది. దీనిపై గన్నవరం పోలీసులు ఈనెల 14న కేసు నమోదు చేశారు. వంశీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై అర్ధరాత్రి కేసు నమోదు చేశారన్నారు. ప్రతీ కేసులోనూ ఎంఎండీఆర్ యాక్ట్‌ను చేరుస్తున్నారన్నారు. కిడ్నాప్ కేసులో బెయిల్ మంజూరయ్యాక ఫేక్ పట్టాల కేసుపై తిరిగి దర్యాప్తు జరిపి ఆ కేసులో అరెస్ట్ చేశారన్నారు. ప్రస్తుత కేసులో పీటీ వారెంట్ జారీచేస్తే ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకమవుతుందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై కేసు నమోదులో చట్టనిబంధనలు పాటించామన్నారు. ఫేక్ పట్టాల జారీ కేసులో పిటిషనర్ మొదటి నిందితుడిగా ఉన్నారన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక చార్జిషీట్‌లో పేరు చేర్చకుండా పిటిషనర్ దర్యాప్తు అధికారిని ప్రభావితం చేశారన్నారు. సంబంధిత మేజిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకుని తిరిగి నిందితుడిగా చేర్చామన్నారు. ఈ దశలో న్యాయమూర్తి పీటీ వారెంట్‌పై ఆరా తీశారు. వివరాలు సమర్పించేందుకు పీపీ సమయం కోరారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి విచారణ ప్రారంభమయ్యాక పీటీ వారెంట్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడిందని పీపీ కోర్టుకు నివేదించారు. ముందస్తు బెయిల్‌తో పాటు పీటీ వారెంట్ కోసం ఒత్తిడి చేయకుండా పోలీసులను నిలువరించాలంటూ వేసిన అనుబంధ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

ఆ కల్తీ సారా మరణాల గుట్టు తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. అవి సహజ మరణాలంటూ బుకాయించింది. అయితే.. అవి కచ్చితంగా కల్తీ సారా మరణాలేనని అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ప్రకటించారు. సీఎంగా జగన్ తీరు అప్పట్లోనే తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆ మరణాలపై ఇప్పుడు ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో ఏం జరిగిందనేది డీజీపీ హరీ‌శ్‌కుమార్ గుప్తా ఒక నివేదికను సమర్పించారు. దాని ఆధారంగా ఈ ఘటనపై విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ నేతృత్వం వహించే ఈ టాస్క్‌ఫోర్స్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్, రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ మరణాలపై అప్పట్లో 4కేసులు నమోదయ్యాయి. వాటిపై బృందం దృష్టి సారించనుంది.

అప్పుడేం జరిగిందంటే..

జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో 2022 మార్చి 7-16వ తేదీ మధ్యలో 20 మందికిపైగా పిట్టల్లా రాలిపోయారు. వాంతులు, కడుపునొప్పి, నాడి పడిపోవడం, నిస్సత్తువతో కుప్పకూలిపోవడం వంటి ఒకేరకమైన లక్షణాలు మరణించడానికి ముందు అందరిలో కనిపించాయి. చాలామంది ఆస్పత్రికి తీసుకెళ్లకముందే చనిపోయారు. కల్తీ మద్యం తాగి తమ వారంతా చనిపోయారని బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరు అయ్యారు. ప్రభుత్వం మాత్రం బాధితుల ఆరోపణలను తోసిపుచ్చింది. విచారణకు ఆదేశించడంగానీ, జిల్లా యంత్రాంగం నుంచి నివేదికలు తెప్పించుకోవడంగానీ చేయలేదు. వరుస మరణాలు సంభవిస్తుండగానే, మార్చి 14న జంగారెడ్డిగూడెం చేరుకున్న చంద్రబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు. జగన్ ప్రభుత్వం కళ్లు మూసుకోవడమే కల్తీసారా మరణాలకు కారణమని ఆయన ఆగ్రహించారు. శాసనమండలిలో వైసీపీ ప్రభుత్వాన్ని టీడీపీ సభ్యులు నిలదీశారు. ఈ ఘటనపై విచారణ జరపాలని గట్టిగా డిమాండ్ చేశారు. దీనిపై నిరసన తెలుపుతున్న టీడీపీ సభ్యులను మండలి నుంచి సస్పెండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో నాటుసారా తయారీయే లేదని అసెంబ్లీలో జగన్ చేసిన ప్రకటన రాష్ట్రమంతా నిరసనలు, ఆందోళనలను రాజేసింది. సారా మరణాలపై ప్రభుత్వం అబద్ధాలు ఆడటంపై ఎక్కడికక్కడ ప్రజా సంఘాలు విరుచుకుపడ్డాయి.

దుబాయ్ నుంచి బంగారాన్ని తరలించిన ధనుంజయ్‌రెడ్డి తాలూకు మహిళ

- ఆ బంగారానికీ, మద్యం స్కాంకు ఉన్న లింకునూ సిట్ దర్యాప్తు చేయాలి: వర్ల రామయ్య

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): 'మద్యం స్కాంలో ఇప్పటి వరకు పాత్రధారులే బయటకు వచ్చారు. అసలు సూత్రధారి ఎవరో తేల్చే దిశగా సిట్ విచారణ చేస్తోంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వర్ల విలేకరులతో మాట్లాడారు. 'సిట్ విచారణతో వైసీపీ నేతలకు తడిసిపోతోంది. అందుకే తమ రేత పత్రికలో పుంఖాను పుంఖాలుగా అబద్ధాలు రాస్తూ.. ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారు. దుబాయ్‌లో సిట్ కూర్చుంటే ఇక్కడ వైసీపీ నేతలు అందరూ స్టాండింగ్ పొజిషన్‌లో నిలబడుతున్నారు. సిట్ దుబాయికి వెళ్లి విచారణ మొదలుపెడితే మాకు రాజకీయాలు వద్దని దోపిడీదారులు పారిపోతున్నారు. అవినీతికి పాల్పడిన వ్యక్తి ఏ స్థాయి వారైనా చట్టం క్షమించదు. శిక్ష తప్పదు. మద్యం కుంభకోణంతోపాటు వైసీపీ హయాంలో ధనుంజయ్‌రెడ్డికి సంబంధించిన ఓ మహిళ దుబాయ్ నుంచి తరలించిన బంగారంపైనా సిట్ దర్యాప్తు చేయాలి. ఆ బంగారానికి, మద్యం స్కాంకు ఉన్న లింకును తేల్చాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లను ఎలా అరెస్టు చేస్తారని ప్రభుత్వాన్ని అంబటి ప్రశ్నిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు అయితే చట్టానికి అతీతులా..?' అని వర్ల ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.